Approved by the Text Book Committee of Madras,
Vide P. 233 C. list dated 10-5-38.

నా రాజు.

గ్రంథకర్త:

తాళ్ళూరి సుబ్బారావు.

WITH A FOREWORD
BY

PHARSHI RAGHAVENDRA ROW GARU, B. A.,
HD. MASTER, GOVT. TRAINING SCHOOL.
ELLORE.

ప్రకాశకులు:

సుందరరాం అండ్ సన్సు.,

తెనాలి.

Reprint 1938.

 [వెల అ. 10.

కృతి సమర్పణము.

నాయెడల నవ్యాజకరుణ వహించి, విద్యాబుద్ధులు జెప్పించి, నన్నొక గృహస్థునిగాఁజేసి మించిన; ఆదయా సాగరుఁడు, బంధుజన కల్పద్రుమము, భాగవతాగ్రేసరుడు, సద్గుణ విరాజితుఁడు, రాజకార్య ధురంధరుఁడు నా బావగారు కీర్తిశేషులైన భోగరాజు లక్ష్మీనరసింహం పంతులుగారికి యీ కావ్య కన్యకను భక్తిపూర్వకముగ సమర్పించుకొనుచున్నాడను.

ఇట్లు,

గ్రంథకర్త.

తొలిపలుకు.

ఈకథ మదరాసు సుగుణవిలాస సభవారిచే నాటకరూపమునఁ బ్రదర్శింపఁబడుట జూచితిని. అప్పటినుండియు నవలారూపమున వ్రాయవలయునని కుతూహలము కలుగ స్వశక్తిం దలంపక ప్రారంభించితిని. నాటకమునకును నవలకును మిగుల భేదముండును. ఆకారణమునఁ గావలసిన మార్పులతో నెట్లో పూర్తిజేసితిని. కథాభాగమంతయుఁ దమ రాజు నిమిత్తమనేక శ్రమలందినవారి పవిత్ర వీరచరిత్రము తోడ నిండియుండుటం జేసి గ్రంథమునకు "నారాజు" అను పేరు పెట్టఁబడినది.

అల్పజ్ఞాన వయస్కుఁడనైన నారచనయందు గుణదోషముల విమర్శించు భారము రసజ్ఞులగు సదయ హృదయులపై యున్నది.

ఇట్లు,
తాళ్ళూరి సుబ్బారావు,
గ్రంథకర్త.

ఏలూరు,
1—11—1932

FOREWORD.

ఇటీవల నున్నత పాఠశాలలందుఁ దెనుఁగునఁ బఠనీయ గ్రంథములుగ నేర్పఱచు పుస్తకముల కథాంశము లన్నియు నితిహాస పురాణాదులనుండి సేకరింపఁబడినవి. కాని చారిత్రాత్మకములుగను దైవభక్తి, దేశభక్తి, రాజభక్తియున్నగు సదాదేశముల జూపునవిగను మనోజ్ఞమగుశైలిని వ్రాసినవి గను నున్న పొత్తముల నియమించు టరిది.

రాజభక్తిపట్ల స్వార్థత్యాగముల నొనర్చి యెట్టి యిక్కట్టులకు లోనైనను దృఢమనస్కులై యార్జించిన యశః కిరణములచేఁ బ్రపంచమును వెలుఁగొందించిన మహాపురుషుల యొక్కయు పతివ్రతామణులగు వీరనారీమణుల యొక్కయు జీవిత చర్యలను "నారాజు" పాఠకులకుఁ దెలుపుచున్నది. ఇట్టిపుస్తకములను జదువుటచే సద్బుద్ధులు పిల్లల కలవడును. భాషాజ్ఞానము పెంపొందును. కావున పాఠశాలాధిపతులు దీనిని మన్నింతురుగాక.

ఏలూరు,
20-12-33.

ఇట్లు,
ఘారపీ రాఘవేంద్రరావు.

మొదటి కూర్పు 1932
రెండవ కూర్పు 1934
మూడవ కూర్పు 1938

శ్రీరస్తు.

నారాజు.

మొదటి ప్రకరణము.

"ఔరా! కాలమహిమ! కళింగ సామ్రాజ్య రత్న సింహాసనాసీన సునాశీర వైభవుఁడును, శ్రీమదిందిరానాథ చరణారవింద నిష్యందితామంద మకరంద రసాస్వాదనా మోద సుఖోన్మత్త చిత్తమధువ్రతుఁడును, నాశ్రితవిద్వ దుద్యోగి ప్రముఖ నిఖిల జనసముదయత్రాణ పరాయణుఁడును, నిరతావృత యాచకచ్ఛటా కపటచాతకవ్రాత నూతనాసారాయిత దైనందిన దాన ధారాపటలుఁడును, శరణాగత రక్షణ విచక్షణా క్షీణ నిర్లక్షితాంబుజాక్షుఁడును, నిరుపమ కరుణారస సాగరుండును, నగు విక్రమాదిత్యమహారాజిట్టి దుర్మరణము నందవలసినవాఁడేనా? అవురా! రాజ్యకాంక్ష యెంతచేసినది! అక్కటా! నిజసోదరుఁడైన విక్రమాదిత్యుని విషప్రయోగముఁ జేయించి చంపుటకా మదాలస చిత్తమెట్లు సమ్మతించెనో కదా! నిశ్చయముగా నీమె నొక రాక్షసిగాఁ దలంపవలయును. కాకున్న గళింగసామ్రాజ్యమంతయుఁ దన నెత్తిపైఁ బెట్టుకొని యూరేగవచ్చునని భావించియే కదా సోదరుండనియైన భావింపక రాజేంద్రునిఁ జంపి, స్వాతంత్ర్య

మున కేమయిన భంగమొదవునేమో యని భర్తనుగూడ యమపురికంపినది. మదాలసా! ఇంక నెన్ని దుష్టకృత్యములు జేయనెంచితివో! రాజకుమారునియెడల నేమికీడుఁ దలంచు చుంటివో! నీదుష్టకృత్యముల నెవ్వరును వారించువారు లేరా! ఆస్థానోద్యోగుల నందఱిని వశముఁ జేసికొంటివి. కూర్మదుర్గాధీశ్వరుఁడగు దుర్జయుని, నన్నును నిట్లు కారాగృహమున బంధించితివి. ఇఁక నిన్ను వారించువా రెవ్వరు?" అని, యావిక్రాంతుఁడు పరిపరివిధములఁ జింతించుచుండెను.

రాత్రి రెండు ఝాములయినది. జగంబంతయు నంధకారముచే నావరింపఁబడియుండెను. కారాగృహ రక్షకులు గూడ సంపూర్ణ నిద్రావస్థను మునింగి యుండిరి. కాని, విక్రాంతునకు మాత్రము నిద్ర రాలేదు. కళింగ రాజకుమార సంరక్షణోద్యోగ భారము వహించినవాఁడై, కారాగృహంబున బంధింపఁబడిన యాతనికి నిద్రయెట్లు వచ్చును? ఆతని చిత్తము మహాదుఃఖవార్థియందు మునింగి యుండెను. ఆతఁడు వీరాగ్రేసరుఁడే, ధైర్యచిత్తుడే, అయిననేమి? కారాగారమునఁ జిక్కియుండిన నాతఁడేమి సేయఁగలఁడు?

సోదరిచే విషప్రయోగముఁ జేయఁబడి, విక్రమాదిత్యుఁడు మరణమందు సమయమున నాతని మఱదలగు దేవాంగనను, నామెభర్తయగు విక్రాంతుని బిలిచి "ఇఁక నాజీవయాత్రి నేటితో ముగియుచున్నది. నాయేకపుత్రుఁడును

మాతృహీనుఁడును నగు చంద్రశేఖరుని మీవశముఁ జేయుచున్నాను. మీరే యిఁక వీనికిఁ దల్లిదండ్రులు. మీరు వీనినిఁ గడుజాగరూకతతోఁ బెంచి, పెద్దవానిగఁ జేసి, కళింగరాజ్యపీఠమున నిలిపి, మావంశము నిలబెట్టుఁడు. ఇట్లుమీరు సేయుదుమని వాగ్దానమిచ్చిరేని నేను సుఖముగా బ్రాణములు విడిచెద" నని పలికెను. దేవాంగన విక్రమాదిత్యునిఁగాంచి "మహారాజా ! నీవు మాకు రాజువగుటయేగాక నాసోదరికి భర్తవు. నీవు కుమారుని విషయమై యావంతయుఁ జింతింపవలదు. మాకంఠములఁ బ్రాణములున్నంతవఱకుఁ జంద్రశేఖరున కేమియు హాని కలుగదు. అవసరమయ్యేనేని, భవత్కుమార సంరక్షణార్థము నాప్రాణములనైన విడిచెద" నని వచించెను. విక్రాంతుఁడును దేవాంగన చెప్పినట్లే చెప్పెను. విక్రమాదిత్యుఁడు తనకుమారుఁడగు చంద్రశేఖరుని వారివశముఁజేసి ప్రాణములు విడిచెను.

మదాలస-విక్రాంతుని వశముఁజేసికొనుట కాతనిని గారాగృహంబున బంధించెను. కూర్మదుర్గాధీశ్వరుఁడును, విక్రమాదిత్యునకు విశ్వాసపాత్రుఁడును నగు దుర్జయుఁడు గూడ నామెచే బంధింపఁబడెను. తనకుఁ గారాగృహవాసము గలిగినందులకును, జంద్రశేఖరునేవిధంబున నపాయముఁబొందకుండఁ గాపాడుదునా యనియు, విక్రాంతుఁడు దీర్ఘచింతాతత్పరుఁడై యేమేమో యాలోచించుచుండ, నాయర్ధరాత్రి

వీరపాలుఁడు నలువురు భటులతో నయ్యెడ కరుదెంచెను. కారాగృహరక్షకభటులు నిద్రపోవుచుండుటఁ జూచి యాతఁడు వారిని గట్టిగాఁ బిలిచెను. రక్షకభటులు త్రుళ్ళిపడి లేచి కన్నులు నలుపుకొనుచు నిలబడియుండుటఁ గాంచి వీర పాలుఁడు "ఇదియేనా మీజాగరూకత! కారాగృహమునుండి యెవ్వరైనఁ దప్పించుకొని పోయినచో మీరేమిసేయుదురు? మీరిట్లుంటిరని తెలిసినచో మదాలసరాణి సైరించునా" యని భీకరముగఁ బలికెను. తరువాత నాతఁడు చెఱసాలతాళము దీయించి, విక్రాంతుని విలోకించి "విక్రాంతా! నిన్ను రాణీ గారు శృంఖలాబద్ధునిగఁజేసి తోడ్కొని రమ్మని యాజ్ఞనిచ్చి" నని నుడివెను.

విక్రాం:—రాణీగా రెవరు?

వీర:—రాణీ యెవరని యడుగుచుంటివా! మదాలసయని యెఱుంగవా?

విక్రాం:—ఎఱుఁగకే యడిగినాడ. మన్నించి, ఈ యర్ధనిశి యందు నన్నామె రావించుట కేమికారణమో తెలిపెదవా?

వీర:—అదియంతయు నాకుఁదెలియదు. దుర్జయునిఁగూడ నామెకడకుఁ దోడ్కొని పోయితిమి.

ఇట్లుపలికి వీరపాలుఁడు విక్రాంతుని శృంఖలాబద్ధునిగఁ జేసి రక్షకభటులు వెంటనరుదేరఁ దోడ్కొని పోవెను.

రెండవ ప్రకరణము.

తొలుత మదాలస కడకు శృంఖలాబద్ధుఁడై యున్న దుర్జయుఁడు గొనిరాఁబడెను. ఆమె యాతనిని గపటానురాగముచే వశముఁజేసికొన భావించి, నాతనికిఁ గట్టఁబడియున్న గొలుసులఁ దీసివేయించి, భటుల నావలకుఁ బొమ్మనెను. అనంతరము మదాలస దుర్జయుని విలోకించి యిట్లుపలికెను: "'దుర్జయా! కూర్మదుర్గాధీశ్వరుఁడవును-అతిసుకుమారుఁడవును నగు నీకుఁ గారాగృహావాసమే సుఖముగానున్నదా? నిన్ను నేను కారాగారమునఁ బడవేసితినని నన్నుఁ గ్రూరచిత్తగా భావించుచుందువు. కాని నా భావము నేను నీకు సంపూర్తిగఁ దెలియఁబరచఁ దలంచియే నిన్నీయర్ధరాత్రి యిటకు రావించితిని. చిరకాలమునుండి నాహృదయము నీయందు లగ్నమై యున్నది. నాహృదయమర్మ మెవ్వరికినిఁ దెలియకుండ నుండుటకును, లోకులు నన్నుఁగూర్చి యనుమానముఁ బొందకుండ నుండుటకును నిన్ను బంధించితిని. నేనును-నీవును నేకమైతిమేని కళింగసామ్రాజ్యము నాకువశమగుట నిశ్చయము. నామమునకు నేను రాణిగనుందునుగాని సమస్తసంపదలను నీవే యనుభవింపవచ్చును. ఇన్నిమాటలేల! నన్ను నీవు సరోజని యట్లు భావింపుము. నాహృదయ మిప్పుడు నీకుఁదెలిసినదా? నేను నీ వశమగుచున్నప్పుడు నీవు నావశము కావలదా!"

విక్రమాదిత్యుని మరణ సమయమున "నేనుగూడఁ జంద్రశేఖరుని సంరక్షణమున నతిజాగరూకతతో మెలంగుదు" నని, దుర్జయుఁడుగూడ వాగ్దానమిచ్చినవాఁడే. అట్టి దుర్జయుఁ డిప్పుడు మదాలస కపటమోహమును బ్రకటించుచుఁ బలికిన పలుకులు వినినంతనే చిత్తమంతయు మారిపోయెను. తనకార్యముఁ దీర్చుకొనుటకై మదాలస యట్టి మోహము నటించుచున్నదని యాతఁడు తలంపలేదు. మూఢుఁడగు నాతఁడు తన్ను మదాలస నిజముగనే మోహించుచున్నదని మహానందమొందెను. "నేను పూర్వ జన్మమున జేసిన పుణ్యములు ఫలించినవి. అందుచేతనే నాయందు మదాలస యనురాగచిత్తయై యున్నది. ఇఁక నాకేమిచింత! కళింగసామ్రాజ్యమునకు రాణిగాఁ గానున్న యీమె నన్ను వరించుచున్నది. ఆహా! ఏమినాభాగ్యము ! నాయందున్న మోహముచేతనే కాబోలు, విక్రమాదిత్యునకు విషమిచ్చి చంపి, భర్తను గూడ శాశ్వత పుణ్యలోకమునకుఁ బంపినది ! మదాలస నాభార్య. కళింగసామ్రాజ్య మామెదైన నేమి! నాదైన నేమి? ఈమె దయ యున్నచోఁ గాలక్రమమున నేనేరాజునగుదును. ఒకప్రక్క సరోజని-వేఱొక ప్రక్క మదాలస. అప్పుడు నా సౌఖ్యభోగములు మహేంద్రునకైన నుండునా! " యని యనేక తెఱంగుల దలంచుచుండెను. తనమాటలపై దుర్జయుఁడాలోచించుచున్న విధముఁజూచి, యాతఁడు తనకు లోబడు

నని మదాలస తలంచి "దుర్జయా! ఆలోచించుచుంటివేమి? ఆలోచన కిది సమయముకాదు. నేఁజేయఁదలఁచిన కార్యము నందు జయం బొందవెనేని నిన్ను వివాహమాడుదుననియే తలంపుము. కాని, ఈ సంగతిని నీవు చిత్తమునందే గుప్తముగా నుంచుము. నేఁజేయు ప్రయత్నములందుఁ దోడ్పడుచుండుము. నాయెడల నిష్కపట చిత్తుఁడవై వర్తించుచుండుము. ఏదీ! చూతము. అట్లుండుదునని ప్రమాణము సేయు" మని పలికెను. దుర్జయుని సంతోషమునకు మేరలేకుండెను. ఆతఁడు మదాలస కిట్లనెను: "నాయెడల నీవు కరుణవహించి పలుకుచున్న ప్పుడు నేను నీయెడలఁ గృతఘ్నుఁడనై యుందునా? అట్లె న్నటికినిఁ దలంపకుము. ఈశరీరము నీకు సమర్పించుచున్నాను. నీ యిచ్చవచ్చిన యట్లు దీనిని వినియోగ పఱుపుము. నీపాద సాక్షిగఁ జెప్పుచున్నాను. ఇఁక నన్నేమి చేయుచుందువు! నీచరణముల నొత్తుచుందువా? నీకృప వడసిన యీతఁడింద్రు లకుఁగూడ నానందముతో సంసిద్ధుఁడని యెఱుంగుము."

ఆహా! ఆశాపిశాచము సోకిన వారెట్టి కృత్యముల నైనఁ జేయ సాహసింతురుకదా! విక్రమాదిత్య మహారాజు నకువిశ్వాసపాత్రుఁడైన యొకదుర్గాధీశ్వరుఁడగు-నీ దుర్జయుఁడు-విక్రమాదిత్యునితోఁ దానుపలికిన మాటలను మఱచి నేఁడు మదాలసా కపటమాయావాగురులకుం జిక్కి-యామెకు దాసుఁ డయ్యెను. ఈవిధంబున దుర్జయుఁడు తనకులోబడెనని సంత

సించి మదాలస యతనితో "నీతో మాట్లాడవలసిన రహస్యము లనేకములున్నవి. నీకు వానిని నెమ్మదిగా వినిపించెదను. ఇఁక నీవు బొ మ్మని వానిని బంపివేసెను.

అంతఁ గొంతసేపటికి రక్షకభటసహితుఁడై వీరపాలుఁడు శృంఖలాబద్ధుఁడైన విక్రాంతునిఁ దోడ్కొనివచ్చి మదాలసముందుఁ బెట్టెను. మదాలస విక్రాంతునిఁ గాంచి "విక్రాంతా! రాజబంధుఁడవు; వీరపురుషుఁడవు; భాగ్యశాలివి:- అగు నిన్ను నిలబెట్టి మాటలాడుటకు నా చిత్తము సమ్మతింపదు. కావున నాయాసన మధిష్ఠింపు" మనిపలికెను. విక్రాంతుఁ డామెకు నెదురుగానున్న యాసనముపైఁ గూర్చుండెను. అంతట మదాలస యాతనింజూచి "సుగుణశేఖరుఁడవగునిన్ను బంధించినందులకు మిగుల విచారించుచున్నాను. ఇట్లొనర్చినందులకు నీవు నాపై నాగ్రహమూనవలదు. నేను తలపెట్టిన కార్యమునందు నీసహాయమే నాకు ముఖ్యమైనది.

విక్రాం:—కళింగరాజ్య సింహాసన మారోహింప నెంచుటయే కదా నీవు తలపెట్టిన కార్యము!

మదా:—అవును.

విక్రాం:—ఇందు నీకు నాసహాయము గావలయునా!

మదా:—నిశ్చయముగాఁ గావలయును. నీ యమూల్యసహాయమున నేను కృతార్థురాలను గాఁగలను.

విక్రాం:—నీతలంపు ధర్మమునకు వ్యతిరేకమైనది.

మదా:—విక్రాంతా! నీకుఁదెలియని విషయమేమున్నది? ఈప్రపంచమంతయు మిథ్య. ధర్మమను నెపమునఁ గన్నుల యెదుటఁ గనఁబడుచున్న సౌఖ్యములవిడిచి, యెప్పుడో స్వర్గసౌఖ్యము లభించునని తలంచి, శరీరము నిట్లు కష్టపెట్టుట నీవంటి ప్రాజ్ఞునకుఁదగదు. జరిగినదానికి విచారింపక నాయుద్యమమునందుఁ బాల్గొనుము. నేఁజెప్పినట్లు వర్తించుటకు నీవు సమ్మతింతువేని, నీకుఁ గారాగృహవాస కష్టముండదు. కుబేరసంపదతో నలరారఁ గలవు. నే నింతకంటె నీకుఁ జెప్పవలసిన దేమున్నది?

విక్రాంతుఁడు దుర్జయునివంటివాఁడు కాఁడు. ధైర్య సాహసములు గలవాఁడు. సత్యరతుఁడు. కార్యదీక్షగలవాఁడు. సౌఖ్యభోగ తృష్ణాపరాఙ్ముఖుఁడు. ఏకపత్నీవ్రతుఁడు. అట్టి వాఁడు-మదాలస పలుకుల కెట్లు సమ్మతించును? అతఁడు మదాలసం గాంచి ధైర్యచిత్తుఁడై యిట్లు పలికెను:

"మదాలసా! కళింగ సామ్రాజ్య నాశనమునకుఁ గారణమగుచున్న నీకు నేను లోఁబడుదునని తలంపకుము. రాజ్యకాంక్షం జేసి నీవొనర్చిన పాతక కృత్యముల నెవ్వరు నెఱుంగరని తలంచుచుంటివి. కాని నిన్నుఁగూర్చి ప్రజలేమని చెప్పుకొను చుండిరో నీవెఱుంగ వైతివి. నేను నీవాఁడనై

నీకార్యములకుఁ దోడ్పడుదునని భయపెట్టుటకై నన్ను బంధింపఁ గలిగితివి గాని, నాయాత్మను బంధింపఁ జాలవు. రాజభక్తి గలిగి చరించువాఁ డుభయ లోకముల యందును బూజనీయుఁడగును. ఈదేహము లస్థిరములు. సంపద చంచలము. ఇట్టి తుచ్ఛ భోగమునకాసించి రాజభక్తిని విడనాడుట శ్రేయస్కర మగునా! ఏయేప్రమాణములు విక్రమాదిత్యునితో గావించితినో వాని నన్నిటిని మఱచి, ప్రపంచాధిపత్యమునైన నంగీకరింపను. ఈదేహము దేనికొఱకు సృష్టింపఁ బడినదో, యది నెఱవేర్చుటయే నాకావశ్యకమైన కార్యము. ఇన్ని దినంబుల నుండియు విక్రమాదిత్యుని యుప్పుఁబులుసుఁ దిని జీవించిన నాపవిత్ర జీవితమునకు మాలిన్యము గనఁబఱచుట సమంజసమైన కార్యము కాదు. నేనిట్టి హేయభాజన మగు కార్యమనుష్ఠించితినేని నా ధర్మ వర్తనమునకుఁ, బురుషార్థమునకు, గౌరవమునకు, ధైర్యసాహసములకు భంగము కలుగును. ఏమనుష్యుడు తన్నుఁదా జయించుకొనునో ఎవ్వఁడు దూరాన్వేషణ తత్పరుఁడై పనిఁజేయునో, ఎవ్వఁడు తనరాజ్యము నందు భక్తి విశ్వాసములు కలిగి మెలంగునో, వానిని భాగ్యలక్ష్మి వరించును. ఒకరిని సంతోషింపఁ జేయుటకుఁ గాని, క్రోధపూర్వకముగాఁ గాని, లేక స్వార్థము నపేక్షించి గాని, ధర్మమార్గమున కాలవాల మగు రాజభక్తిని విడనాడుట నామతము కాదు. నా రాజభక్తిని

వెల్లడించుట కవకాశ మిప్పుడు తటస్థించినది. అట్లు సేయ కుంటినేని ప్రపంచము నన్నతి నీచదృష్టితోఁ జూచును. రాజ భక్తిని విడనాడి పాపహేతువగు కార్యముఁ జేసితినేని నా యాత్మ తిరుగ విముక్తిఁ బొందుట కసాధ్యమగు నంతటి ఘోరనరక కూపమునఁ బడఁగలదు. నాసత్ప్రవర్తనచే నింతవఱ కార్జించిన యశము మన్నుగలియును. రాజభక్తియే సర్వసంప దల నొసంగును. అదియే సర్వాభీష్ట ప్రదము. అదియే సమస్త పాపవిమోచకము. అదియే సజ్జన స్తవనీయము. అదియే సంతో షమునకుఁ గారణము. వేయేల! దానిని మించినది భూమండల మున లేదు. సూర్యచంద్రులు గతులు తప్పినను నాచిత్త మధ ర్మోద్యోగమునఁ బ్రవేశపెట్టను."

ఏవిధముగానైన విక్రాంతునిఁ దనవశముఁ జేసికొను టకుఁ దలంచిన మదాలస తలంపున కాతఁడు వ్యతిరేకముగాఁ జెప్పుచుండెను. అయినను మదాలస యంతటితో నూరకుండక విక్రాంతునిఁ దిలకించి "విక్రాంతా! నీవు రాజభక్తుఁడవనుటకు సందియము లేదు. రాజభక్తి ప్రతివానికి నుండవలసినదే. అందులకు నేనును నొప్పుకొందును. కాని, ఆభక్తి నాపైనఁ గూడఁ జూపవలదా! నేను కళింగసామ్రాజ్యమున కేలిక నగు దానుగదా" యనెను. అందులకువిక్రాంతుఁడిట్లుబదులుచెప్పెను: "కళింగ సామ్రాజ్యరత్న సింహాసన మారోహించుటకు బాలుఁ

డైన చంద్రశేఖరుఁడుండఁగా-నీవెట్లర్హ్రాలవయ్యెదవు ? ఇందు లకు నావంటి ధీరపురుషు లెట్లంగీకరింతురు? కళింగ సామ్రాజ్య రమణీయ హేమరత్న సింహాసనాసీనుఁడగు విక్రమాదిత్యుని; వైరిజన ప్రతాపాటోప గర్వభంజనుఁడగు విక్రమాదిత్యుని; ఆశ్రితజన రక్షణ దీక్షాబద్ధ కంకణుఁడగు విక్రమాదిత్యుని; రాజ్యకాంక్షం జేసి సోదరుఁడని తలంపక చంపిన మహా పాప చిత్తవు. అట్టియెడల నిష్కల్మష చరిత్రులును, ధర్మసంధులును నగు వారెవ్వరును నీపై భక్తిఁ బూనియుండరు. వారణాసీ హరిద్వార మాయాగయా ద్వారకాది పుణ్యక్షేత్రముల దర్శించినను, జాహ్నవీ సింధు గోదావరీ శోణ నర్మదా కృష్ణ వేణీ ప్రముఖ దివ్యస్రవంతులందు మునింగినను నీవు చేసిన పాపమును బాయఁజాలవు. ఇంకను బాపకార్యముల నేల జేయనెంచెదవు ? ఇంతవఱకును జేసిన పాపముల క్షమింపు మని, కమనీయ లక్ష్మీనివాస కౌస్తుభమాలాలంకృత దివ్య వక్షస్థలుఁడును, వనమాలికా బంధుర నీలనీరద శ్యామల కోమలాంగుఁడును, సహస్రమయూఖ దేదీప్యమాన దివ్య ప్రభామయుఁడును, మానిబృంద సందోహ సమర్చిత దివ్య పాదయుగళుఁడును, దేవేంద్రాది సమస్త దేవతాకోటి కోటీర కిరీట విరాజిత సుందర పాదారవిందుఁడును, బ్రహ్మ రుద్రేంద్రాది లోకపాలక నికరజనన హేతు భూతుఁడును, ప్రకృతి కారణుఁడును, ప్రకృతిపరుఁడును పరాత్పరుఁడును,

నగు నా శ్రీమన్నారాయణుని వేడికొని కృతార్థురాలవు గమ్ము. అట్లుగాదేని నీవు వినాశమందుట నిశ్చయము."

వికాంతునిపలుకులు మదాలసకాగ్రహముఁ గలిగించి నవి. ఆమె యాతనిని దీవ్రదృష్టితోఁ జూచుచు "యుపన్యాస మిఁకఁ జాలించి, నేఁ జెప్పినట్లు నడచుకొందువా? నడచు కొనవా? చెప్పు" మనెను. "నీవు నన్నుఁ గారాగృహమున బంధించితివని భీతిల్లువాఁడనుగాను. పరమేశ్వరుఁ డేమిసేయఁ దలంచెనో యట్లగు"నని వికాంతుఁ డామెకు గట్టిగా బదులు జెప్పెను. మదాలస రక్షకభటులంజూచి "వికాంతుని నెప్పటి యట్లు కారాగారంబునందుంచు" డని యాజ్ఞాపించెను. రక్షక భటులు వికాంతునిఁ గారాగృహంబునకుఁ దీసికొనిపోయిరి.

మూఁడవ ప్రకరణము.

కళింగనగరమున-సుక్షత్రియ వంశ సంభూతయు, ధనికు రాలును, నద్వితీయ సౌందర్యవతియు, యౌవనవతియు నగు మృణాళిని యను కాంతారత్నము కలదు. ఆమెయవివాహిత. వికాంతుని యందుఁ జిత్తముఁ జేర్చి యెట్లయిన నాతనిం బరిణయమాడఁ దలంచి యుండెను. కాని, యీామె మోహా మునుగూర్చి వికాంతునకుఁ దెలియదు. వికాంతుని భార్య

యగు దేవాంగనకీమృణాళినియందధిక గౌరవముగలదు. ఇదియుంగాక కూర్మదుర్గాధీశ్వరుఁడైన దుర్జయునిభార్యయగు సరోజని గూడనీమెకుస్నేహితురాలే. ఒకనాఁడీమె తనచిత్తమున "అక్కటా నాయౌవనమంతయు నడవింగాచిన వెన్నెలవలెవృథగ నగుచున్నది. ఎట్లయినను విక్రాంతునిఁజేరి, నాయభీష్టముఁదెలిపి, యమ్మహనీయుని దివ్యపాదారవింద సేవాభాగ్యము లభింపఁజేసికొనవలయునని తలంచుచుండఁగాఁ, గ్రూరచిత్తయగు మదాలస యాతనిని గారాగృహంబున బంధించెను. ఇందులకు నేనేమి సేయుదును? విక్రాంతుఁడు కారాగృహమునుండి యీవలఁ బడుట యెట్లు? ఇందులకు నేనేమి యుపాయమూహింతును?" అని తలంచుచుండెను. ఆ సమయంబున దుర్జయునిభార్యయగు సరోజని వచ్చెను. సరోజనియు, మృణాళినియుఁ గొంతసేపు మదాలస చేయుచున్న దుష్టకృత్యములఁ గూర్చి సంభాషించిరి.

మృణాళిని:—సరోజనీ! మదాలస నీ విభుఁడగు దుర్జయునిఁ గారాగృహ విముక్తునిఁగాఁ జేసినదని వింటిని. ఈ వార్త నిజమేనా?

సరోజని:—నేను నట్లేవింటిని కాని విక్రాంతునిఁ జెఱయందేయుంచి, నానాథుని మాత్రమట్లు సేయుటకుఁ గారణమూహింపఁజాలక యున్నాను.

మృణా:—కారణమేముండును? మదాలస యొనర్చు దుష్ట కృత్యములకుఁ దోడ్పడుదునని చెప్పియుండుట చేతనే దుర్జయుఁడు చెఱనుండి విముక్తుఁడై యుండును. ఇందుల కావంతయు సందియముండదు.

సరో:—నిశ్చయముగా నా నాథుఁడు మదాలసకు లోఁబడుట సంభవించెనేని, నాకాంతుఁడు లేనివానిగనే భావింపుము.

మృణా:—అంతమాటఁ బలికితి వేమి?

సరో:—ఇది నిశ్చయమే. అధర్మమార్గమునఁ బ్రవర్తించిన వాఁడు భర్తయైన నేమి? మఱెవ్వరైననేమి? అట్టివారిని బరిత్యజింపవలసినదే? నేనును సుక్షత్రియ వంశమందుఁ బుట్టిన దాననే. సాహస పౌరుషంబులు గలదాననే.

ఇట్లు వీరిరువురు మాట్లాడుకొనుచుండగా - విక్రాంతునకు విశ్వాసపాత్రుఁడైన కందనుఁడను సేవకుఁడొక పేటికం దెచ్చి మృణాళిని ముందుఁ బెట్టి "మృణాళినీ! సంగతినంతయుఁ జెప్పుట కిప్పుడు వేళచాలదు. నేను విక్రాంతుని సేవకుఁడ. ఈ పేటికను నీకడకు దేవాంగన పంపించినది. ఇప్పుడు నీవు నన్నును నీ పేటికను రక్షింపవలయును. నా నిమిత్తము మదాలస పంపున భటులు వచ్చుచున్నారు. తొందరపడుము" అని పలికెను. వెంటనే మృణాళిని, పేటికాసహితుఁడైన యాకందనునిఁ దనమందిరమున నొక రహస్య ప్రదేశము నందుంచెను.

కొంతసేపటి కచ్చటికి మదాలస పంపునఁ గొందఱు భటులువచ్చి మృణాళినింగాంచి "నీమందిరమునఁ గందనుఁడు దాగియున్నాఁడని మాకనుమానముగ నున్నది. కావున మేము వెదకవలయు" నని పలికిరి. మృణాళిని వారితో "కందనుఁ డెవఁడు? నామందిరంబున దాగియుండు టేమి? అయినను మీ కనుమానమున్నది కావున వెదకుటకు నాకావంతయు సందియములేదు. మీరాయిచ్చవచ్చినయట్లు నామందిరమంతయు జూడుఁ" డని చెప్పెను. భటులు మృణాళిని మందిర మంతయు వెదకి కందనుని గానఁజాలక వెడలిపోయిరి. భటు లరిగిన జాడ గ్రహించి కందనుఁడు-పెట్టెతో నీవలకు వచ్చి యాపెట్టెను మృణాళిని ముందుఁబెట్టి తెఱచెను. అందు రాజకుమారుఁడైన చంద్రశేఖరుఁ డుండెను. మృణాళినియు-సరోజనియు విస్మయమందిరి. అప్పుడు కందనుఁడు మృణాళినికి "దేవాంగన యీ కుమారుని నీకడకుఁ బంపినది. ఈతనిని రక్షించుభారము నీయది," యనిపలికి, దేవాంగనవాక్యంబుల నిట్లు చెప్పెను:

"చెలీ! మృణాళినీ! నేటివఱకును-ఈకళింగరాజవంశము నుద్ధరించుటకు నీబాలుని నతిజాగరూకతతోఁ దండ్రి మరణించిన నాటనుండియుఁ బెంచితిని. ఈతఁడు నా సోదరీపుత్రుఁ డగుటయే గాక, విశేషించి విక్రమాదిత్యునకు మరణసమయమున మేము చేసిన శపథము ననుసరించి, యిక్కుమారుని

రక్షించి, కళింగ రాజ్యపీఠమున నాసీనుంజేయుటకు మాప్రాణ ములనైన గోలుపోవఁదలఁచితిమి. నే డీతనికి మదాలసవలన హాని వాటిల్లునని యనుమానమంది నీకడకుఁ బంపితిని. ఈ బాలున కేవిధమైన హానియుఁ గలుగకుండ రక్షించు భారము నీ భుజస్కంధమునందు వహింపవలయును. కళింగ రాజవంశము నిలబెట్టి యశమందుము. నేను నిన్ను మరలఁ జూచుభాగ్య మున్నదో లేదో! ఏమార్గమునఁ గుమారునకు హానికలుగకుండ నుండునో యామార్గము ననుసరింపుము. సమస్తవిషయములు దెలిసిననీకు నేను చెప్పవలసిన యవసరములేదు. ఏతెలంగుననైన మదాలస యీచంద్రశేఖరుని రూపుమాపి, కళింగరాజ్య పీఠము నారోహింప యత్నించుచున్నదను మాట మాత్రము నీవు మఱవ వలదు."

కందనుఁడు దేవాంగనావాక్యములిట్లు వినిపించి, చంద్ర శేఖరుని మృణాళిని వశముఁజేసి యరిగెను. మృణాళిని దేవాంగనా వాక్యములఁ దలచి కన్నులనీరు విడచుచు బాలు నుద్దేశించి "అక్కటా! కుమారా! నీవింత పసితనమందే తల్లి దండ్రులు లేనివాఁడవైతివి కదా! నీముద్దు ముచ్చటలు జూచుచు, విద్యాబుద్ధులు గఱపించి, యానందించు భాగ్యము నీతల్లిదండ్రులకు లేకపోయెను. విధికృతమునఁ దల్లి మరణింపఁగా నెట్లో ధైర్యము వహించి నీతండ్రి నిన్నతి గారాబ ముతోఁ బెంచుచుండ, క్రూరకర్మురాలై రాజ్యాకాంక్షంజేసి మదాలస నీతండ్రికి విషంబిడి చంపెను. పినతల్లియగు దేవాం

గన నీకు మదాలస వలనఁ బ్రాణ భయం బొదవునని తలంచి నిన్ను నాకడ కంపెను. అక్కటా! నిన్ను నేనెట్లు రక్షింప గలుగుదును? నీ విచ్చట నుంటుటఁ దెలిసెనేని మదాలసా ప్రిబోధితులై భటులరుదెంచి నిన్నుఁ బట్టుకొని పోవక యుందురా! అయ్యో! పరమేశ్వరుఁడు నిన్నెట్టికష్టములపాలు సేయుచుండెను? కళింగ దేశాధీశ్వరుఁడగు విక్రమాదిత్యుని గర్భమునఁబుట్టిన నీవు దుష్టచారిణియగు మదాలసవలన భయంబునఁజేసి పరుల పంచలను జేరవలసివచ్చెనుగదా! నిన్ను నేనిప్పుడేమిసేయుటకును దోచకున్నది." యనిచింతింపసాగెను.

సరోజని మృణాళిని విచారమునుగాంచి "మృణాళినీ! నీవీ కుమారునిగూర్చి చింతింపవలదు. నేనీతనిని నాతోఁ గూర్మదుర్గమునకుఁ దీసికొనిపోవుదును. నారక్షణంబున నీతఁడు దనరఁగలఁడు. ఈతనికిఁ గొంచమైన భయంబొదవదు. నా ప్రాణములతో సమానముగ నీతనింగాపాడెదను. దేవాంగనకు నీవెట్టిదానవో నేనుగూడ నట్టిదాననేయని తలంపు" మనెను. సరోజనివాక్యములు విని యావిధంబునఁజేయుట మంచిదేయని మృణాళిని తలంచెను. కాని, యొకవిషయమున మాత్రమామె సంశయించెను. దుర్జయుఁడు మదాలసకు వశుఁడై యుండెను. చంద్రశేఖరునిఁ దీసికొని పోవ దలఁచినది యాతని భార్య యగు సరోజని. అట్టిచోఁ గుమారున కేమి యపాయ మొదవునో యని మృణాళిని దీర్ఘముగ విచారింపఁ దొడంగెను.

మృణాళిని యనుమానమును సరోజని గ్రహించి "ఇందులకు నీ డెందమున నున్న యనుమానము నేను గ్రహించితిని. నీవు నన్నుగూర్చి సంశయింపఁ బనిలేదు. నాభర్త యధర్మ ప్రవర్తనుఁడయ్యేనేని నాకు లేనివానిగ భావింపుమని యింతకుముందే నీకుఁ జెప్పియుంటిని. నీవు నన్నుఁగూర్చి యణుమాత్రమైన సంశయింపక యిక్కుమారుని నావెంటఁ బంపుము. ఈతఁడు నాకడ సురక్షితముగ నుండును. మదాలస వీని విషయమై చేయఁదలఁచిన మాయలేమియు సాగవు. నన్ను నమ్ముము" అని వచించెను మృణాళిని యామె మాటలు విని "సరోజనీ! కళింగసామ్రాజ్య సంరక్షణమునకుఁ గంకణము గట్టుకొని తన ప్రాణములనైన నిక్కుమారునకై యర్పించుటకు నిశ్చయించుకొన్న దేవాంగన నాయెడలనుండు గౌరవముచేతను, నమ్మకముచేతను నీ బాలుని నారక్షణంబు నకు బంపించినది. ఈసమయంబున నేనిందులకశక్తురాలనగుటచే నిన్ను నమ్మి నీవశముఁ జేయుచుంటిని. ఇఁక నీవు వీనినెట్లు రక్షించెదవో! నీవును నేనును దేవాంగనా మనోరథమును ఫలింపఁజేయవలయు," నని చెప్పి చంద్రశేఖరుని నాసరోజని హస్తంబులందుఁ బెట్టెను.

ఇఁక నక్కడనున్నచో నేమైన నపాయ మొదవునేమో యని యాక్షణంబుననే సరోజని చంద్రశేఖరుని వెంటబెట్టుకొని, తన యనుచరవర్గముతోఁ గూర్మమర్గమునకుఁ జనెను.

నాల్గవ ప్రకరణము.

సత్యసంధులును, ధర్మమూర్తులును, వితరణ గుణశీలురును నగు శ్రీరామ నల హరిశ్చంద్ర శిబి బలి కర్ణాదిమహాపురుషులవలెనే, జగంబునఁ దమ యప్రతిమాన మహిమచేఁ గీర్తిగడించిన సాధ్వీమణులుగూడ మనకుఁ బూజ్యులే. అట్టి సాధ్వీమణులు పెక్కండ్రు సముద్రమున రత్నములవలెఁ భారత భాగవత రామాయణాది పురాణముల యందును, తదితర కావ్యముల యందును, సత్కవివతంసుల యనర్ఘవాణిచేఁ గీర్తింపఁబడి విలసిల్లుచున్నారు. పౌరాణిక యుగ్గమునఁ దన గుణముఁ బరీక్షింప నరుదెంచిన త్రిమూర్తులను బసిబాలురఁగఁ జేసి పతివ్రతా మహిమను బ్రకటించినది యనసూయ. మాండవ్యుని శాపమున సూర్యోదయ మైనంతనే తనభర్త మృతుండగునని, పద్మబాంధవుఁ డుదయింపకుండఁ జేసి లోకములకు భయము బుట్టించినది సుమతి. తన నిరుపమాన సౌశీల్యాది గుణగణముచే, ననమాన భక్తిచేఁ బతిచే సన్నుతింపఁ బడుటయేగాక, యమునిఁగూడఁ దనమృదుమధుర గంభీర భాషణంబులచేఁ జిత్తమును గరఁగించి, మృతుండైన భర్తను బ్రదికించుకొని, దేవతలచే శ్లాఘింపఁబడి, సతికిఁ బతిసేవయే సమస్తాభీష్టప్రదము-సకలపాప శోషణము-సౌఖ్యశ్రీల కాలవాలము - ననర్ఘ రత్నమణిమయ హారము-

ముక్తిమార్గముననియలివేణీ జనలోకమున కుదాహరణముఁ జూపి యశమందినది సావిత్రి. శ్రీకృష్ణునకు సతీమణియై, యాతనితోఁ రణభూమికేఁగి, భువనభయంకరుఁడైన నరకునితోఁ బోరి విజయలక్ష్మిఁ గూర్చినది సత్యభామ. దేవదానవ సంగ్రామమునఁ దనకు సాటిలేని మేటిసామర్థ్యమున సారథ్యంబొనర్చి, నిజేశ్వరుండైన దశరథ భూపాలుని గాపాడఁగలిగినది కైక. ఇట్టి మహిళాలలామల పవిత్ర చారిత్రములచే విరాజిల్లుచుండుటచేతనే భారతేతిహాస పురాణసమితి సంతతము నవనవోజ్జీవకమై తచ్చరిత్రములు పఠించినపుడెల్ల శరీరములఁ బులుకలు వొడమి చదువరుల కొకవిధమైన యుత్సాహము-ఆవేశము-శక్తి కలుగుచుండును. పౌరాణిక యుగమందలి వీరనారీమణుల యసమాన ధైర్యాలు - మహిమ - శౌర్యపరాక్రమసాహసాది గుణములు-చారిత్రయుగమందలి మహిళల హృదయములందుఁ గూడఁ బ్రవేశించి వారి శౌర్యాగ్నిని బ్రజ్వరిల్లఁజేసినవి. అమ్మా నవతీమణుల శౌర్యప్రకటన డిండిమ మింకను మ్రోగుచునే యున్నది. పవిత్రమయిన యాసతీమతల్లుల దేహముల నుండి చింది, రణరంగమునఁబడి యార్యావర్తమునకు వీర ప్రసూత నామమును సార్థకముఁజేసి ఖండాంతర వాసులను గూడఁ బరమాశ్చర్య నిమగ్నులుగఁ జేయజాలిన యారుధిర బిందువులింకను నారకముండి తత్తత్ప్రదేశములు దర్శించినపు

డెల్లఁ బ్రేక్షకులకుఁ బ్రాచీన భారతసామ్రాజ్యవైభవము, ప్రాచీన భారతమహిళాశౌర్యము మొదలగునవి జ్ఞప్తికిఁ దెచ్చి కంటనీరుఁ బెట్టింపకమానవు. చారిత్రపత్రములయందుఁ జరిత్రకారులచేఁ దమవీరచరిత్రమును సువర్ణాక్షరములచే వ్రాయించుకొని, యశమందిన నారీమణులెందఱో కలరు. భారతవర్ష మీ ప్రపంచమున నిలిచియున్నంతవఱకు వారి పవిత్రనామములు నిలిచియేయుండును. అట్టి మానవతీమణులలో మహారాష్ట్ర వంశాభరణమై, ప్రజలెల్లఁ బొగడ, రాజ్యరథ మతినైపుణ్యతతో నడపి ఖ్యాతివహించినది యహల్యాబాయి. పతితోఁ గూడ సంగ్రామ రంగమున కవతరించి, దుర్వార శౌర్యాటోపమున విజృంభించి, పరిపంది బలములఁ దునుమాడి వీరసతి యనిపించుకొనినది సంయుక్త. ఢిల్లీశ్వరుండగు నక్బరు పాదుషా యంతటివానికి వెఱపు గలిగించినది మీరాబాయి. భయంకర సమరతలమును జొచ్చి, శరీరమునుండి రుధిర స్రవంతి పాఱుచుండినను, గండలూడుచుండినను, ప్రాణములపై నాసపడక, విజయలక్ష్మిఁ జేపట్టినఁ గాని రణరంగమును విడువనని ప్రతిజ్ఞఁచేసి, చిచ్చఱమ్ములఁ బఱపుచు, వైరివీరశిరంబులతో వియచ్చరులచ్చెరువంద నచ్చనకాయలాడి, రాజపుత్రయోధకీర్తి లతలు దిగంతములఁ బ్రాకించినది ఝాన్సీలక్ష్మీబాయి. రాజపుత్ర సంస్థానమును దన కీర్తిచంద్రికలచే వెలయించి యపరదుర్గయని పేరొందినది దుర్గావతి. కాకతీ

యాంధ్రసామ్రాజ్య రత్నఖచిత సింహాసన మారోహించి "ఒక కాంతకు మేము లొంగియుండవలయునా" యని తలంచి గర్వించి, యెదుర్కొన్న మండలేశ్వరుల నెల్లఁ దన యసమాన శౌర్య పరాక్రమమునఁ గోఱలుపెఱికిన త్రాచులవలె నదిమిపట్టి, ప్రజారంజకముగఁ బరిపాలనంబొనర్చి విదేశీయులచేఁగూడ శ్లాఘింపఁబడి యశమందినది రుద్రమదేవి. పంటరెడ్డికులమున జన్మించి తన బుద్ధిబలముచే బల్నాటి సీమనేలు నలగామునిఁ జేరి, మంత్రిణియై, మహాబలపరాక్రమధనుఁడైన బ్రహ్మనాయనితోఁ బ్రతిఘటించినది నాగాంబ. కళింగ రాజకుమార సంరక్షణార్థము, నిజపుత్రుని విరోధుల కృపాణమునకు బలియిచ్చి, తుదకు దానుగూడ మరణమందినది దేవాంగన.

కందనునిచేతఁ జంద్రశేఖరుని మృణాళిని కడకు దేవాంగన పంపినసంగతి చదువరు లెఱుంగుదురు కదా! దేవాంగనకు వసంతుఁడను నొక్కడే పుత్రుఁడు గలఁడు. అతఁడు చంద్రశేఖరునకు సమవయస్కుఁడు. మందిరంబున నక్కుమారుఁడును నామెయు నుండిరి. అపాయ మొదవునని యామె చంద్రశేఖరుని మృణాళిని కడకుఁ బంపియున్న దనుమాటయే గాని, యామె చిత్తమంతయు నక్కుమారుని మీఁదనే యుండెను. అక్కుమారున కేవిధమైన హానియుఁ గలుగకుండ జేయుఁడని యామె దేవతల కనేకవిధముల మ్రొక్కుచుండెను.

నాథుఁడైన విక్రాంతునకుఁ గారాగృహ విముక్తి యెట్లుకలుగునా యని యాలోచించుచుండెను. అట్టిఁడైన నామె దగ్గఱ నున్నచో నంతగా విచారింపదు. ఆమె కాలోచన జెప్పువారు కూడ నెవ్వరును లేరు. సంస్థానమున నున్న దండనాయకులు మొదలగు నుద్యోగులు మదాలసకు వశవర్తులై యుండిరి. ఒక్క కందనుఁడుతప్ప నామెకు విశ్వాసపాత్రుఁడైన సేవకుఁ డెవ్వఁడునులేడు. ఏమిసేయుటకును నామెకుఁదోఁచక యాలోచించుచుండెను. అట్టిసమయమునఁ గందనుఁడు బరుగెత్తుకొని వచ్చి గద్గదకంఠముతో "దేవీ! మదాలస పంపున వీరపాలుఁ డిప్పుడియ్యెడకుఁ జంద్రశేఖరునిఁ జంపు నుద్దేశముతోడనో లేక బంధించుకొనిపోవు నుద్దేశముతోడనో వచ్చునని వినియున్నాడ. ఇందులకుఁ గర్తవ్య మూహింపు"మని పలికెను. దేవాంగన కందనునిఁజూచి "కందనా! నీవు మాత్ర మెట్లకైనఁ బోయి దాఁగుకొనుము. నీ విచ్చటనుంటివేని నిన్ను బంధించుకొని పోవుదురు. నాకర్తవ్యమునకుఁ బరమేశ్వరుఁడే యున్నాఁడు. నీ వాలసింపక పొమ్ము" అనెను. కందనుఁ డాక్షణముననే మందిరము విడిచిపోయెను.

ఇప్పుడు దేవాంగన యేమిసేయఁగలదు? భటులతో వీరపాలుఁ డరుదెంచి చంద్రశేఖరునిఁ జూపింపుమని యడిగిన నేమని చెప్పఁగలదు? ఆమె తన మనంబున "విక్రమాదిత్యునితో నేను రాజకుమార సంరక్షణమును గూర్చి శపథముఁ

జేసితిని. ఇప్పుడు దానికి నన్యథాత్వము గలుగఁగూడదు. నా సత్యశపథమును నేను తప్పరాదు. సత్యమువలననే జగము స్థాపింపఁబడినది. సమస్తధర్మములును సత్యమునేయాశ్రయించి యుండును. మునులందఱును సత్యమునే కొనియాడుదురు. కావునఁ జిత్తంబున నెట్టి సంశయంబునకును దావీయక కుమారుఁడగు నీ వసంతునే వీరపాలునకుఁ జూపించెదను. కళింగ రాజ కుమార సంరక్షణార్థము నా వంశము నిర్వంశమైనను సరే," యని తలంచెను.

పుత్రుఁడనిన సామాన్యుఁడుగాఁడు. సమస్తసౌఖ్యవ్రాత తారకాగణంబునకు వనజవైరి. సంసార వారాశిఁ దరింపఁ జేయు నౌక. ముక్తినామక సీమంతినిం గూర్చుటకుఁ దార్పులాడు. సత్కీర్తి శాఖల వెలయించుటకు భూరుహము. అట్టిపుత్రుని నేఁడు దేవాంగన శత్రువుల కృపాణ మున కర్పింపఁ దలంచినది. ఎంతటివారికైనను నిట్టి సమయ మునఁ గొంచమైనను విచారముండక మానదు. దేవాంగన విచారమునుఁ జూచి యందులకుఁ గారణమేమని కుమారుఁ డడిగెను. కొడుకునకు దేవాంగన యిట్లనెను: "నాయనా! సంపూర్ణచంద్రుని ధిక్కరించు నీముఖంబును జూచుచు నను దినంబును సంతోషించితిని గాని విచారము నెన్నఁడు నెఱుంగను. ఎచ్చటికేగిన నచ్చటికి నిన్ను వెంటఁబెట్టుకొనిపోయి తినిగాని యొకనాఁడును నిన్నుఁ బాసి యెఱుంగనుఁ

శర్కరద్రాక్షారసములకంటె మధురతరమైయలరారు నీముద్దు చేత నానందమందితినిగాని యెన్నఁడును వగచి యెఱుంగను. నేడు నీయందున్న ప్రేమయంతయు నావలనఁ బాఱద్రోలి, హృదయమునఁ గఠినత్వముఁజేర్చి, చంద్రశేఖరుని ప్రాణసంరక్షణము నిమిత్తము, నిన్ను వైరులకు బలిగా సమర్పింపఁ దలఁచినాను. ఇందులకే విచారించుచున్నాను."

ఇట్టి దారుణవాక్యములు విన్నప్పుడెవ్వఁడైనను బెంగచే నాక్షణమునందే ప్రాణములు విడిచియుండును. వసంతునకు దల్లిమాటలు వినినంతనే మోమునందు వికాసము హెచ్చెను. హృదయ మత్యుత్సాహపూరితమయ్యెను. ఆతఁడు తల్లిని విలోకించి యిట్లు పలికెను: "అమ్మా! ఇందులకు నీవు విచారింపవలసిన యవసర మేమియున్నది? నీవు చేయఁదలంచినది మహాపుణ్యకార్యము. జనన మరణములు దేహికి సహజములు. ఒక కాష్ఠము మఱియొక కాష్ఠముతోఁ ప్రవాహవశమున నదియందుఁ గలియుచుండును. ఒకప్పుడు విడిచిపోవుచుండును. అట్లే బంధువులతో సంయోగ వియోగములు గలుగుచుండును. సుఖమునకు మోదమందకుండుటయు, దుఃఖమునకు వగవక యుండుటయు ధీరుల లక్షణము. ఇది యట్లుంచుము. రాజకుమార ప్రాణరక్షణార్థము నేను మరణించుట వలన నాకు శాశ్వత పుణ్యలోకము లభించుటయేగాక నా కీర్తి భూమిపై నాచంద్రతారకముగ నుండును. ఇంతకంటె నాకుఁ

గావలసిన సుకృతమేమి యున్నది? నీవేమియుఁ జింతింపవలదు. మృత్యుదేవతా కరాళంబును బ్రవేశించుటకు ధైర్యచిత్తుఁడనై యుండునని తలంపుము."

బాలుఁడైన వసంతుని వాక్యములు విని దేవాంగన పరమాద్భుత మందెను. కొంతసేపటికి వీరపాలుఁడు కొందఱు భటులతో దేవాంగనా మందిరంబును బ్రవేశించి యామెను విలోకించి "దేవాంగనా! విక్రమాదిత్య కుమారుఁడగు చంద్రశేఖరుని మావశముఁ జేయు" మని పలికెను. ఆసమయంబున వసంతుఁడు—మందిరంబునకులోపలి భాగంబున నుండెను. కన్నకొడుకును జేతులార వీరపాలుని వశముఁ జేయుటకుఁ జిత్తమున సంశయించి, యెట్లయినఁ దప్పించుకొనఁ బ్రయత్నింపఁ దలంచి యా దేవాంగన వీరపాలునిఁ జూచి "వీరపాలా! చంద్రశేఖరుఁడు నాయొద్ద నెందు లేఁడు," అనెను.

వీర:—చంద్రశేఖరుఁడు నీయొద్ద లేఁడా?

దేవాంగన:—ఉన్నచో నిచ్చటఁ గనుపింపఁడా;

వీర:—నీ మాయలు నాయెదుట సాగవు. నీవా కుమారుని నెచ్చటనో దాచి, నన్ను వంచింపఁ జూచుచున్నావు. నేను నిన్ను నమ్ముదునా? సత్వరముగ నాతనిందెచ్చి మా కప్పగింపుము.

దేవాం:—లేనివానిందెచ్చి నీకెట్లప్పగింపఁగలను?

వీరపాలుఁడు తన యనుచరులతో " ఈమె చంద్రశేఖరుని నెచ్చటనో దాచియుండుట నిశ్చయము. మీ రీమందిరమంతయు వెదకుఁడు. ఏగదికైనను దలుపు వేయఁబడి యున్నచో బ్రద్దలు కొట్టివేయుఁ"డని చెప్పెను. ఈ కలకల మంతయును విని వసంతుఁడావంతయుఁ జలింపక, ధైర్యచిత్తుఁడై వీరపాలాదులున్న స్థలమునకు వచ్చెను. అక్కుమారునిఁ జూచిన యంతనే, వీరపాలుఁడు "ఇదుగో! చంద్రశేఖరుఁడు చిక్కినాఁ" డని తలంచి, యాతని బట్టుకొనెను.

ఆహా! వసంతా! నీయసదృశ ధైర్యముచేత, రాజభక్తిచేత నీజన్మము ధన్యమైనది. నీజననీజనకులు కృతార్థులయిరి. నీయమూల్య దేశసేవ సకలజనుల హృదయ ఫలకములందు శాశ్వతముగాఁ బ్రకాశింపఁ జేసితివి. రాజ్యసంరక్షణార్థము నిన్ను వైరుల కృపాణమునకు బలినీయఁ దలచితినని తల్లి చెప్పినప్పుడు, వికసితవదనారవిందుండవై " ధన్యోస్మి, ధన్యోస్మి" యని పలికి, రిపులయెదుటఁ బడితివి. నీవంటి మహనీయులను గనుటచేతనే యార్యావర్తము పవిత్రభూమియై విలసిల్లుచున్నది. బాలవీరా! వసంతా! గంగానదీవంతీ వీచికాపరంపరలయందు బావనత్వ మెందాకనుండునో, ప్రభాకరనిశాకరు లెందాక నుందురో, యంతవరకు భవదీయకీర్తి యుండుగాఁత! దేశభక్తులు నీపవిత్రచరిత్రమును గానము సేయుదురుగాత! కవిత్వకాములు పలు తెఱంగులఁ గ్రంథముల యందు లిఖింతురుగాత!

తనకుమారుఁడు వైరులచేతులలోఁ బడుటఁజూచి, యే తల్లిదుఃఖము నాపుకొనఁగలదు? కాని పొరలిపొరలివచ్చుదుఃఖ ప్రవాహమును దేవాంగన యాపుకొనెను. బంధింపఁబడినవాఁడు తనకుమారుండని యప్పుడు తెలిసినచో నింకేమయిన ముప్పు వాటిల్లునని యామె యేమియు మాట్లాడలేదు. కాని చిత్తము నాపుకొనఁజాలక యామె వీరపాలునిఁగాంచి యిట్లనెను:- “వీరపాలా! ఇట్టి దారుణకృత్యము సేయుటకు నీచేతులెట్లు వచ్చినవి? ఇట్టి పసికూనను బంధించుటకేనా బ్రహ్మ నిన్ను సృష్టించినాఁడు! నిన్న మొన్నటిదాక విక్రమాదిత్యుని యనుగ్రహమునకుఁ బాత్రులైన మీరు, దుష్టచిత్తయగు మదాలస వాక్యము లాలించి నేడిట్టి ఘోరకృత్యములఁ జేయుటకు సాహసించితిరా! మీకు వినాశకాలము సమీపించుచుండుట చేతనే యిట్టి పాపకార్యములఁ జేయుచున్నారు. పరమేశ్వరుఁడైనను మిమ్ముల శిక్షించక విడిచిపెట్టునా?”

ఆమాటలువిని “ఈ యనవసర సంభాషణముతో మాకుఁ బనిలేదు. మేము మదాలస యాజ్ఞ ననుసరించి వర్తించువారమని యెఱుంగుము. ఇప్పుడు నిన్నుఁగూడ నేమామె యొద్దకుఁ దోడ్కొని పోవలయును. రమ్ము” అని పలికి వసంతునితో దేవాంగనను వెంటఁబెట్టుకొని, భటులు వెంట నడువ దేర నా వీరపాలుఁడరిగెను.

ఐదవ ప్రకరణము.

"అక్కటా! విక్రాంతుఁడు కారాగృహమునుండి యావలఁ బడుటయెట్లు? ఇందులకేమి యుపాయ మూహింతును? ఆలశ్య మొనర్చినచో నాతని కేమి యపాయ మొదవునో యని కూడ నాకనుమానమగుచున్నది. ఆతఁడీవలఁబడెనేని గొంత వఱకు నాహృదయమువనున్న సంతాపము పోవును. అదియుంగాక మదాలస యొనర్చుచున్న తంత్రములకుఁ బ్రతితంత్రము నాలోచింపఁగలఁడు. కళింగరాజ్యోద్ధారణదీక్షాబద్ధకంకణుఁడై చెఱంజిక్కిన విక్రాంతుని రక్షించుటకై, నాకాతనిపై నున్న మోహ మెట్టి సాహసకార్యమునైన జేయుటకుఁ బ్రేరేచుచున్నది. నేను యోగివేషముధరించి నేటిరేయిని గారాగృహమునకేఁగి, యచ్చటనుండు రక్షకభటులను వంచించి, విక్రాంతునకుఁ గారాగృహ విముక్తి గూర్చవలయును," అని మృణాళిని మనంబునఁ దలంచెను.

మృణాళిని చేయనెంచిన కార్యము సామాన్యమైనది కాదు. కేవలము స్త్రీయైన యామె కపటసన్యాసివేషమునఁ గారాగృహరక్షకులవంచించి, విక్రాంతుని రక్షింపఁగోరెను. ఇయ్యది నిజముగా నతిసాహసమైనకార్యమే. ఇందేమాత్రము రహస్యము బయలుబడినను నామెప్రాణములు దక్కవు. ఏమయినను నామె యాకార్యమును జేయుటకు నిశ్చయించు

కొనెను. మధ్యాహ్నము మూఁడుఘంటలు మొదలు సూర్యుం డస్తాద్రికిఁ జేరువరకును సన్న్యాసివేషము నలంకరించుకొనుటకు సరిపోయెను. తన కపటాకృతి బయలుపడునేమో యను సను మానముచేతఁ బలుసారులు దర్పణమునందుఁ జూచుకొని సంతృప్తిఁబొందెను.

రాత్రి పదిగంటలయ్యెను. అంతనామృణాళిని సురచేఁ బూరింపఁబడిన కొన్నికాచపాత్రిలుగల సంచి నొకదానిని జంకఁదగిలించుకొని, యోగదండమును చేతఁబూని మందిరము విడిచెను. సుక్షత్రియకాంత కలంకారమగు గుప్తఖడ్గమామె నడుమున ధరించి యుండెను. నగరమంతయు మాటుమడంగి యుండెను. ఆమె నెమ్మదిగాఁ జనిచని చెఱసాలను సమీపించెను. రక్షకభటులిరువు రాయుధపాణులై కావలిఁగాచు చుండిరి. మృణాళిని వారికిఁ గొంచెము దూరముగా నిలచుండి "జయసీతారాం" అనిగట్టిగాఁ బలికెను. ఆమాటవినఁగనే రక్షకభటులు "ఎవరునీవు? ఇచ్చటికెందులకు వచ్చితి" వని యడిగిరి.

మృణా:—నేనొక సన్న్యాసిని. ఇది ధర్మశాలకాదా ?

రక్ష-భ:—ఇది సన్న్యాసులుండు ప్రదేశముకాదు. ఇది చెఱ సాల. ధర్మశాల నగరంబున నున్నది పొమ్ము.

మృణా:—అబ్బా ! నే నిప్పు డెచ్చటికి పోఁగలను? నిశాసమ యము కడుదూరమునుండి వచ్చుటచే మిగుల నాయాస

మండితిని. ఎట్లో కొంచెము సేపిచ్చట విశ్రమించి, తెల్ల వారఝామున నావలకుఁ బోయెదను. సన్న్యాసి నగు నా యందు దయయుంచి యిందుల కంగీకరింపుఁడు.

రక్ష-భ—ఇచ్చట నితరు లెవ్వరును బరుండరాదు. కారా గృహాధికారి చూచినచో మాట వచ్చును.

మృణా:—నాయనలారా! మీకు మాట వచ్చునట్లు చేయు వాఁడఁగాను. ఇయ్యది చెఱసాల యని తెలియక వచ్చి తిని. ఎట్లో రెండుఘుంటల కాలము నాయందు మీరు దయఁజూపుఁడు.

ఇట్లు చెప్పి మృణాళిని తన చంకనున్న సంచిని గ్రిందఁ బెట్టి "జయసీతారాం" అని కూర్చుండెను. అప్పుడొక రక్షక భటుఁడు రెండవవానింగాంచి "ఏమిది! ఈతఁడిచ్చటఁగూర్చున్న వాఁడు. ఏమిసేయుదము? గట్టిగా నవతలకుఁ బొమ్మందమన్న సన్న్యాసి యగుటచే జాలి యగుచున్నది." యనెను. రెండవ వాఁడు "పోనిమ్ము ఇందులో మించిపోయిన దేమున్నది? కొంచెముసేపుండి, యీతఁడే యరుగును. కాని యీతఁడొక గొప్పసాధువువలెనే యున్నాఁడు," అని పలికి, మృణాళినిం గాంచి, "నీవు తెల్లవారుఝాముననే యావలకుఁ బోవలయు" నని చెప్పెను.

రక్షకభటులును, మృణాళినియుఁ గొంచెముసేపు ఏవో సంభాషణఁ జేసిరి. ఆసందర్భమున మృణాళిని వారికి-వారణాసీ

గయా ద్వారకాది పుణ్యక్షేత్రమహిమలనుగూర్చి శరీరములఁ బులకలువొడమునట్లు చెప్పుచు "మిక్కిలి డస్సియున్న నన్ను మీరీయర్ధరాత్రి యిచ్చట విశ్రమింపనిచ్చితిరి. ఈ ఋణము నేనెట్లు తీర్పఁగలను? సన్యాసినగు నేను మీకేమియు నీయ లేను కదా ! కాని, నాయొద్ద నతివిలువగల సురయున్నది. ఇదియెచ్చటను లభ్యపడునదికాదు. నాయందున్న భక్తిచే ద్వారకయందొకఁడు నాకిచ్చినాఁడు. నేనది మీకుఁగొంచె మిచ్చెదను. దానిని మీరుసేవించినచో నాయాత్మ యానంద మందు"నని పలికెను. "మహానుభావుఁడవగునీవుమాకొసంగుదు నని చెప్పుచుండఁగా మేమువలదందుమా" యని భటులనిరి. అంతట మృణాళిని తనసంచియందున్న కాచపాత్రలఁదీసిరక్షక భటులకిచ్చి " ఇది యెక్కువ మత్తుకలుగఁజేయునది కాదు. మిగులయానందముగ నుండును" అని వచించెను. కాచపాత్రల యందుండు సుర నాయిరువురు రక్షకభటులును ద్రావిరి. ఏవేవోవెఱ్ఱిమాటలాడి, తుదకు వారు శరీరముల మఱచిపడిరి.

ఇంకను గారాగృహరక్షకభటులాయామూలల నుండిరి గాని వారందఱును సంపూర్ణనిద్రావస్థ నుండిరి. అదియుంగాక మృణాళిని రక్షకభటులతోఁ గూర్చున్న ప్రదేశమున కెదురుగ నున్నకొట్టునందే విక్రాంతుఁడు బంధింపఁబడి యున్నాఁడు. ఆకొట్టు తలుపుఁదీయుట యెట్లని యామె యాలోచించుచు చేచునప్పటికి, సురాపానముచే నొడలుదెలియక పడియున్న

యొక రక్షకభటుని ప్రక్కనున్న బీగ మామె కాలికిఁ దగిలెను. భగవంతుఁడు తన యెడల నీవిధముగ ననుగ్రహించెనని యామె తలంచి వెంటనే యాబీగమును దీసికొని, యెదుటనున్న కొట్టు దగ్గఱకు బోయెను. అందు విక్రాంతుఁ డొక్కఁడే బంధింపఁ బడి యుండెను. అయినను ననుమానము దీర్చుకొనుటకై యామె యాతనిం గాంచి "నీవు విక్రాంతుఁడవేనా" యని యడిగెను. "అవును నీవెవ్వరవు? సన్యాసినివగు నీవిచ్చటి కేల వచ్చితివి?" యని విక్రాంతుఁడు పలుక నామె "నే నెవ్వరైన నేమి? ముందు నీవీ చెఱసాలనుండి యావలఁబడుము" అని తాళముఁ దీసెను. విక్రాంతుఁడు వెంటనే యీవలకువచ్చి వెనుకకు దిరిగి చూడకుండఁ జెఱసాల యావరణమును దాటి యావలకుఁ బోయెను. మృణాళిని మరలఁ జెఱసాలకుఁ దాళము వేసి, బీగము నెప్పటియట్లు రక్షకభటుని ప్రక్క క్రిందఁ బెట్టి "నేను వచ్చినపని యైనది. ఈ భటులు నిద్రించుచున్నారు. ఇఁక నేనావలఁబడెద" నని తలచి, యోగదండమును సంచినిఁ బుచ్చుకొని యాప్రదేశము గడురయమున విడచెను.

ఆఱవ ప్రకరణము.

"దేవాంగనా మందిరమునుండి తీసికొనిరాబడి, వీర పాలునిచే ఖండింపఁబడినవాఁడు- చంద్రశేఖరుఁడు గాఁడు. ఆతఁడు దేవాంగనా కుమారుఁడే. ఇందుల కావంతయు సందియములేదు. చంద్రశేఖరు నెచ్చటనో దాచి దేవాంగన యిట్టి మాయఁ జేసియుండును. చంద్రశేఖరుని రహస్యము నాకెట్లు తెలియును?" అని మదాలస యాలోచించుచుండగా నంతకుముందే యామెచేత నాజ్ఞాపింపఁబడిన భటులు కారాగృహమునుండి దేవాంగనను దీసికొనివచ్చి, యామెముందుఁ బెట్టిరి.

మదాలస:—దేవాంగనా! నీమందిరమున వీరపాలునిచే బంధింపఁబడిన కుమారుఁ డెవ్వఁడు?

దేవాం:—నీవెవ్వనిని బంధించుకొని రమ్మని భటుల నాజ్ఞాపించితివో యాతడే యాకుమారుఁడు.

మదా:—చంద్రశేఖరుఁడేనా!

దేవా:—అవును.

మదా:—కాడని నా కనుమానముగ నున్న దే!

దేవాం:—నీ యనుమానమును బాపుటకు నేనెట్లు సమర్థురాల నగుదును?

ఖండింపఁబడిన యాకుమారుని శిరమును దీసికొని రండని మదాలస భటులకుఁ జెప్పెను. మదాలస యాజ్ఞ ననుసరించి, భటులు ఖండింపఁబడిన వసంతుని శిరమును దీసికొని వచ్చిరి. ఆశిరంబును జూచిన యంతనే దేవాంగన తనమనంబున "అక్కటా! దుష్టులీ కుమారుని ఖండించినారు. ఏమిసేయుదు" ననుకొని కుమారునుద్దేశించి "హా కుమారా! నీరాజునిమిత్తము ప్రాణములఁ బరిత్యజించితివా! నేను జీవించి యుండఁగనే నీమరణమును నేను కన్నులారఁ జూడవలసి వచ్చినదే! ఇయ్యది నీ తండ్రివిన్న నెంతవిలపించునో కదా! ఆతఁడు కారాగృహంబునఁ జిక్కియుండుటచే నీ కిట్టిగతి సంభవించెనుగాని, లేకున్న వీరపాలాదులు మనమందిరంబును ప్రవేశించి నిన్నుఁదోడ్కొని వచ్చుటకు శక్తులగుదురా! ఇంతకును నేను పూర్వజన్మమునఁ జేసిన పాపమిట్లు పరిణమించినది. సహస్రజన్మములకైన నీవంటి సుగుణ రత్నాకరుండగు కుమారుని నేనుగాంచఁ గలుగుదునా! సంతతి లేదని కుందుచు, ననేక దేవతల కనిశంబును బూజలు సేయుచుండు పుణ్యవతులెందఱో యుండఁగాఁ బాపాత్మురాలనగు నాగర్భంబున నేలజనించితివి? వత్సా! "తేజోనిధికి వయసు కారణంబగునే" యనునట్లు నీరాజునిమిత్తము వైరుల కరవాలమునకుఁ బ్రాణము లర్పించి, దివినలంకరించిన నీవు కృతార్థుఁడవే. కాని, నీయసమాన సుగుణములును, మృదు

మధుర భాషణంబులును, వినయమును, ధైర్యమును నాకు మఱపునకురావు" అని పెక్కుభంగుల విలపించుచు, దన దుఃఖమును బ్రకటింపరాదని తలంచి, ధైర్యచిత్తయై నిలిచి యుండెను.

మదాలస దేవాంగనకు ఖండింపఁబడిన శిరముఁజూపుచు "ఇప్పుడు చెప్పుము. ఈశిరంబెవ్వరిది ? ఇయ్యది చంద్రశేఖరునిదే యందువా" యనియడిగెను. దేవాంగన ప్రత్యుత్తర మీయలేదు. మదాలస మరలనిట్లు పలికెను: "దేవాంగనా! నీవు దాచినందువలనఁ బ్రయోజనములేదు. ఇదిగో! నీ కుమారుఁడు వధింపఁబడినాఁడు. ఇప్పుడైనను నీవు చంద్రశేఖరుని నెచ్చట దాచితివో చెప్పుము. నిన్ను విడిచిపుచ్చెద" ననెను.

దేవాం:—ఇఁక నాకు నీవలన భయమేల? చంద్రశేఖరునిఁగూర్చి నాకేమియుఁ దెలియదు.

మదా:—నీ కేమియుఁ దెలియదా?

దేవాం:—ముమ్మాటికిని దెలియదు.

మదా:—ఇప్పుడు నీకుమారుఁడు ఖండింపఁబడినాఁడు కదా! నీవా చంద్రశేఖరుని వృత్తాంత మెఱింగింపక యుంటివేని, నీయెదుటనే నీనాథుఁడగు విక్రాంతుని శిరముగూడ ఖండించి వేసెదను.

దేవాం:— క్షుద్రశీలవగు నీ వెట్టికార్యమునైనఁ జేయఁ గలవు. ఇట్టి దుష్కృత్యములఁ జేయుదునని నీవు నన్ను

భయపెట్ట నవసరములేదు. నేను భయమందుదానను గాను. నీయిచ్ఛవచ్చినట్లు మమ్ము జేయుము.

"విక్రాంతుని" గారాగృహమునుండి యిచ్చటికిఁ దీసికొనిరండని మదాలస భటులకుఁ దెలిపెను. భటులాక్షణము నసే కారాగృహమున కేగి వచ్చి విక్రాంతుఁడెట్లో కారాగారమునుండి తప్పించుకొని పోయెనని మదాలసకుఁ దెలిపిరి. ఆమాట వినినతోడనే దేవాంగన తనయంతరంగమున "గీడులో మేలనునట్లు - నానాధుఁడు చెఱనుండి తప్పించుకొని పోయెనని వింటిని. ఈమాట నాకెంతయు సంతసముఁ గూర్చుచున్నది. ఇఁక నేనేమయినను నాకు విచారము లేదు. కళింగరాజకుమార సంరక్షణమునకుఁ గావలసిన ప్రయత్నములన్నియుఁ జేయును. సద్గుణవతియు, నిష్కల్మష స్వాంతయు, సాహసురాలును నగు మృణాళిని యాతనికిఁ దోడై యుండుఁగాక!" యనితలంచెను.

మదాలస యాజ్ఞపై భటులు దేవాంగనను చెఱసాలకు మరల దీసికొనిపోయిరి. మదాలస వీరపాలునిఁ జూచి "వీరపాలా! ఈచిత్ర మేమి? విక్రాంతుఁడు కారాగృహమునుండి యెట్లుతప్పించుకొనిపోయెను ? అతిజాగరూకతతో మెలంగవలసినదని నాయాజ్ఞగా నీవు కారాగృహ రక్షకులకుఁ దెలిపియుండలేదా? వారిట్లజాగ్రత్తగ నుండుటకుఁ గారణమేమి ! ఇట్టికార్యములు జరుగుచున్నచో మనప్రయత్నము లేమి ఫలిం

చునో? కళింగరాజ్యపీఠము నేనెట్లారోహింతును ? మనయభీష్టము లెట్లుతీరును?" అనిపలికెను. వీరపాలుఁడు "మదాలసా! విక్రాంతుఁడు చెఱనుండి తప్పించుకొనిపోవుట నాకును వింతగనేయున్నది. ఇఁకముందు మిగుల జాగరూకతతో మెలంగవలసినదని కారాగృహరక్షకులకుఁ గఠినముగా నాజ్ఞాపించెదను. జరిగిన దాన్నిగూర్చి మనము చింతించినందువలనఁ బ్రయోజనము లేదుకదా!" యనెను.

"ఇఁకముందు జాగ్రత్తఁ బుచ్చుకొన్ననేమి! పుచ్చుకొనకున్న నేమి? చేతికిఁ జిక్కిన పిట్ట యెగిరిపోయినది. చెఱనుండి తప్పించుకొని పోయిన యావిక్రాంతుఁ డేమికుట్రల నెవ్వరితోఁ బన్నునో, మనకేమి మోసము వాటిల్లునో నాకేమియుఁ దోచకయున్నది. ఇఁకనాతఁడు మనకుఁ జిక్కఁడు. దుర్జయుఁడు మనకు వశమైయున్నను నొకొక్కసమయమున నాతనిని నమ్మకయుందును. నీపైనాకున్న మోహముచేత దుర్భరమైన కార్యములను నీమీఁదనే పెట్టుచు, రహస్యములన్నియు నీకే చెప్పుచుంటిని. నాచిత్తమును నీవు గ్రహించితివో లేదో! నీచేత ఖండింపబడినవాఁడు చంద్రశేఖరుఁడు గాఁడనుటకు సందియములేదుకదా? ఎట్లయినను మనమాచంద్రశేఖరుని జాడలెఱింగి, వానిని గడతేర్పఁ గలిగితిమా, యీ సామ్రాజ్యము నావశమైనట్లే. అప్పుడు మన మిరుపురమును నెట్లుందుమో ఆసంగతి యిప్పుడు చెప్పనేల!" యని మదాలస

దుర్జయుని పైఁ జూపించిన కపటమోహామే వీరపాలునియందుఁ జూపుచుఁ బలికెను.

ఆమాటలకు వీరపాలుని మొడలు పరవశమైపోయెను. ఆతఁడామెం దిలకించి "విక్రాంతుఁడు చిక్కకయుండునా? చిక్కక పోయినను నాతఁడు మన కేమియు నపాయముఁ గూర్పఁ జాలఁడు. నెమ్మదిగాఁ జంద్రశేఖరుని జాడలు దీయుదము. నీయందున్న మోహాముచే మహాపాప కార్యములు గూడఁ జేయుచుంటిని. తుద కేమగునో" యనెను. "ఏమగును? కళింగ సామ్రాజ్య పాలనావైభవంబునఁ దులఁదూగఁ గలవు!" అని మదాలస పలికెను. ఆమాటలకు నవ్వుచుఁ గారాగృహ రక్షకభటులకుఁ దగుజాగరూకతఁ దెలిపి వచ్చెదనని వీర పాలుఁ డరిగెను.

ఏడవ ప్రకరణము.

చెఱనుండి తప్పించుకొనిన విక్రాంతుఁడు తనమందిరమున కేగెను. అచ్చట దేవాంగనయు వసంతుఁడును లేరు. ఏమైయుందురా యని యాతఁడాలోచించుచుండెను. అంతలో నచ్చోటికి మృణాళిని వచ్చి, వసంతుఁడు ఖండింపఁబడెననియు దేవాంగనను బంధించుకొని పోయిరనియు దెలిపెను. సహజ ధైర్యచిత్తుఁడైనను గొడుకుమరణంబును విని విక్రాంతుఁడు

"హా కుమారా! నాకడుపున మంటఁబెట్టి పోయితివా! విద్యలఁ గఱవలేదు, శత్రువులఁ దునిమి యశమందలేదు. అక్కటా! ఆమృత్యుదేవత నిన్నింతలోనే మ్రింగివేసినదా!" యని పలు విధములఁ జింతింపఁగడంగెను. అప్పుడు మృణాళిని యాతనిం గాంచి "ధీరపురుషుండవగు నీవిట్లు దుఃఖింపవచ్చునా ? బాలుఁడైనను రాజ్యసంరక్షణార్థము తన ప్రాణములఁ గోలు పోయి దివంబలంకరించిన కుమారునికై వగచుట పాడిగాదు" అని చెప్పెను.

రాజకుమారుఁడగు చంద్రశేఖరుఁడు సరోజనిచేఁ గూర్మదుర్గమునకు దీసికొని పోఁబడెనని వినినయంతనే విక్రాంతుని చిత్తమున నారాటము జనించెను. "మృణాళినీ! నేనిచ్చట నొక నిముషమైనను నిలువఁజాలను. కూర్మదుర్గము నకుఁ బోయి సరోజని యొద్దనుండి చంద్రశేఖరునిఁ దీసికొని రావలయును. ముందాకార్యముఁ జేసినఁగాని దేవాంగనను జెఱనుండి తప్పించు మార్గము నూహింపఁజాలను. మనకు విశ్వాసపాత్రుఁడైన కందర్పుని మూలమున మదాలసా మాయల నెఱుంగుచు వీలగునంతవఱకు రహస్యముగాఁ గర్తవ్య మూహించుచుండు" మని మృణాళినికి దెలిపి విక్రాంతుఁడు కళింగ నగరమును విడిచెను.

కళింగరాజ్య సంరక్షణంబునకై దీక్షవహించి మిగుల శ్రమనందుచున్న యాతని చిత్తమునకుఁ గుమారమరణంబును-

దేవాంగనా కారాగార బంధనంబును జింత గలుగఁజేయు చున్నవిగాని, యాతఁడాచింతనైన సరకుఁగొనక, చంద్రశేఖర ప్రాణసంరక్షణమే ముందు చేయవలసిన ముఖ్యకార్యమని యరణ్యమార్గమున వడిగ నడచుచుండెను. ఆతఁడు కూర్మ దుర్గమును జేరులోపలఁ దన జాడ మదాలస కేమయిన దెలిసినచో మార్గమధ్యమందుఁ దాను రిపులకుఁ బట్టువడుదునేమో యని కూడ గొంచెము సంశయించుచునే యుండెను. రాజకుమారుఁడగు చంద్రశేఖరుఁడు సరోజనియొద్ద నుండుటచే నాతని కేమిహాని యొదవునో యని చింతించుచుండెను. గతించిన కుమారునిఁ గూర్చి దుఃఖించినందువలనఁ బ్రయోజనములేదు. ఏవిధముగానైన రాజకుమారుని సరోజని యొద్ద నుండి తీసికొనివచ్చిన పిదప దేవాంగనను జెఱనుండి తప్పింప వలసిన కార్యమే యాతని మనస్సును బాధించుచుండెను. కార్యాతురతను బ్రయాణముఁజేయు మానవుఁడు గట్టులను, బుట్టలను, ముండ్లను లక్ష్యముసేయక నడచుచుండును. మనమెంతవడిగా నడచినను బ్రొద్దుతో సమానముగ నడువలేము కదా! మనకై సూర్యుండపరాత్రినిఁ జేరకుండ నుండడుకదా! కూర్మదుర్గమిక నాలుక్రోసుల దూరముండెను. విక్రాంతుఁడు మిగుల డస్సియుండుటయేగాక సూర్యుం డపరాద్రికిఁ జేరుచుండెను. కనుచూపుమేరలో నాతఁడొక పల్లెంగాంచి యా రాత్రి కచ్చట విశ్రమించి తెల్లవారఝామున బయలుదేరి కూర్మదుర్గమునకుఁ బోవఁదలంచి యాపల్లెకుఁ జేరెను.

ఎనిమిదవ ప్రకరణము.

సీ. "ఉరుమహోదయ ధరే ♦ శ్వరుఁడు దాల్చిన పద్మ
రాగ ఖచితపుఁ దు ♦ రాయి యనఁగ
బలభిత్సభామంట ♦ పమునందుఁబట్టిన
బెడగారుకెంబట్టు ♦ గొడుగనంగఁ
బ్రత్యూషమున విష్ణు ♦ పదమునకెత్తిన
దివ్యనీరాజన ♦ దీపమనఁగ
దొలిదిక్కుజవరాలి ♦ యళికస్థలంబునఁ
దులకించు కాశ్మీర ♦ తిలకమనఁగ

తే. స్వతరుణారుణకాంతు లూ ♦ ర్ధ్వమున కెగసి
శరధపదమండలంబు చెం ♦ దిరము పొరిమి
నట్లు గావింపనొయ్య నొ ♦ య్యనఁ బ్రమోజ
మిత్రబింబంబు పూర్వాద్రి ♦ మీఁదదోచె.

అట్టిసమయమునఁ గూర్మదుర్గమున సగోజని "కళింగ నగరమునుండి వార్తలేమియుఁ దెలియుటలేదు. దేవాంగన యేమైనదో! మృణాళిని యెట్లున్నదో! మదాలస దేవాంగనా వికారింతుల యెడల నేమి కీడు సేయదలంచుచున్నదో! స్వామిద్రోహియై మదాలస మాయలోఁబడిన నా నాథుఁ డిచ్చటికి రాకయుండుటయు మిగుల వింతగ నేయున్నది. ఆతఁడుఁ

సర్వకాల సర్వావస్థల యందును మదాలసను సేవించు చున్నాఁడని కర్ణాకర్ణిగా వింటిని. పోనిమ్ము. అతఁడచ్చటనే యుండుఁగాక! ఆతఁడొకవేళ వచ్చినను దుర్గములోఁ బ్రవేశింప నీయవలదని దుర్గసంరక్షకులకు నాజ్ఞ నిచ్చియుంటిని. ఏది యెట్లయినను రాజకుమారుఁడగు చంద్రశేఖరుని నేనతిజాగరూకతతోఁ గాపాడి, యాతఁడు కళింగరాజ్య పీఠమున నాసీనుఁడై యుండఁ జూచి యానందింపవలయును. అట్లొనర్చితినేని దేవాంగనా మనోరథమును సిద్ధింపజేసినదాన నగుదు" నని తలంచుచుండెను.

మృణాళినికడనుండి చంద్రశేఖరునిఁ దోడ్కొనివచ్చిన నాటినుండియు సరోజని యక్కుమారుని నతిజాగరూకతతోఁ గాపాడుచుండెను. అతని కెట్టి విధమైన కొఱంతయుఁ గలుగకుండ శతవిధముల నరయుచుండెను. దేవాంగనా విక్రాంతులకై యాతఁడు బెంగఁగొనకుండ, నేసమయంబున కేదికావలసిన నది యిచ్చుచుఁ గడుప్రేమతో జూచుచుండెను. అతఁడును నామెయందు నతిభక్తిబూని చరించుచుండెను. కాని యప్పుడప్పుడాతఁడు దేవాంగనావిక్రాంతులను గూర్చి తలంచుచునే యుండెను. కళింగనగరమునుండి తన్ను సరోజని యేకారణము మీఁదఁ గూర్మదుర్గమునకుఁ దీసికొనివచ్చినదో తెలియదు. దేవాంగనావిక్రాంతులు కూర్మదుర్గమున కెప్పుడు వచ్చెదరని మాత్ర మాతఁడు సరోజని నడుగుచుండును.

సరోజిని తనమనంబున నేదియో యాలోచించుచున్న సమయంబునఁ జంద్రశేఖరుఁడు వచ్చి "మాపినతండ్రి యగు విక్రాంతుఁడును, బినతల్లియగు దేవాంగనయు నిచ్చటికి వచ్చెదరని యనుదినంబును బలుకుచుందువే! ఇంతవరకు రారేమి" యని యడిగెను.

సరోజని:—కుమారా! వారు తప్పక వచ్చెదరు. నీవు వారిం గూర్చి బెంగఁగొని యుంటివా?

చంద్ర:—బెంగ యేమియును లేదు. కాని, నేను మారాజ్యమును విడిచి యిచ్చటనుండుటకుఁ గారణము నూహింపఁజాలక యున్నాను. ఆకారణము నీవెఱింగించితివేని సంతసింతును.

సరో:—నాయనా! దుష్టచిత్తయైన నీమేనత్తయగు మదాలస వలన భయంబునఁ జేసి నీవిచ్చట నుండవలసి వచ్చినది. రాజ్యకాంక్ష వహించిన యామె నీకు హానిఁగూర్పఁదలఁచినది. నీ నిమిత్తము దేవాంగనా విక్రాంతులు సకల కష్టములఁ బొందుచున్నారు.

చంద్ర:—బాలుఁడనగు నేనామదాలస కేమియపకారముఁ జేసితిని.

సరో:—వత్సా! జ్ఞానశూన్యులు యుక్తాయుక్తములు యోచింపరుగదా!

ఇట్లు వీరిరువురును సంభాషించుచుండఁగా ద్వారపాలకుఁ డొక చీటిందెచ్చి సరోజనింగాంచి "దేవీ! నిన్ను దర్శించుట కెవ్వఁడో వచ్చి యీచీటి నీకొసంగుమని వచించి, ద్వారమున నిలిచియున్నాడు" అని చెప్పెను. సరోజని యాచీటింజూచి "ఆపురుషుని లోనికిఁబంపు" మని ద్వారపాలునితోఁ జెప్పి, "నాయనా! నీపినతండ్రి వచ్చినాఁ" డని చంద్రశేఖరున కెఱింగించెను.

విక్రాంతుఁడు వచ్చినయంతనే చంద్రశేఖరుఁడు-పెన్నిధింగన్న పేదచందంబున సంతోషించుచు నాతనిం గౌఁగలించుకొని "పిన్నతల్లియగు దేవాంగనయు, సోదరుఁడగు వసంతుఁడును రాలేదేమి కారణ" మని యడిగెను. ఆ మాటకుఁ బ్రత్యుత్తర మీయఁజాలక విక్రాంతుఁడు కొంచెముసేపు మౌనము వహించియుండెను. ఆతని మౌనమున కనుమానమంది సరోజని "విక్రాంతా! పుత్త్రసహితయగు దేవాంగనకుఁ గుశలమేకదా! మృణాళినికి క్షేమమే?" యని యడిగెను. గద్గదకంఠుఁడై విక్రాంతుఁడు "సరోజనీ, ఏమిచెప్పెదను? నాకుమారుఁడగు వసంతుఁడు ఖండింపఁబడినాఁడు. దేవాంగన కారాగృహంబున బంధింపఁబడినది. నేనొక యోగి యనుగ్రహంబునఁ జెఱసాల నుండి యీవలఁ బడినాఁడ. ఆసన్న్యాసి యెవ్వఁడో, నాకాతనిపైఁ గరుణకలుగుట కేమి కారణమో నాకుఁదెలియదు. ఈవిషయమునుగూర్చి మృణా

శ్శేని నడుగఁదలచియుఁ జింతాపీడితుఁడనగుటచే మఱచితిని. ఆ మదాలస యెన్నికూ్రరకృత్యములనైనఁ జేయసాహసించుచున్నది. చెఱయందు బంధింపఁబడిన దేవాంగన కేమి హాని గూర్చునోయని సంశయమగుచున్నది" యనిపలికెను. వసంతుని మరణమువిని సరోజని మిగుల దుఃఖించెను. చంద్రశేఖరుఁడు విలపించెను. సరోజనిచే నూరడింపఁబడి చంద్రశేఖరుఁడు తన విచారమును గ్రోధముగా మార్చుకొని పినతండ్రియగు విక్రాంతుని వీక్షించి యిట్లుపలికెను: "తండ్రీ! మీరు నాకై యనేకకష్టంబులఁ బొందుచుండిరి. ఇన్నికష్టంబులఁబడనేల? నన్నా కళింగ నగరమునకుఁ దీసికొనిపొమ్ము. ఆ మదాలస శిరంబు నొక్కవ్రేటున నఱికి నీకు ముదంబుఁగూర్చెదను. కరవాలముఁ గరమునందు ధరించినందువలనఁ బ్రయోజనమేమి యున్నది? దేశాపకారులను, నధర్మవర్తనులను, దుష్టచరిత్రులను ఖండించుటకుఁగదా యియ్యది ధరింపవలయును? మదీయ హస్తాలంకృత కృపాణధారలచే మదాలసను, దదనుచరులను గంఠనాళముల నఱికి తదీయరక్తము భూమిపై నదులు గట్టించెదను. అంతవఱకును నేను నిద్రపోవను. లెమ్ము. నారాజ్య పీఠము నెక్కుటకు మదాలస యెట్లడ్డు రాలగునో చూచెదను."

బాలుని వీరవాక్యములకు విక్రాంతుఁడానందమంది, ముద్దాడి "తండ్రీ! విరోధులను వధించుటకు బాలుఁడవైన నీవు కావలయునా! నేను రణంబున నిలచితినేని నన్ను

మాఱొక్కనఁగల వాఁడెవ్వఁడు? కుమారా! పరాక్రమ శౌర్యం బులు గలిగి యుండియుఁ గాలమునకుఁ గట్టుబడి నీనిమిత్త మిట్టిశ్రమల నందుచున్నాఁడను. నీతండ్రితో నేనును దేవాంగ నయుఁ జేసిన శపథము ననుసరించి, నిన్నుఁ గళింగరాజ్య భద్ర పీఠంబున నాసీనుంజేసి తీరుదును. ఇందులకై నేనుగాని దేవాంగన గాని ప్రాణములనైన విడుచుటకు సంసిద్ధులమై యుంటిమి."

"విక్రాంతా! నీవు కారాగృహమునుండి యీవలఁ బడితివికదా! దేవాంగన నెట్లయినఁ జెఱనుండి తప్పించుటకుఁ బ్రయత్నింపక, యిట్టిసమయములో నిచ్చటి కేల వచ్చితివి?" యని సరోజని విక్రాంతుని నడిగెను. అందులకు విక్రాంతుఁడు "సరోజనీ! నాచిత్తమంతయు నీ చంద్రశేఖరుని మీదనే యున్నది. ఈతనిపైనున్న బెంగ నాకునిజకుమారుమరణంబును, దేవాంగనా కారాగృహ బంధనంబును మఱపించినవి. నీవు మాయెడలఁ గరుణవహించి యీకుమారుని నింతవఱకును గాపాడినందుల కెంతయుఁ గృతజ్ఞుఁడను. ఇఁక నీతనినిదోడ్కొని పోవుదును. ఇందులకు సమ్మతింపుము. నేనిచ్చటికి వచ్చుట కిదియే కారణ"మని విక్రాంతుఁడు బదులు జెప్పెను.

సరోజ:—నీవీకుమారునిఁ దోడ్కొని పోవుటకుఁ దగిన కారణము నేనెఱుంగఁజాలక యున్నాను. ఈతనికిచ్చట గొఱత యేమయినఁ గలుగునని తలంచితివా?

విక్రం:—నీయొద్ద వీనికేమియు లోపముండదు.

సరో:—అట్లయినఁ గారణమేమి? ఈతఁడు నాయొద్ద నుండుట వలన నేమైన హాని యొదవునేమో యని భావించితివా ?

ఈ మాటకుఁ బ్రత్యుత్తరమేమని చెప్పవలయునో విక్రాంతునకుఁ దోఁచలేదు. "నీదగ్గఱనున్నచో నీకుమారునకు హానియొదవునని చెప్పినచో నామె చిత్తమున నేమని భావించునో ! చెప్పకయున్నచో నాతని భావ మామె కెట్లు తెలియును?" ఈసందేహములచే నాతఁడు కొంచెము సేపాలోచించి, తన సంశయమును బ్రకటింపఁదలంచి సరోజని కిట్లు పలికెను.

"సరోజనీ! నీవు నాకు సోదరివంటి దానవగుటచే నా నిష్కల్మష హృదయభావమును నీకు వెలిఁబుచ్చుచున్నాను. నాయందేమయినదోషమున్నచో మన్నింపుము. కళింగరాజ్యోద్ధారణముఁ జేయ దీక్షవహించిన నాకన్నియు సంకటములే ప్రాప్తించుచున్నవి. ఒకప్రక్క నిజకుమార మరణమున గలిగిన చింత. వేఱొకప్రక్క దేవాంగన చెఱఁబడుటవలనఁ గలిగిన చింత. వీనికేమి ? రాజకుమార సంరక్షణమును గూర్చిన చింతయే ముఖ్యముగ నాహృదయమును బాధించుచున్నది. నీవు నిష్కల్మష చరిత్రవనుటకుఁ గాని, నీయొద్ద నున్నంతవఱకుఁ జంద్రశేఖరుఁడు సురక్షితుఁడై యుండు ననుటకుఁగాని యణుమాత్రము సంశయములేదు. కాని, యొక్క విషయము మాత్రము నీకుఁ జెప్పక తప్పదయ్యెను. నిన్న

మొన్నటి దాక విక్రమాదిత్యుని యందు భక్తి విశ్వాసము లతోఁ మెలంగిన నీనాథుఁడగు దుర్జయుఁడు నేఁడు మదాల సకు విధేయుఁడై, దుష్టకృత్యములయం దామెకుఁ దోడ్పడు చున్నాడు. వీరపాలుఁడును, దుర్జయుఁడును నామెకుఁ గుడి యెడమ భుజములై వర్తించు చున్నారు. మదాలసా మాయావాగురం జిక్కి యున్న దుర్జయుఁడీ జంద్ర శేఖరు జాడనెఱింగి యున్యెడ కరుడెంచి యేమిహాని సేయునో యని నేనుసంశయించుచున్నాను. అతఁడరుదెంచి యీకుమా రుని మదాలస కడకుఁ దోడ్కొనిపోవుటకుఁ దనవశముఁ జేయుమని యడిగినచో నీవేమని చెప్పఁగలవు? వశముఁ జేయనని ధిఃకరించి పలుకఁ గలవా? దుష్టులను గొందఱిని వెంటఁబెట్టుకొనివచ్చి బలాత్కారముగఁ దీసికొనిపోయినచో నేమిచేయఁగలవు? ఈ కుమారుని ప్రాణసంరక్షణము నిమిత్తము నీవు దుర్జయునితోఁ గలహముఁ బెట్టుకొందువా? వీని మూలమున నీవిట్టి కష్టములందనేల? కావున నే నీతనినిఁ దీసికొనిపోయి యెచ్చటనైన రహస్యస్థలంబున భద్రముగా నుంచి, యనంతర విధానమును గూర్చి ప్రయత్నములు జేయుదును."

సరోజని విక్రాంతుని వాక్యములువిని యిట్లుప్రత్యుత్త రముఁజెప్పెను. "విక్రాంతా! ఈసంశయము నిన్ను బాధించునని నాకుఁదెలియును. నీవు దానిని వెల్లడించినందులకు నేనెంతయు

సంతసించితిని. కళింగరాజ్యోద్ధారణమును గూర్చి నీవును దేవాంగనయు నెట్లు దీక్షాకంకణులైతిరో, యట్లే నేనును జంద్రశేఖరుని ప్రాణసంరక్షణమునకు దీక్ష వహించితిని. ఇవ్విషయమై నేను మృణాళినితో శపథముఁ జేసియుంటిని. నాశపథమున కేమాత్రము భంగమొదవదు. ఈతని సంరక్షణమునకై నీవుపడుచున్న శ్రమలో నన్నుఁగూడ గొంతపాలుఁ గొననిమ్ము. ఒకవేళ మదాలసా ప్రేరేపణంబున నానాథునివలనఁ జంద్రశేఖరునకు హానికల్గునేమో యని నీవు సంశయింపఁబనిలేదు. ఏనాఁడాతఁడు విక్రమాదిత్యుని యందుండు భక్తివిశ్వాసములు మఱచి, దుష్టచిత్తయగు మదాలసకు వశుఁడయ్యెనో, యానాఁడే నాకు భర్తకాఁడని తలంచితిని. ఆనాఁడే నాకును నాతనికిని ఋణము తీరిపోయినది. ఆతఁడియ్యెడ కరుదెంచినను దుర్గమును బ్రవేశింపనీయవలదని దుర్గరక్షకులకుఁ జెప్పియుంటిని. నాకంఠమునఁ బ్రాణములున్నంతవఱకుఁ జంద్రశేఖరున కేమియు భయముండదు. ఇవ్విషయంబున నీవు సంశయింపఁ బనిలేదు. ఇక్కుమారుఁడు నాయొద్దనే యుండును. నన్ను వీరక్షత్రియకుల ప్రావిఖ్యాతగను, సత్యవాక్యదీక్షామతిగను నెఱుంగుము. చంద్రశేఖరుని విషయమున నేనేమైనఁ బాపము దలంచి నాకడ నుండనిమ్మని పలికినదాననేని కాంతావ్యామోహమును విడువలేని యోగీశ్వరుఁడు పోవుగతికిని, మధ్యస్థుఁడనని పలికి తగవుదీర్చుచోటఁ బక్షపాతము వహించెడివాని

గతికిని, వివాహకార్యముల భంగముసేయువాని గతికిని, బరాంగనా మానసోల్లాసుని గతికిని, మాతాపితృభక్తివిహీనుని గతికిని, నపరాహ్ణవేళ నాకలిఁగొని వచ్చిన యతిథికి నన్నముఁబెట్టకుండ భుజించిన వానిగతికిని, నర్థాపేక్షనుబుత్రికను వృద్ధున కొసంగి వివాహముఁజేసిన వానిగతికిని, నపరాధము లేకుండ భార్యను బరిత్యజించిన వానిగతికిని బోవుదును.

క. "శతకూపాధిక దీర్ఘిక
శతవాప్యధికంబు గ్రతువు ♦ శతయజ్ఞ సము
న్నతుఁడొక్క సుతుఁడుఁ దత్సుత
శతకంబున కెక్కుడొక్క ♦ సత్యోక్తినృపా."

ఈవాక్యార్థమును నేనుసంపూర్తిగ గ్రహించిన దానను. కావున నన్నునమ్మి చంద్రశేఖరు నిచ్చటనేయుంచుము."

సరోజని మాటలు విని విక్రాంతుఁడు తనమనంబున "ఈసరోజని నిశ్చయముగా నిష్కల్మషచరిత్ర యగుటచేతనే మృణాళిని చంద్రశేఖరుని నీమెకడ కంపినది. ఈమెచెప్పిన మాటలయందు లేశమయినను నసత్యములేదు. ఈమె యొద్ద నున్నచోఁ జంద్రశేఖరున కేమియు భయంబొదవదు." అని తలంచెను. చంద్రశేఖరుఁడు విక్రాంతునిఁజూచి "పినతండ్రీ! నేనీ సరోజనియొద్ద సుఖముగా నుందును. నీవు నన్నుఁగూర్చి భయమందఁబనిలేదు. ఎట్లయినను మదాలస నంతంబొందించుటకు నీవు చేయవలసిన ప్రయత్నములన్నియుఁ ద్వరలోఁ

జేయుము" అని వచించెను. "సరోజినీ! నిష్కపట స్వాంతవగు నీమాట కెదురు చెప్పఁజాలను. నీవు కోరినయట్లు చంద్రశేఖరుఁడు భవద్రక్షణంబుననే తనరఁగలఁడు. ఈతని విషయమై నీకు నేను చెప్పవలసిన దేమియులేదు. ఈతని భారమంతయు నీయది," యని విక్రాంతుఁడు సరోజినీతోఁ జెప్పెను. "ఇంకను మాట్లాడవలసిన సంగతు లేమయిన నున్న భోజనానంతరమున సావకాశముగ మాట్లాడుకొనవచ్చు" నని సరోజని పలికినంతనే విక్రాంతుఁడు స్నానాదికృత్యములు దీర్చుకొనుటకు లేచెను.

తొమ్మిదవ ప్రకరణము.

కళింగనగరమున-మదాలస మందిరములోఁ గూర్చుండి కారాగృహము నుండి దేవాంగనను దీసికొని రమ్మని భటుల కాజ్ఞాపించెను. మదాలస యాజ్ఞననుసరించి దేవాంగనను భటులు దీసికొనివచ్చిరి. మదాలస దేవాంగననుజూచి "దేవాంగనా! నీవుచేసిన మాయ యంతయు నేనుగ్రహించితిని. నీవు దాచినందువలనఁ బ్రయోజనము లేదు. వీరపాలుని కృపాణమునకుఁ జంద్రశేఖరునకు మారుగా నీవు నీకుమారుని బలిఁ బెట్టితివి. కన్నకొడుకును జంపుకొనుటకు నీచిత్తమెట్లు సమ్మతించినది.? సరే! జరిగిన దానికేమి? ఇప్పుడైనను నీవు సౌఖ్య

నుండదలచిన దానవేని? జంద్రశేఖరు నెచ్చటదాచితివో చెప్పుము. నిన్నుఁ గారాగృహమునుండి విడిచివేసెదను. నీవా రహస్యము నిప్పుడుజెప్పవేని నీకు మరణము నిశ్చయమని యెఱుంగుము," అని పలికెను. ఆపలుకులకు దేవాంగనయించు కంతయుఁ జలింపలేదు. ఆమె ధైర్యచిత్తయై మదాలసకిట్లనెను.

"మదాలసా! నీవెంతయడిగినను రాజకుమారుని విష యము నాకేమియుఁ దెలియదు. వీరపాలునిచేత ఖండింపఁ బడినవాఁడు నాకుమారుఁడే. కన్నకొడుకును జంపుకొన్న పాపాత్మురాలనని నన్ను దూషించుచుంటివి. నీకన్నఁ బాపచిత్త లీప్రపంచమునలేరు. రాజ్యకాంక్షంజేసి జనకసమానుడును సచ్చరిత్రుఁడును నగు సోదరునిఁ జంపి, భర్తను స్వర్గమునకుఁబంపి యిప్పుడు సోదరపుత్రునిఁగూడఁ జంపఁ జూచుచున్నావు. నీవెన్ని దుష్టకృత్యములఁ జేసినను గళింగరాజ్యపీఠము నీవారోహింపఁజాలవు. ఇదినిశ్చయము. నీవు నన్నుఁ జంపుదువని నేనావంతయు భయమందను. ఏనాడు నీవు నన్నుబంధించితివో యానాడే నాప్రాణములు పోయినవిగ భావించితిని. రాజ్య సంరక్షణార్థము నేనుగాని నాజీవితేశ్వరుఁడుగాని ప్రాణముల నయిన విడుచుటకు సంసిద్ధులమని యెఱుంగుము. మృత్యువనిన నీకు భయముగాని నావంటి వీరవనితలకు భయంబుండదు. ఈ దేహికెప్పుడైనను మరణమున్నది. అట్టియెడల నేడైననేమి? రేపైననేమి?"

దేవాంగన పలికిన వాక్యము లాలించి మదాలస యీమెంగాంచి "చంపెదమన్నను భయమందక సంధిజ్వర పీడితునివలెఁ బ్రేలుచుంటివేమి? నీవు చంద్రశేఖరుని జాడ నెఱింగించెదవా లేదా" యనెను. "చావనున్న దానికి నీవలన భయంబేల? చంద్రశేఖరునిజాడ నాకుఁదెలియదు. నన్నీవిష యమును గూర్చి నీవడుగఁ బనిలేదు. నీవు నన్నుఁ జంపినను సరే," యని దేవాంగన బదులుచెప్పెను. అంతట మదాలస భటులంజూచి "ఈసాహసురాలి గ్రుడ్లను బెఱికివేయుఁ" డని యజ్ఞాపించెను. ఆహా! అతిదారుణము! అతిదుస్సహము! భటులు మదాలస యాజ్ఞననుసరించి దేవాంగన గ్రుడ్లు పెఱికి వేసిరి.

"హా! పరమేశ్వరా! దీనత్రాణపరాయణుఁడనునీబిరుద మేమూలనడంగియున్నది? నిరంతరము నిన్ను సేవించునకల్మష చరిత్రనగు నాకీపాటు రాఁదగినదేనా? నీవునాయెడల నిర్దయ వహించుటకు నేనొనర్చిన పాపమేమియున్నది? దుష్టచరిత్ర యగు మదాలస యొనర్చుకృత్యములు నీకు సంతోష మయ్యెనా!" యనిదైవము నుద్దేశించి పలికి, యాదేవాంగన మదాలస కిట్లనెను. "క్రూరాత్మురాలా! మదాలసా! నీవిట్టి దుష్కార్యములచేత నిప్పుడు సంతోషించినను, నీవు బ్రదికి యుండఁగనే యీపాపములకుఁదగినఫలమును బొందకపోవు. స్వామిద్రోహులై, నీమాయయందుఁ జిక్కి నీకుఁ జేయూత

నిచ్చుచున్న వీరపాలుఁడును, దుర్జయుఁడుగూడ దుర్మరణంబు నందుదురుగాక! కళింగరాజ్యపీఠమునఁ జంద్రశేఖరుఁడాసీనుడై యాచంద్రతారకముగఁ బాలించుఁగాక!"

మదాలస భటులంజూచి, ఈ దేవాంగనను నగరమునకు వెలుపలనున్న యరణ్యమున విడిచిరండు." అని యాజ్ఞనిచ్చెను. భటులు దేవాంగనను గొనిపోయిరి.

భటులు దేవాంగనను నరణ్యమున విడిచిపోయిరి. ఆమె యేకాకియై యుండెను. ఎచ్చటికిఁ బోవుటకును గన్నులు గనిపించుటలేదు. ఎవ్వరిని వేడుకొనును ? ఎవ్వరామెను రక్షింతురు? "మదాలసా! కఠినచిత్తవై యెట్టిదుష్కార్యముఁ జేయ సాహసించితివి? ఇంతకన్నఁ గృపాణముచే నాశిరము ఖండించియున్నచో నేనీ చింతనందక యుందునుగదా!" యని మదాలస నుద్దేశించి కొంతసేపును "హా! మనోహరా! కళింగరాజ్య సంరక్షణార్థము కుమారుని వైరుల కరాసికి బలిసమర్పించిన నీయర్ధాంగి స్థితి నేడీరీతినిఁ బరిణమించినది. చెఱనుండి బయట పడి నీవెచ్చటకేగితివి? నన్ను రక్షింపరావేమి?" యని విశ్రాంతునిఁగూర్చి కొంతసేపును, రాజకుమారుఁడగు చంద్రశేఖరునిఁగూర్చి కొంతసేపును నేమేమో పరిపరివిధములఁ దలపోయుచుండెను.

పదవ ప్రకరణము.

దేవాంగన విడువఁబడిన యరణ్యమునకుఁ గనుచూపు మేరలో - ఎల్లెడనల్లిబిల్లిగ నల్లుకొన్న పొదరిండ్లగడనుండు మల్లెమొత్తములును, హృదయాహ్లాదకరంబులగు జాజులును, ఘుమ్మ్మఘుమ్మ్మని కమ్మని తెమ్మెరలఁ జిమ్ము సంపెంగలును, మదనునిచేతనుండు ఖడ్గమును సానఁబట్టు నున్నపైన పలక శాల్లోయనఁదగు గేదంగులును, మార్గాయాస సంజనిత తృష్ణా విదారణంబులగు నారికేళంబులును, భూర్జకర్జూర పనసనింబాది బహువిధ భూజంబులును, విమలసలిలాసారపూరిత సరోవరంబును, నాసరోవర తీరంబున మత్స్యంబులఁ బట్టుటకై దొంగ జపం బాచరించుచు వేచియుండు బకంబులును, ముద్దుపలుకుల రామనామము బలుకు శుకంబులును, లేమావిచిగురులఁ దిని 'కుహూ కుహూ' ధ్వానంబులు సేయు పికంబుల్లును, బురులు విచ్చి యాడుచుఁ దమనఖంబులచే సర్పంబులఁ జీల్చి యొడిసి పట్టు కేకిసముదయములును గలిగి భాసిల్లు నొకరమణీయమైన వనంబుండెను.

అయ్యది మృణాళిని యను ధినంబును విహరించు నుద్యానవనము. కాని విక్రాంతుఁడు మదాలసచే బంధింపఁబడిన నాటనుండియు నామె యవ్వనమునకు వచ్చుటయేలేదు. చంద్రశేఖరుని ప్రాణసంరక్షణార్థము దేవాంగనా విక్రాంతు

లెంత పరితాపము నందుచుండిరో, యంతకంటె నెక్కువగ నీమెగూడఁ బరితపించుచుండెను. ఎట్లయినను విక్రాంతుని కష్టములు గట్టెక్కినచో నాతనికి సతియై యలరావచ్చునని యామె తలంచియుండెను.

నేడు చెలికత్తెలగు కుముదయుఁ, గమలయును బలవంతము సేయఁగా నయ్యుద్యానవనంబునకు వచ్చెను. కందనుఁడు గూడ నామెతో నేతెంచెను. ఈతఁడు దేవాంగన బంధింపఁబడిన నాటనుండియు మృణాళిని యొద్దనే యుండెను. మృణాళిని యవ్వనంబున నొక సరోవర తీరంబున నాసీనయై కందనునిఁ జూచి "కందనా! కూర్మదుర్గమున కరిగిన విక్రాంతుఁడింతవఱకును రాడయ్యెను. ఇందులకుఁ గారణమేమైయుండునో? దేవాంగనను గారాగృహము నుండి తప్పించుట కేమైన యత్నముఁ జేయుటకు నాకు శక్యముగాక యున్నది. విక్రాంతుని చెఱనుండి తప్పించిన నాటనుండియుఁ గారాగృహరక్షకులకు మదాలస కఠినమైన యాజ్ఞల నిచ్చియున్నదట!"

కంద:—రాజు నిమిత్తము విక్రాంతుఁ డెట్టికష్టముల నైన బొందుచున్నాడు. కుమారమరణంబునకు ధైర్యము వహించెను. భార్య బందిగంబునబడినందులకోర్చెను. చంద్రశేఖర సంరక్షణార్థము కూర్మదుర్గమునకుఁ బరుగెత్తెను. ఈతఁడు పడుచున్న కష్టముల జూచిన నాకెంతయు జాలియగుచున్నది. ఆతఁడరుదెంచి యెట్లో తగినయోధులఁ గూర్చుకొని మదాలసాగర్వంబు నడంచుటయే కర్తవ్యమని

తోఁచుచున్నది. ఇంతకంటె మఱియొక మార్గము నాకేమి యుఁ దోఁచుటలేదు.

మృణా:——నీవు చెప్పినమాట నిశ్చయమే. ఆతఁ డరుదెంచెనేని యేప్రయత్నమైన జేయుటకు వీలుగ నుండును.

అంతలో కుముదయుఁ గమలయు మృణాళినిని సమీపించి "చెలీ! ఈ సరోవరతీరంబుననే కూర్చుంటివేమి? ఇంచుక కాలమాప్రాంతమున విహరింతము రమ్ము" అని పలికిరి. మృణాళిని వారింగాంచి "సఖులారా! నాచిత్తము వనవిహార సౌఖ్యంబునందుఁ బ్రవేశించుటకు సమ్మతించుటలేదు. నేఁడు మీరు బలవంతపఱచుటచేత నిచ్చటికి వచ్చితినిగాని లేకున్న రాకుండెడిదాననే. రాజు నిమిత్తము దేవాంగనా వికాంతులు పట్టకష్టంబుల్లు బడుచుండగాఁ వారికష్టములలోఁ గొంతవఱకుఁ బాల్గొనియున్న నాకిప్పుడీ వనవిహారమేల? ఏనాఁడు దేవాంగనావికాంతుల కష్టములు తొలంగి, చంద్రశేఖరుఁడు నిజరాజ్య సింహాసన మారోహించునో యానాడు నాకానంద మొదవునని తలంపుఁ" డనెను.

ఇట్లు వీరు సంభాషించుచుండఁగా "హా! నన్నొక వ్యాఘ్రము చంపవచ్చుచున్నది. రక్షింపుఁడు, రక్షింపుఁ" డను స్త్రీ యార్తారావము వారికి వినవచ్చెను. "కందనా! నీదగఱ విల్లున్నదిగదా! పాపమెవ్వరో యొకస్త్రీ వ్యాఘ్రమునకుఁ

జిక్కునుండి రక్షణముఁ గోరుచున్నది" యని పలికి, మృణాళిని యాకందనుని చేతిలోనున్న విల్లునందుకొని, యార్తారావము వినవచ్చిన దెసం బరుగెత్తెను. ఆమె వెంటఁ గందనుఁడును, గుముదయుఁ, గమలయుఁ గూడఁ బరుగెత్తిరి. మృణాళిని యాప్రదేశముఁ జేరునప్పటి కొకవ్యాఘ్ర మొకస్త్రీ కంఠమును బట్టుకొని యుండెను. మృణాళిని యావ్యాఘ్రమును దన వింటి దెబ్బచే నేలఁబడఁగొట్టి, యాస్త్రీని సమీపించెను.

ప్రాణావశిష్ట యగు నాస్త్రీ యెవ్వరు? తన రాజు నిమిత్తము వైరుల కృపాణమునకు నిజకుమారుని బలియిచ్చి, తుదకుఁ దన ప్రాణములు గూడ నేడు విడువనున్న దేవాంగనయే. దేవాంగన నట్టి స్థితియందుఁ జూడఁగనే మృణాళిని యొక్కింత కాలము చేష్టారహిత యయ్యెను. కందనుఁడు "దేవీ! నీకెట్టిగతి సంభవించిన" దని విలపించెను. మృణాళిని దేవాంగనను విలోకించి దేవాంగనా! నేను మృణాళినిని. కందనుఁడు గూడ వచ్చియున్నాఁడు. నీకిట్టిపాటెట్లు సంభవించిన" దని పలికెను. దేవాంగన మృణాళినికి గద్గదస్వరముతో నిట్లు పలికెను. "మృణాళినీ! నీవు సమయమునకు వచ్చితివి. కఠినాత్ముఁ రాలగు మదాలస నాగుర్లను బెదిరించి, యీప్రదేశమున విడిచిపెట్టించెను. అనవరతము రాజభక్తియే సకల సౌభాగ్య పదంబని భావించిన యీదేవాంగన; మనోవాక్కాయ కర్మములయందు విక్రాంతుని దివ్యచరణారవింద సేవ తప్ప నన్య

మెఱుంగనియీ దేవాంగన; రాజకుమార ప్రాణసంరక్షణార్థము నిజపుత్రుని రిపులయసిచే ఖండింపఁబడుటకుసమ్మతించిన స్వార్థ పరిత్యాగియైన యీ దేవాంగన నేడిట్టిదుస్థితిఁ బొందినది. నామరణంబునకు మాత్రము నేను చింతించుటలేదు. కాని, యిట్టిసమయమున నానాథుఁడగు విక్రాంతుఁడు దగ్గఱలేడను చింతయొకటియు, రాజకుమార సంరక్షణార్థము మేమందు చున్నశ్రమ ఫలింపకుండఁగనే పరమేశ్వరుఁడు నన్నుఁ దనసన్నిధికిఁ దీసికొని పోవుచున్నాఁడను చింతయొకటియు బాధించు చున్నది. ఏమైనను దేనికిని మనము కర్తలముగాము. పూర్వ జన్మమునందు నేనేదో పాపముఁజేసియుందును. తత్పాపఫల మీజన్మమున నీవిధముగా ననుభవింపవలసివచ్చినది. ఇట్టి సమయమున భగవంతుఁడు నిన్నునుఁ గందనునిఁ బంపినందుల కెంతయు సంతసించుచున్నాను. జననీజనకులకన్న, సోదరుల కన్న, బంధుజనంబులకన్న నాయెడల నధికప్రేమఁజూపిననిన్ను నేను సహస్రజన్మములకైన మఱువఁజాలను. ఇఁక నేను మాట లాడుటకుఁ గూడ శక్తి తగ్గిపోవుచున్నది. తననృపాలుని నిమిత్తము నానాకష్టముల నందుచున్న నానాథునకు నీవు శక్తి యున్నంతవఱకు సంపూర్ణమగు సహాయమొనర్పుము. మదాలసవలనఁ జంద్రశేఖరున కావంతయు హానిగలుగకుండరక్షించి యాతనినిఁ గళింగరాజ్య భద్రపీఠమున నాసీనుంజేయుటకు నానాథునకు నీవు తోడ్పడుదునని వాగ్దానమిచ్చితివేని, నా

యాత్మకు ముదంబొదవుచు. నేను సుఖముగాఁ బ్రాణములు విడిచెదను."

దేవాంగనావాక్యము లాలించి మృణాళిని కన్నీరు గార్చుచు "అక్కటా! దేవాంగనా! నీకుసంభవించిన యీగతి కేమని వగతును! మహాపుణ్యచరిత్రవగు నీయెడల భగవంతుఁ డీవిధమునఁ గరుణాదూరుఁడై నందులకు విచారించుచున్నాను. రాజకుమారునిఁగూర్చి నీవు చింతింపవలదు. మదాలస వలన నాతని కేవిధమైన హానియు సంభవింపదు. విక్రాంతుఁ డాత నిని సింహాసనాసీనుం జేసి యశమందగలఁడు. కాని యట్టి యానందమును జూచుభాగ్యము నీవు నోచుకొననైతివి." యని పలికెను.

"హా వీరనారీమణీ! దేవాంగనా! కన్నతల్లి విధమున నాయెడలఁ బ్రేమఁబూని నన్నురక్షించిన నీవు నన్నెడబాసి పోవుచుంటివా! ఇఁకనాకెవ్వరుదిక్కు! నేనెవ్వరిని జేరుదును? పుత్రమరణము వలనఁ గలిగిన దుఃఖము నెట్లోమఱచి రాజు నిమిత్తము తనశరీరమంతయు ధారపోయుచున్న విక్రాంతుడు, నీమరణమువిని, మనఁగలఁడా! ఆతనిధైర్యమంతయుఁ జెదరి పోవదా!" యని కందనుఁడు దేవాంగనను జేరిదుఃఖించెను.

దేవాంగన కందనునిఁగాంచి తడఁబడు మాటలతో నిట్లనెను. "కందనా! నీవు విచారింపవలదు. కళింగరాజసేవ కులలో నెన్నికష్టములు వచ్చినను జలింపక, మమ్మెడఁబాయక

భక్తివిశ్వాసములతో నొలఁగినవాఁడవు నీవొక్కఁడవే. నీవు నాపైఁజూపిన భక్తివిశ్వాసములిఁక మృణాళినిపైఁ జూపుము. ఈమె చెప్పినయట్లు వర్తింపుము. నానాథుఁడగు విక్రాంతుని నెప్పుడును నెడబాయక యాతనికిఁ గడిభుజమవై యలరారుము. నాగతి యాతనికి వివరించి యధైర్య మందకుండఁ జేయుము. నావాక్యములుగా నావీరశేఖరున కిట్లు చెప్పుము.

"ప్రాణేశ్వరా! నేటితో నీపదసేవఁ జేయుభాగ్యము నాకుఁదీరిపోయినది. వీరాగ్రేసరుఁడవును, స్వామిభక్తిపరాయణుఁడవును నగు నీకు నేను చెప్పవలసిన దేదియునులేదు. నాయెడబాటువలనఁ గలుగుదుఃఖమునకు నీవు చిత్తమునఁ దావీయక కార్యముదెస వర్తింపుము. విక్రమాదిత్యునితోఁ జేసిన ప్రమాణము ననుసరించి, రాజుకొఱకు, ధర్మసంరక్షణము కొఱకు, నెన్నియిక్కట్టులకునుఁ బడి చంద్రశేఖరుని సింహాసనాసీనుంగా నొనర్చి కృతార్థుఁడవుగమ్ము. రాజద్రోహులై మహాపాపచిత్తయగు మదాలసఁజేరి, దుష్టకృత్యము లొనర్చుచున్న వీరపాల ధుర్జయుల శిరంబులను భవత్కృపాణంబున ఖండించి, తద్రక్తప్రవాహమున నభ్యంగన కేళి సల్పి నాయాత్మకు శాంతిఁగూర్పుము. కాలమునకుఁ గట్టుబడి యొరంబెట్టిన కృపాణము నీవలకుఁ దీయుము. ప్రభుభక్తిపరాయణులలో విక్రాంతున కీడెవ్వఁడును లేడనునట్లు నీయశోడిండిమము సకలదిక్కులఁ మ్రోగించుము."

ఇట్లుపలికిన యాదేవాంగన "చంద్రశేఖరుఁడు కళింగ రాజ్యరమావధూటి నాచంద్రార్క తారావనీ శరధిస్థాయిగఁ బాలించుగాఁక!" యని దీవించి, నిమీలితలోచనయయ్యెను. మృణాలిని యామెపైఁ జేయివైచి "దేవాంగనా! దేవాంగనా!" యనిపిలిచెను. ఇఁకనెక్కడ దేవాంగన! ఒక్కనిట్టూర్పు విడిచి యామె ప్రాణములు విడిచెను. కందనుని దుఃఖమునకు మేరలేకపోయెను. పొంగి పొరలివచ్చుచున్న తనదుఃఖప్రవాహమునాపుకొని మృణాళిని కందనునివిలోకించి "వీరపతివ్రతా శిరోమణియగు దేవాంగన మనలనెడఁబాసి పోయినది. ఇఁకఁ మనము చింతించినందువలనఁ బ్రయోజనములేదు. ఈమె పావన కళేబరదహనమును గూర్చి మనమాలోచింపవలయు" ననిపలికి, తానును గందనుఁడును దేవాంగన మృతశరీరము కడనుండి దహన సంస్కారమునకు వలయు పరియత్నముతో నిజసేవకులను దీసికొని రమ్మని కమలాకుముదలను గృహమునకుఁ బంపెను.

దేవాంగనా మృతకళేబరము మృణాళిని వనంబునకుఁ జేర్పఁబడెను. "ఆహితాగ్నులును, యజనశీలురును, మహాయోధాగ్రేసరులును, వీరపతివ్రతామణులును, బరమనిష్ఠాగరిష్ఠులై తపంబొనర్చిన మహనీయులును బోవు సుగతికీదేవాంగన పోవుఁగాక" యని మృణాళిని పలుకుచుండఁ, గందనుఁడు దేవాంగనకు దహనసంస్కారాదిక్రియలు యథావిధిగ నిర్వర్తించెను.

పదునొకండవ ప్రకరణము.

అది సంధ్యాసమయము. మంద మలయానిలము డెందములకానందముఁ గూర్ప వీచుచుండెను. అట్టిసమయమున మందిరోద్యానవనంబున మదాలస యొంటరిగాఁ గూర్చుండి "విక్రాంతుఁడేమాయెనో! ఆతనిజాడ యొక్కింతయుఁ దెలియకయున్నది? అరణ్యమున విడువఁబడిన దేవాంగన యా ప్రదేశమున లేదని తెలియవచ్చినది. ఏవన్యమృగమో యామె నాహారముగాఁ జేసికొని యుండుట నిశ్చయము. ఎంతప్రయత్నించినను జంద్రశేఖరుని దేవాంగన నెచ్చటదాచినదో యావిషయ మెఱుంగఁజాలక యున్నాను. ఎన్నిక్రూరకృత్యములు ఎన్ని హింసలు జేసినను ఈకళింగరాజ్య సింహాసనమారోహించి నప్పుడుగాని నాస్వాంతమునకు సంతోష మొదవదు. దేవాంగన తనప్రాణములనైనఁ గోలుపోవుటకు సంసిద్ధయయ్యెనుగాని, చంద్రశేఖరునిజాడ మాత్ర మెఱింగించినది కాదు. నేనెంత ప్రయత్నించినను, జంద్రశేఖరుఁడు జీవముతో నున్నంతవఱకు, నాకీరాజ్యము పూర్తిగా వశముకాదు. ఎట్లైయిన నాతని నంతమందింప వలయును. ఆతఁడు మడిసెనేని విక్రాంతుని ప్రయత్నములన్నియు నంతటితో భగ్నమగును. నాప్రయత్నములు ఫలించుటకు నాకపటనాటక ప్రదర్శనంబున వీరపాలమర్జయులను పాత్రలుగాఁ జేసితినిగదా! వీరిపై నాకు

నిజముగా మోహమున్నదనియే తలంచుచున్నారు. “నా మనోరథ సిద్ధినందు వరకును నేనువారితో నట్లేవర్తింప వలయును”, అని తలంచుచుండెను.

అప్పు డచ్చటికి వీరపాలుఁడువచ్చి “మదాలసా! నేను నీకొక యనుకూలమైనవార్త వినిపించెదను. నాకేమి యొసంగెద”, వనిపలికెను. “చంద్రశేఖరుని జాడయేమయినఁ దెలిసినదా యేమిఁ? నీముఖము కలకల లాడుచున్నది” యని మదాలస వచింప, నందులకు వీరపాలుఁ డిట్లుపలికెను. “నీనిమిత్తము నేనెన్ని శ్రమల నందుచున్నానో నీవేమయిన గ్రహించుచుంటివా? ఈవీరపాలుఁ డెఱుంగఁ గలిగెను గాని మఱియొకఁడా చంద్రశేఖరుని జాడ నెఱుంగఁ గలఁడా! నేటికిఁ బదిదినముల నుండి నిద్రాహారములులేక నానాకష్టములు బడఁగాఁ దుదకా రహస్యము నేటికి గ్రహింపఁ గలిగితిని. ఆతఁడు మనదుర్జయుని భార్యయగు సరోజని సంరక్షణంబునఁ గూర్మదుర్గమున నున్నవాఁడని వింటిని.”

మదా—వీరపాలా! ఈమాట నిజమేనా! నీకెవ్వరు చెప్పినారు?

వీర—నేనసత్యము బలుకుదునా!

మదా—ఇట్టివార్తఁ దెచ్చిన నీకేమిచ్చినను నాకుసంతోషము కలుగదు.

వీర—నీవు మాటలతోడనే నన్ను సంతోష పఱచుచుంటివి.

మదా—నేను నీమీద నెంత యోకోరికచేఁ బగలును రేయియుఁ బరితపించుచు నెప్పుడు మనప్రయత్నములు ఫలించునా యని తలంచుచున్న నన్ను నీవిట్లు పలుకుదువా !

వీర—నేనిట్లు పలికితినని నీకాగ్రహము కలిగినదా ! నీకాగ్రహము కలిగినచో నేను తాళఁజాలను. హాస్యమున కట్లు పలికితిని గాని మఱియొందుకాదు.

"ఇప్పటికి మనకుఁ జంద్రశేఖరుని జాడఁదెలిసినది. ఎట్లయినను నాపురుగును నలిపి వేసితిమేని మనయిచ్ఛవచ్చిన తెఱంగునఁ జరింపవచ్చును. ఇక్కార్యమున దుర్జయుని నియోగింపవలయును. నీవరిగి యాతని నిచ్చటకుఁ బంపు" మని మదాలస వీరపాలునకుఁ జెప్పెను.

దుర్జయుఁడు వచ్చి "ఇఁకఁగొలఁది దినములలోనె నా యదృష్టముఫలించును. మదాలసకు నాయందున్న ప్రేమ వర్ణనాతీతము. ఇట్టి దివ్యలావణ్యసంపంతి; శరదిందు ప్రతిమాన బింబవదన; ఇంద్రనీలాలక; నన్ను వలచినప్పుడు నేను చేయరాని పనియేమున్నది ? కళింగరాజ్య సింహాసన మారోహింపనున్న సుందరాంగి నాకు భార్య యగుచున్నది. ఇట్టిభాగ్యము మఱియెవ్వనికైన లభించునా!" యని మనంబున సంతోషించుచు మదాలసను సమీపించెను. వారిరువురును నీక్రిందివిధమున సంభాషించిరి.

మదా—నేడు నీవెచ్చటను గనిపింపలేదేమి?

దుర్జ—కనిపింప కేమి ? బెంగచే నటునిటు వెఱ్ఱివానివలెఁ దిరుగుచున్నాను.

మదా—నీకు బెంగయేల ?

దుర్జ—నిన్ను గుఱించియే బెంగ. ఈదాసుని మీద నీకటాక్షేక్షణంబుల నెప్పుడు ప్రసరింపఁ జేయుదువో ఎప్పుడు నీవును నేను కలసి సౌఖ్యాంబుధి నోలలాడుదుమో యని నిరంతరము దలంచు చుందును.

మదా—దుర్జయా ! నీకు నిజముగా నాపై మోహమున్నదా! లేదు. లేదు. నీమాటలన్నియు నసత్యమే.

దుర్జ—నామాట లసత్యములా !

మదా—అసత్యములు గాకేమి ! నిజముగా నాపైనీకు మోహమున్నచో నేఁజెప్పిన కార్యమును సాధించియేయుందువు!

దుర్జ—నీవు చెప్పిన కార్యము నేనుచేయని దేమున్నది ?

మదా—చంద్రశేఖరుని జాడఁ గనుగొంటివా ?

దుర్జ—శతవిధములఁ బ్రయత్నము జేయుచుంటిని. ఇంతవఱకును దెలియలేదు.

మదా—ఆవార్త వీరపాలుఁడెఱుంగఁ జాలినాడు.

దుర్జ—ఆ! నిజముగనే చంద్రశేఖరుని వృత్తాంతము దెలిసినదా! వీరపాలుఁడు నీకుఁజెప్పినాడా! ఇంకనాతఁడు నీయనుగ్రహమునకు బాత్రుఁడగును! కాబోలు!

మర్జయుఁ డామాటఁ బలికినంతనే యామదాలస కొంచెము కోపము నటించుచు "ఛీ! ఎట్టిమాటఁ బలికితివి? ఇట్లు పలుకుటకు నీనాలుక యెట్లాడెను? వీరపాలుఁడా కార్యమును సాధించెనని చెప్పినంత మాత్రమున నాతఁడు నాకుఁ బ్రియుండగును గాబోలునని పలుకుచుంటివా?" యనిపలికెను. "ఆగ్రహింపకుము. నోరుజారినది చెంపలు వేసికొందు" నని పలికి యట్లుచేసి యామర్జయుఁ డెదురుగానున్న కొన్నిపుష్పములను దీసికొనివచ్చి మదాలసకిచ్చి "వీని నలంకరించుకొనుము. నేనుచూచి యానందించెద" ననెను.

మదా:—దుర్జయా! నావంటివారు పుష్పముల నలంకరింతురా! ఎవ్వరైనఁ జూచిన నవ్వరా!

దుర్జ—ఎందులకు నవ్వుదురు?

మదా—భర్తృవిహీనలు పుష్పములనలంకరింప రాదుకదా!

దుర్జ—నీవు భర్తృవిహీనవా! నన్ను మోహించితినని చెప్పితివే. నేను నీమనోహరుఁడను గాదా! అట్టిచో నీవీపుష్పముల నలంకరించుకొని నాకానందముఁ గూర్పవా!

మదా—నిన్ను నేను వివాహమాడిన పిదపఁ బుష్పముల నలంకరించుకొందును.

దుర్జ—ఇప్పుడు పుష్పములనే యలంకరించుకొననిదానవు నన్ను వివాహ మెట్లాడుదువు? అందులకు లోకము పరిహసింపదా?

మదా:—వివాహమైనచో నవ్వరు. దానిని వితంతూద్వాహ మందురు. అది శాస్త్రసమ్మతము.

దుర్జ—అట్లనా! ఇప్పుడు నాకుఁ దెలిసినది. నామనస్సున కానందము కలిగినది. నీనిమిత్తము తెచ్చిన యీపుష్పము లను నావలఁ బాఱవేయుటకు నాచిత్తము సమ్మతింపదు. కావున నీపాదకమలములపైన యీపుష్పములతోఁబూజ జేసి సంతృప్తి పడుదును.

అనిచెప్పి, యాదుర్జయుఁడు కొన్నిపుష్పములను మదాలస పాదములపై వైచి పూజసేయఁ దొడఁగెను. ఆతని కృత్యములకుమదాలస తనలోనవ్వుకొనుచు "దుర్జయా! నీవిటఁ గూర్చుండుము. నీతోఁ గొంతరహస్యము మాట్లాడ వలసి యున్న" దని చెప్పినంతనే దుర్జయుఁ డామెప్రక్కనున్న పీఠ ముపైఁ గూర్చుండి "ఇప్పుడు మనమెట్లుంటిమి? భార్యాభర్తల వలె నుంటిమి. రాజు-రాణివలె నుంటిమి. అవునా! కాదా!" యనెను. "కాకేమి నేను రాణినైన నప్పుడు నీవు రాజువు కావా! ఈశ్రమలనన్నియుఁ బడుటయెందులకు? ఇందు నిమి త్తమేకదా" యని పలికి, యామదాలస యాతని కిట్లనెను.

"దుర్జయా! మనయభీష్టమెట్లయినను ఫలించుట కింత వఱకును మన మనేక ప్రయత్నములఁ జేసితిమి. ఎన్నియో శ్రమలఁ బడితిమి. ఎన్నియో ఘోరకృత్యములఁ జేసితిమి. ఇఁక ద్వరలోనె మనయభీష్టము తీరగలదు. కాని యొక్క

మహాత్కార్యము నీవు చేయవలసియున్నది. చంద్రశేఖరుఁ డిప్పుడు కూర్మదుర్గమున సరోజనీ సంరక్షణంబున నున్నవాఁ డఁట ! ఎట్లయినను నీవాకుమారు నిటకుఁ దోడ్కొని రావల యును. ఈకార్యము నీవొనర్చితివేని కళింగరాజ్య పీఠ మవ లీలగ నాకు స్వాధీనమగును. ఇఁక నాపైనఁ జెప్పవలసిన దేము న్నది? నేను కళింగ రాజ్యమునకుఁ బాలకురాలనై యుండ నీవు నాకుఁ బాలకుఁడవై యుందువు. అప్పుడు నీవును నేనును మహానందవారాశిలో నోలలాడుదుము."

"ఏమేమీ ! చంద్రశేఖరుఁడు నాభార్యయగు సరో జనియొద్ద నున్నాఁడా ! అట్లయిన సందియమేమి ? ఆతఁడిచ్చట నున్నవాఁడనియే భావింపుము. నేను ఱెక్కలుగట్టుకొని కూర్మదుర్గమునకుఁబోయియాకుమారునిటకుఁదోడ్కొనివచ్చెఁ దను. ఇందుల కేమియు శ్రమపడ నవసరములేదు. ఈసంగతి యింతకుమున్నే తెలిసియున్నచో నింతయాలస్యముగాకయుండె డిదే. కానిమ్ము జరిగినదానికి యోచింపనేల? ఆకుమారునిదో డ్కొనివచ్చుభారము నాయది. పిదప నాయభీష్టముఁ దీర్చు భారము నీయది. శృంగార రసాధిదేవతవు, మోహన దివ్యౌ షధీ ఘటికవు. నన్ను మోహ శృంఖలములచే బంధించి వేసితివి. నీవు చెప్పిన కార్యము నేనుజేసితినేని నాకు బంధమోక్ష మొన రించెదవా? విస్తులమదనసామ్రాజ్యవైభవ మందఁజేసె దవా? మోహసాగరంబున మునింగియున్న నన్ను నీగాఢా

లింగనంబను నాకచే నుద్ధరించెదవా? సారస కల్హారకైరవవిరాజిత విమలసలిలపూరిత కాసారతీరంబులందును, శుకశారికామయూరసంతాన భరితమహోద్యానవనంబులందును, బహుళదరీప్రాంత భాసమాన శశికాంత శిలావేదికల యందును, నుదగ్రసితాభ్రప్పు వినంబుల యందును, నీతో విహరించు నానందముగలుగఁ జేయుదువా!" యని పలికి దుర్జయుఁ డచ్చోటు వాసెను.

మదాలస "నాకార్యము నెఱవేరువరకును, నీతఁడుగాని వీరపాలుఁడుగాని యెట్టిమాట లాడుచున్నను నేనావంతయుఁ గినుకఁజూపరాదు. అట్లుచూపుదునేని నాకార్యభంగమగును. నాకపటమోహపాశములయందుఁ దగుల్కొని వీరెట్టి కార్యములైనఁ జేయుచున్నారు," అనితలంచుచు, సూర్యుండస్తగిరిఁజేరుచుండుటచే యామదాలస మందిరమును బ్రవేశించెను.

పండ్రెండవ ప్రకరణము.

అయ్యది గ్రీష్మఋతువు. ఆయాప్రదేశములందుఁ బానీయ శాల లేర్పడెను. ఎండమొత్త మతిశయిల్లెను. భూమియంతయుఁ బ్రద్దలువారెను. పుష్పపత్రాళిఁతో బాదపములన్నియు వాడెను. పశుపక్షి మృగకదంబము తృష్ణచే శోషిం

చుచుండెను. మలయానిల కిశోరములు నశించెను. సుడి గాడ్పులు తమయిచ్చవచ్చినయట్లు చెలరేగెను. చలిపందిరుల యందుఁ బాంథులకు నీరిడు నుపకారులకుఁ దీరికలేకయుండెను. వనంబులయందు మల్లికా పాటలీ ప్రసవంపుఁ దావులెప్పటికిని దఱుగక యుండెను. సింహ గజశార్దూలాది మృగసముదయ ములు జలప్రదేశముల విడువక యుండెను. పశునికాయము బంధుర వటచ్ఛాయల నెడబాయక యుండెను.

అట్టికాలమున నొకనాటిమధ్యాహ్నసమయమున నొక పాంథుఁడు తనలో "ఆసరోజిని చెప్పినప్రదేశ మింకెంత దూర మున్నదో! విక్రాంతుఁ డిన్నిదినంబుల నుండియుఁ గూర్మమర్గ మునఁ జంద్రశేఖరుని యొద్దనున్నాడని తలంచి యచ్చటికిఁ బోయితిని. కానియాతఁ డందులేడయ్యెను. ఆతఁడు కొంత సైన్యమును సమకూర్చుకొను ప్రయత్నంబున నేగెనని సరో జిని యెఱింగించుటచే నీమార్గమున వచ్చితిని. అక్కటా! నేనావిక్రాంతునకు దేవాంగనామరణంబు నెట్లువినిపింతును? మానవుని సంతతసౌఖ్యాబ్ధిలో నోలలాడించునది కాంత. సంసారమును వృద్ధిఁజేసి యన్వయంబును నిలుపునది కాంత. శాశ్వతైశ్వర్య భోగంబులఁ గూర్చునది కాంత. స్వర్గశ్రీ సమాశ్లేష సౌఖ్యమిచ్చునదికాంత. అట్టి కాంతలలో దేవాంగన సామాన్యమైనదికాదు. భర్తృసేవాధురంధరి. తనరాజు నిమి త్తము నిజకుమారుని రిపులకృపాణమునకు బలిగా నొసంగుట

కించు కేనియుఁ జలింపని వీరపతివ్రత. ఆమెమరణంబును విన్నంతనే వికాంతుని హృదయ మెట్లగునో కదా” యని తలపోయుచు నరణ్యమార్గమునఁ బోవుచుండెను.

అతఁడు కొంతదూరము పోవునప్పటికి మార్గమునకుఁ బ్రక్కగాఁ గనుచూపుమేరలో నొకకొండ ప్రక్కనున్న సెలయేటి గట్టునఁ గొందఱు మనుష్యులు గూర్చుండి యేదియో యాలోచించుచున్నట్లు గోచరంబై, నెమ్మదిగా నాప్రదేశమున కేగెను. అదియే సరోజని యాపాంథునకుఁ జెప్పిన ప్రదేశము. వికాంతుఁడు - కూర్మదుర్గమునఁ జంద్రశేఖరుని జూచి, యాప్రదేశమును విడిచి యందందుఁ జరించి, సైన్యమును గూర్చుకొనుచు, నాప్రదేశము నందుండెను. వికాంతుఁడు పాంథునిఁ జూచినయంతనే “కందనా! ఈరహస్యప్రదేశమును నీవుకనుంగొని యెట్లు వచ్చితివి” యనియడిగెను. పాంథుఁడగు కందనుఁడు వికాంతుని స్వరమునుబట్టి యానవాలు పట్టెను గాని యాతని రూపమంతయు మారి, సన్యాసివలెనుండెను. కందనుఁడు వికాంతునిఁ గాంచి, దేవా! నీనిమిత్తము కూర్మదుర్గమున కరిగి యచ్చట సరోజనిచే నెఱింగింపఁబడి యిట్లువచ్చితి,” ననెను. వికాంతుఁడు “కందనా! రాజకుమారుని నిమిత్తమై నేనుపడుచున్న శ్రమలు దేవాంగనను గూర్చివిచారించుటను గూడ మఱపించుచున్నవి. కారాగారమునఁ జిక్కిన దేవాంగన విధమెట్లున్నది? మృణాళినికి నేమమే

కదా" యనెను. కందనుఁడు విక్రాంతుని మాటలకుఁ బ్రత్యుత్తరము నిచ్చుటకుఁ గొంతసేపు విచారించెను. తుదకు ధైర్యమువలంబించి, దేవాంగన మరణించిన విధం బెఱింగించెను. అర్ధాంగి మరణమాలించిన యంతనే విక్రాంతుఁడు "హా! దేవీ! దేవాంగనా!" యని మొదలునఱికిన కదళీతరువువలె నేలఁబడి మూర్ఛిల్లి కొంతసేపటికి లేచి, "పతిపదాంబుజ సేవయే మోక్షమార్గమని భావించి కష్టసుఖములు నాతో సమముగఁ బంచుకొనిన దేవాంగన, నాయరకాలు తడిగాకుండ నిరంతరము దనదేహపాటవము నాసేవకై ధారవోసిన దేవాంగన సౌశీల్యాదిసుగుణంబుల యందుఁ దోడిభామామణులకు శిరోమణి యనిపించుకొనిన దేవాంగన; తల్లిదండ్రులకిట్టి పుత్రిక; సోదరసోదరీమణుల కిట్టిసోదరి; భర్తకిట్టిసతి; బిడ్డలకిట్టితల్లి; సేవకులకిట్టిసేవ్యురాలు; నేస్తకత్తెల కిట్టినేస్తకత్తె లేదని జనవినుతిఁ గాంచిన దేవాంగన; తనరాజు నిమిత్తము నిజకుమారునిఁ గోలుపోయి, బందిగంబునఁబడి కష్టములకుఁ జలింపని యలివేణీజన చూళికాభరణయగు దేవాంగన; అక్కటా! నన్ను విడనాడి, పోయినదా" యనిపలువిధంబుల విలపించుచు, గందనునిఁ జూచి "కందనా! ఆవీరనారీమణి మరణసమయంబున నీవు దగ్గఱనుండుటచే నెంతయు ధన్యుఁడవు. ఆసమయంబున నామె నన్నెంతగాఁ దలంచినదో కదా! ఆమె నాకేమయినఁ జెప్పుమనెనా" యని యడిగెను. కందనుఁడు దేవాఁ

గనా సందేశము నాతని కెఱింగించెను. ఆసందేశము వినిన యంతనే విక్రాంతుఁడు మదాలస నుద్దేశించి "క్షుద్రశీలా! మదాలసా! పావన చరిత్రయగు దేవాంగనఁ కన్నులునూడఁ బెఱికించుటకు నీచిత్తమెట్లు సమ్మతించినది ? నిజవల్లభుని, సోదరునిఁ జంపిన కఠినాత్మురాలవగు నీకుఁ బరులపై దయ కలుగునా ! ఇంతమందిని హింసించుచున్న నీకువినాశకాల మెప్పుడువచ్చునోకదా ! ఎన్నివిధముల నీవిక్రాంతుని చిత్తమునకు క్షోభఁ గలిగింపఁ దలంచితివో యన్నివిధములఁ గలిగించుచుంటివి. నీవెన్ని హింసల నొనర్చినను గళింగరాజ్య పీఠమున నారాజును కాదని నీవు ఈవిక్రాంతుని కంఠమునఁ బ్రాణములున్నంతవరకు నధిష్ఠింపఁ జాలవు." అనిపలికి మరల దేవాంగనం దలంచి యిట్లనెను. "దేవీ! దేవాంగనా! మరణ సమయమునందుగూడ నీవు కళింగ రాజ్యోద్ధారణమును గూర్చి మఱవలేదుకదా ! నీయమూల్యమైన రాజభక్తిని నేనేమని శ్లాఘింతును! నారాజును, చంద్రశేఖరునిఁ గళింగరాజ్య సింహాసనమున నాసీనుఁజేసి, నీసందేశము ననుసరించి నీయాత్మకుశాంతిఁ గూర్చెదఁగాక ! ప్రభాకరసుధాకరులు సాక్షిగ నందులకై యవసర మయ్యెనేని నాప్రాణములనైన విడిచెద. రాజద్రోహులై మదాలసం జేరిన యాదుర్జయవీరపాలురు శీఘ్రకాలములోనె నాకర వాలమునకు బలియగుదురుగాక! నీనిర్మల యశోలతలు-

భూమినుండి త్రివిష్టపంబునకుఁ(బాకి - యావల సప్తర్షిమండలం బును దాటి ధ్రువమండలంబున కెగఁ(బాకుఁగాత ! శ్రీమన్నా రాయణుఁడు నిన్ను మహోన్నత పదవియందుంచుఁగాత" !

వికాంతుఁడు కందనునిచే నూరడింపఁబడి తన యను చరులఁ జూచి "నేనిట్టి సమయమున దుఃఖితప్పుఁడనైతినేని కార్యభంగమగును. ఇదిగో! నాదుఃఖమునంతయు మరచిపోవు చున్నాను. చిత్తమున ధైర్యముఁజేర్చినాను. ఇఁకమనమాల సింపక మదాలసా గర్వోద్రేకంబును, దుష్టకృత్యములను వారింపవలయును. కళింగరాజ్య పీఠమునఁ జంద్రశేఖరుని నాసీనుం జేయవలయును. ఇందుల కవసరమయ్యెనేని మీరంద ఱును యుద్ధమునకుఁ గూడ సంసిద్ధులై యుండవలయును. తన రాజుకొఱకు, ధర్మసంరక్షణముకొఱకు, నవసరమైనచోఁ బ్రతి వీరుఁడును యుద్ధరంగమును బ్రవేశింప వలసినదే. వీరులకు యుద్ధము తెఱచిన స్వర్గద్వారము. వారికి రణభూమియే క్రీడా ప్రదేశము. మన పూర్వులీ ధర్మము ననుసరించియే యుద్ధ ములఁజేసి యశమార్జించిరి".

వికాంతుని మాటలు విని యాతని యనుచర యోధులు "వికాంతా! నీవుమమ్ముగూర్చి యెట్టి సంశయ మును బొందనవసరములేదు. రాజునిమిత్త మనేకకష్టములఁ బొందుచున్న నీవుమా సేవ నీయిచ్చవచ్చినయట్లు గైకొనుము. మేము స్వాభిమానమును నిలుపుకొందుము. మాతృదేశము

నుద్ధరించుకొందుము." అని వచించిరి. వారిమాటలు విని విశ్రాంతుఁడు కంసనునకు వారిఁజూపుచుఁ "నందనా! వీరంద ఱును నాయెడల నభిమానముఁబూని కళింగరాజ్యోద్ధరణ మునకై నాకు సహాయమొనరింపఁ దలంచివచ్చిన వీరాగ్రేస రులు, ఇప్పటికే పదిమంది యోధు లిచ్చుటకుఁ జేరినారు. ఇఁక నొకపక్షము దినములలోఁ దక్కినవారు రాఁగలరు. వారు వచ్చినవెంటనే నేను కళింగ నగరమునకు వచ్చెదను. ఏది యెట్లున్నను నేను సైన్య సహితుఁడనై వచ్చుట మంచిది. మన శ్రమలింక శీఘ్రకాలములోనే యంతరింపఁగలవు. స్వామి భక్తి పరాయణుఁడవగు నీవు నానిమిత్త మనేక కష్టంబులఁ బడుచుంటివి కదా! ఆకనిపించు పటకుటీరముల యందే మన యోధులందఱు నున్నారు. వారింగూడఁ జూతువుగాక"యని పలికి, యాతనిని వెంటఁబెట్టుకొని, యంతకుముందుఁ దనతో మాటలాడుచున్న యనుచరులతో నా ప్రదేశమును విడిచెను.

పదమూఁడవ ప్రకరణము.

చంద్రశేఖరునిఁ దీసికొనిపోయి మదాలస వశముఁ జేసితినేని యామెనన్ను సంతోషముఁ బట్టజాలక "నీవే నా నిజమైన మనోహరుఁడవు," అని పలుకుచుఁ గౌఁగలించు కొనును. నిశ్చయముగా నాయందు మోహముండుట చేతనే

నన్నిట్టి కార్యమునందు నియోగించినది! నేను చంద్రశేఖరునిఁ దోడ్కొని పోవుటతో - మదాలస ప్రదర్శించుచున్న చిత్రనాటక ప్రదర్శనము పూర్తియగును. కళింగ రాజ్యమున కాకాంత పట్టాభిషిక్తురాలగును. నే నామె మనోరాజ్యము నకుఁ బట్టాభిషిక్తుఁడ నగుదును. నామమునకు మాత్రమా మె రాణియై యున్నను, రాజ్యపరిపాలనా భారమంతయు నాపైననే యుండును. ఇట్లు కొన్నాళ్ళు గడచిన తరువాత, నేనే రాజునగుదును. ఆ మదాలస నన్నుఁ బరిణయమాడుటకే సమ్మతించు చున్నప్పుడు రాజుగాఁ జేయుటకు మాత్రమేల యంగీకరింపదు! కాని, ఒక్కసంశయము మాత్రము నాకుఁ గలుగుచున్నది. మదాలసను నేను వివాహమాడుటకు సరోజని సమ్మతించునా! ఈకారణమున నేను కళింగరాజ్యమున కేలికనగుదు నని చెప్పినచో నేల సమ్మతింపకయుండును! సమ్మతింపదా! పోనిమ్ము. ఆకాంత సమ్మతింపలేదని నేను మదాలసను పెండ్లియాడుటను మానుదునా! ఏమైనను మానను. ఇఁక మదాలస నాయర్ధాంగి. కళింగరాజ్యము నాయది. మదాలస చిత్తమును నాచిత్తమును నేకమైనచో మమ్మెవ్వరేమి సేయగలరు," అని - మనంబున ననేక విధములఁ దలంచుచు - దుర్జయుఁడు - విజయసేన సహితముగాఁ గూర్మదుర్గ ద్వారమును సమీపించి, లోపలికిఁ బోవుచుండెను. ద్వార రక్షక భటులు దుర్జయునిఁ జూచి నీవు దుర్గమును బ్రవేశింప

వీలులేదు," అనిపలికి యాతని ప్రవేశమున కభ్యంతరము గలుగజేసిరి. "దుర్గాధీశ్వరుఁడవైన నీప్రవేశమునకే భటులు సమ్మతించుట లేదు. ఇఁక నీవు రాజకుమారు నెట్లు తీసికొని వచ్చెదవు ?" అని విజయసేనుఁడు దుర్జయునితోఁ బరిహాసముగాఁ బలికెను. దుర్జయుఁడు భటులఁజూచి "మీవాక్యము నాకుఁ గడు వింతగనున్నది. దుర్గాధీశ్వరుఁడనైన నేనిందుఁ బ్రవేశింపరాదా! తారతమ్యమరయక యిట్లు పలికిన మిమ్ముఁ గృపవహించి సైరించితి" ననెను.

భటులు—అయ్యా! తారతమ్యము మేమాలోచింపక పోవ లేదు. నీవు దుర్గాధీశ్వరుఁడవని మాకుఁదెలియును. తెలిసియే మేమిట్లు చేయుచుంటిమి. నిన్ను దుర్గములోఁ బ్రవేశింప నీయవలదని సరోజనీదేవి గారాజ్ఞాపించియున్నారు. మేమా మెయాజ్ఞ ననుసరించి వర్తించువారముగా నెఱుంగుము.

దుర్జ—సరోజని నన్నుఁగూడఁ బ్రవేశింప నీయవలదని యాజ్ఞ నిచ్చెనా! పొరపాటున నిట్లు పలికితి రేమో యాలోచించుకొనుఁడు.

భటు—ఇందులోఁ బొరబాటేమియు లేదు.

దుర్జ—నన్ను వారించుటకు సరోజని యెవ్వరు?

భటు—ఎవ్వరో మేము చెప్పవలయునా! ఈదుర్గమున నీవడుగుఁ బెట్టి యెన్నాళ్ళయినది. దుర్గపాలకులు తన దుర్గమును

విడిచి యిన్నాళ్ళు పరస్థలంబుల యందు నీవలె నెవ్వరైన నుందురా!

దుర్జ—నీవు నన్ను ధిఃకరించి పలుకుచుంటిరిగా!

భటు—అయ్యా!మాకిది యంతయు నేల? నీరాక నాదేవి కెఱింగించెదము. తరువాత నామెచిత్తము.

ఒక భటుడరిగి సరోజనికి దుర్జయుని రాక నెఱింగించెను. అప్పుడామె దుర్గద్వారము నొద్దకు వచ్చి నిలిచి యుండెను. దుర్జయుఁడు సరోజనింగాంచి "ఈ భటులు నన్ను లోపలికి రానీయకున్నారు. ఇందులకుఁ గారణమే" మని పలికెను.

సరోజని—నేనే యట్లాజ్ఞనిచ్చితిని.

దుర్జ—కారణమేమి?

సరో—నీవు దుర్గమును బ్రవేశించుట కనర్హుండవు. ఇన్నాళ్ళ కియ్యది స్వస్థానమని జ్ఞాపకమునకు వచ్చినదా? దుర్గ మేమయ్యెనో, భార్యయెట్లుండెనో యనుసంగతి నీవే మయిన యోచించితివా? పొమ్ము. నీవాకళింగనగరంబున దుష్టచిత్తయగు మదాలసనే యాశ్రయింపుము.

దుర్జ—ఇందులకా నీకాగ్రహము ! అచ్చట నేనుండుటవలన మనకెంత లాభముండునో నీవాలోచించితివా !

సరో—అట్లయిన నాలాభమును విడిచి యిచ్చటికేల వచ్చితివి ?

దుర్జ—నీయొద్దనున్న చంద్రశేఖరుని దోడ్కొని పోవ
పరో—సరే! కారణమిప్పుడు తెలిసినది. నాచే రక్షింప
చున్న చంద్రశేఖరుని దేటిచూచుటకు నీకును
లసకే గాక పురహరునకైనను శక్యముగాదు.
కాంక్షను—సోదరుని, భర్తను జంపి, దేవాంగనాకుమ
గూర్చినేడు కళింగ రాజవంశ భూజమును పెల్ల
వేయుటకై యీకుమారునిఁగూడఁ జంపుటకు
దోడ్కొని రమ్మని పంపించినదా? పాపాత్మురా
నామె నిన్నుఁ బంపినఁ బల్లపుఁగాక! యుక్తాయుక్తవిచా
శూన్యుఁడవై నీవెట్లు వచ్చితివి? ఇట్టి దుష్కార్యము
ర్చుట మహాపాపంబని నీయంతరాత్మ నీకు బోధి
పేదా! కుటిలాత్మయగు నామదోలసకు నీవేమని
మైతివి? విక్రమాదిత్యునకు విశ్వాసపాత్రుఁడవై దుర
రుడుగ నున్న నీవు నేడాతనిపైనున్న భక్తినంతయు
స్రవంతియందుఁ గలిపి, విజ్ఞానమ్మంతేయు మంటిప
చదివిన చదువంతయు మాయముఁజేసి విశ్వాసఘా
డవై, రాజద్రోహివై యామెంజేరి దుష్ట కృత్యము
ర్చుచు బాప మొడిగట్టికొంటివా! నీ పాపకార్య
నేను సమ్మతింతునని తలంచితివా? అట్లెన్నటికినిఁ
వలదు. నామెచిత్త మెప్పుడును సత్య ధర్మ పథ
యందే వర్తించును.

దుర్గ—సరోజనీ! నీవెన్నఁడును నాతో నీవిధమున మాట్లాడి యుండలేదు. నేడతి సాహసము బూనిన విధము గనిపించుచున్నది. నీవెఱ్ఱిమాటలను గట్టిపెట్టి నామాటలను వినుము. చంద్రశేఖరుని నావెంట బంపుము. దీనివలన నీవుగూడ నెట్టిమహోన్నతపదవికివత్తువో యోచింపుము.

సరో—చంద్రశేఖరుని మాట నెత్తకుము. ఆతనిని నీవెంటఁ బంపినచో మదాలసా కటాక్షము వలన నాకు గొప్పపదవి లభించునని యాశఁ గల్పించుచుంటివా? అట్టియాశకు నీవంటి దుష్టులు లోబడవలయును గాని నావంటి వారెవ్వరును లోబడరు. గొప్పపదవియే కాదు. ఇంద్రపదవి కన్న నెక్కుడు పదవి లభించినను నాచిత్తము పాపకార్యములందుఁ బ్రవేశింపదు. ధర్మముకొఱకు, సత్యముకొఱకు, కళింగ రాజ్యోద్ధారణము కొఱకు, చంద్రశేఖరుని నేను రక్షించుచున్నాను. ఇందులకు వ్యతిరేకులై యున్నవారు శీఘ్రకాలములోనే నాశనమగుదురని తలంపుము.

దుర్గ—భర్తనగు నాయెడల నిట్లవిధేయతఁ బూని హద్దుమీఱి మాటలాడుచుంటివిగా! ఇంతకును జంద్రశేఖరుని నావెంటఁ బంపెదవా లేదా?

సరో—నీవునాకు భర్తవైనను నధర్మపథానువర్తి వగుట చేతను, బాపరతుఁడ వగుటచేతను నేనింత తీవ్రముగ మాటలాడవలసివచ్చినది. దుష్టకార్యాచరణమును జిత్త

మును బ్రవేశపెట్టి ప్రవర్తించుచున్న నిన్నుఁజూచిన నాకుఁ బాపంబొదవును. ఏనాడునీవు రాజభక్తిని విడిచి ద్రోహివై మదాలసకు దాసుఁడవైతివో యానాడే నీకును నాకును ఋణము తీరినది. ఇంతకుమున్ను నాకు నీయందున్న భక్తిని నాహృదయమునుండి తొలఁగించివేసితిని. ప్రేమ నావలకుఁ బాఱదోలితిని. విధేయతను దూరముజేసితిని. సత్య ధర్మ సంరక్షణార్థము నాచిత్తమును కఠినపాషాణ తుల్యముగ నొనర్చితిని. నాకంఠమునఁ బ్రాణము లున్నంతవఱకుఁ జంద్రశేఖరుని స్పృశించుటకైననెవ్వరును శక్తులుగారు. వీరక్షత్రియకులప్రసూతనగు నేను - చంద్ర శేఖరుని నిమిత్త మవసరమయ్యేనేని ఖడ్గముఁగూడఁ గేలధరించెదను. ఆతనికిఁబ్రతికూలురగువారి శిరంబులతో గందుకక్రీడ సల్పెదను.

ఇఁక దుర్జయుఁడేమి చేయఁగలఁడు ? బలవంతముగ దుర్గములోఁ బ్రవేశింపలేఁడు. ఇట్టిది సంభవించునని తలంచి, సర్గోజని ముందుగనే తగినకట్టుదిట్టముఁ జేసియుండెను. విజయ సేనుఁడు దుర్జయునిఁజూచి రహస్యముగా "దుర్జయా! ఇక్కడ నీయాటసాగదు. నీవేమో మదాలసతోఁ జంద్రశేఖరునిఁ దోడ్కొని వచ్చెదనని చెప్పితివికాని ప్రయోజనములేదు. అదియుంగాక, మనము త్వరగా నావలకుఁ బడకుంటిమేని ప్రాణములు గూడఁ దక్కవు," అనిపలికెను.

దుర్జయుఁడు సరోజనింగాంచి "తక్కిన విషయము లెట్లు న్నను నేను దుర్గములోనికి వచ్చుట కభ్యంతరమేమియున్నది?" యని పలుక, సరోజని "నేను చెప్పవలసిన విషయంబు లన్నియు నింతకుమున్నే చెప్పియుంటిని. నీవేమియు నన్నడుగ నవసరములేదు. ఈదుర్గముతోఁ గాని, నాతోఁగాని నీకేమియు సంబంధము లేదు. నీతో సంబంధలతను నేను తెగ్గించివేసినాను. కళంకచిత్తుఁడవు, దుశ్శీలుఁడవు, స్వామిద్రోహివి, నీ వుండిన నేమి? లేకున్న నేమి? శీఘ్రముగా నిచ్చోటు వాసిపొమ్ము," అని తీవ్రముగ వచించెను. తన ప్రయత్నము సాగలేదని విచారమును, భార్యచే నట్టియవమానమును బొందుట విజయ సేనుఁడు చూచెనని సిగ్గును బొందినవాడై క్రోధము నటించుచు సరోజనిని వీక్షించి "నన్నే యిట్లానర్పితివిగా! కానిమ్ము. నాదుర్గములో నేనెట్లు ప్రవేశింపఁజాలనో చూచెదగాక" యని పలికి విజయసేనునితో వెడలిపోయెను.

పదునాల్గవ ప్రకరణము.

"దుర్జయుఁడు కూర్మదుర్గము నుండి వచ్చెనని విని యుంటిని; చంద్రశేఖరునిఁ దోడ్కొనివచ్చియే యుండును. ఎందులకోగాని నాకడకు వచ్చుట కాతఁ డాలస్యము సేయు

చున్నాఁడు," అని తలంచి దుర్జయుని తక్షణము తోడ్కొని రమ్మని మదాలస సేవకున కాజ్ఞాపించెను.

సేవకుఁ డరిగి మదాలస యాజ్ఞఁ దెలిపిన యంతనే దుర్జయునకుఁ జిత్తములో నదియొక విధమైన భయమొదవెను. "నేనిప్పుడేమి సేయుదును? చంద్రశేఖరునిఁ దోడ్కొని వచ్చితివా యని యడుగు మదాలస కేమని చెప్పుదును ? ఆతనిని దోడ్కొని వత్తునని ప్రగల్భములు బలికి యుంటిని. సరోజనిచే నావిధంబునఁ బరాభవమంది వచ్చితినని పలికినచో నేమనునో! ఏమని యాగ్రహించునో ? ఈ కార్యము నేను చేయలేక పోయితినని తన మోహమునకు స్వస్తిఁ జెప్పునేమో? " యని మనంబునఁ దలంచుచు నాతఁడు తడబడు నడుగులతో మదాలస కడకు వచ్చెను. మదాలస యాతనిం గాంచి "దుర్జయా ! కూర్మదుర్గము నుండి నిన్న సంధ్యాసమయముననే వచ్చితివని వినియుంటిని. వెంటనే నాయొద్దకు రాక తడవుజేసితివేమి ? చంద్రశేఖరునిఁ దోడ్కొని వచ్చితివా ? ఆతని నెచ్చట దాచితివి?" యని యడిగెను. దుర్జయుఁ డంతల కేమని ప్రత్యుత్తర మిచ్చుటకును దోచక కొంతసేపటివఱకును మాట్లాడక నిలిచియుండెను.

ఆతఁడు నిరుత్తరుడై యుండుటవలన మదాలస యనుమానమంది "దుర్జయా! మాట్లాడవేమి? కార్యమును సాధించుటకు నీవు సమర్థుఁడవు గాకపోయితివా ! లేక చంద్రశేఖరుఁడు

సరోజిని యొద్ద లేడా?" యని యడిగెను. "నేను దాచి
నను విజయసేనుఁడు చెప్పకమానఁడు. ఏమయినను జెప్పక
తప్పదు," అనితలంచి దుర్జయుఁడు తనకు సరోజిని వలన
జరిగిన పరాభవ మంతయు నెఱింగించెను.

దుర్జయుని మాటలు వినినయంత నేమదాలస కాగ్రహం
బొదవెను. ఆమె యాతనిని విలోకించి యిట్లు పలికెను:
"చంద్రశేఖరుని నవలీలగ దోడ్కొనివత్తునని ప్రగల్భములు
పలికితివే! నీవేమో కార్యశూరుఁడవని నామనస్సంతయు
నీకుఁ బ్రకటించితిని. ఒకస్త్రీ- అందులో భార్యాసంరక్షణంబున
నున్న చంద్రశేఖరునిఁ దోడ్కొని రాఁజాలకపోయితివే!
ఇట్టివా డవసరము వచ్చినచో రణరంగమున నెట్లు నిలువఁ
గలవు? నీవిట్టి యధీరుఁడవని నేను గ్రహింపలేక పోయితిని.
నీకంటె వీరపాలుఁడే నియోగించిన కార్యములఁ దీర్చుట
యందు దక్షుఁడు. ఈకార్యమునందు నే నాతనినైన నియో
గింపక నిన్నుఁబంపి బేలనైతిని. భార్యకు లోబడియుండువాడ
వని, భార్యకడ స్వాతంత్ర్యము లేనివాఁడవని, భార్యకు భీతిల్లు
వాఁడనని, యెఱుంగఁ జాలనైతిని. నీవంటి పిఱికిపందలను
నమ్మికొని యేకార్యమునందునుఁ బ్రవేశింపఁగూడదు."

దుర్జయుఁడామె కోపపూరిత వాక్యములు విని "మదా
లసా! నీ వాగ్రహించిన నేను నిలువఁగలనా! నేను నీకటాక్ష
మునకుఁ బాత్రుఁడను. దాసుఁడను. నీదూషణములన్నియు

వాకుభూషణములే. "దాసుని తప్పుదండముతోసరి" యన్నట్లు- ఇదిగో- నీచరణములకు మ్రొక్కుచున్నాను. క్షమింపు" మని యామెపాదములమీఁద వ్రాలెను. "ఛీ! నీముఖముఁ జూచిన పాతకముగూడ నొదవును. ఆవలకుఁ బొ" మ్మని యామదాలస యాతనిని దన్నెను.

దూషణ భూషణ తిరస్కారములు మనదుర్జయునకు సమములే. మదాలస తన్నిన తన్నున కతఁడు లక్ష్యముసేయ లేదు. ఆమెపాదమాతని శరీరమునకుఁ దగులుట మహానంద ముగ భావించి "మదాలసా! నీచరణ తాడనంబున నేను నా జన్మము ధన్యత వహించినది. కాని, నీమృదుచరణ కమల ములు నాశరీరమునకుఁ దగులుటచే మిగులనొచ్చి యరుణ కాంతి వహించినవి. పాపము ! బాధతీరునట్లు పాదము లొత్తనా?" యని మరల నామెపాదములఁబట్టుటకు సమీపించి యామెచే వారింపఁబడి మరల నామెంగాంచి "కూర్మదుర్గము నకు నేను సరియైన ప్రయత్నముతోఁ బోవలేదు. అందుచేతఁ గార్యము సాధించలేక పోయితిని. ఈసారి తగిన పరివారముతో బోయి, నీయాజ్ఞయైనచో భర్తనని యించుకంతయుఁ దలఁప కుండఁ బెక్కువిధంబుల నిందించిన యాగర్వాంధకార ప్రమత్త హృదయయగు సరోజనిని; దుర్గములో నడుగుబెట్టకుండ నన్నువారించిన సరోజనిని; పతియాజ్ఞకు వ్యతిరేకముగాఁ

బ్రిపిర్తించిన యూసకోజనిని, వేయేల! చంద్రశేఖర సహిత ముగాం గాలుని పోంలికంపి వచ్చి, నీ కరుణకుం బాత్రుండ నయ్యెద' నని పలికి యరిగెను.

పదునైదవ ప్రకరణము.

పక్షులాహారమునకై గూండ్లను వదలి పోవుచుండెను. గోపాలకులు గోగణంబును మేతకై గొనిపోవుచుండిరి. ప్రాతః కాల వాతూలములు చేతఃప్రీతిగ వీచుచుండెను. అట్టి సమయ మున విక్రాంతుండు కళింగనగర ప్రాంతమున నున్న మృణా ళినీ మహోద్యాన వనంబును బ్రవేశించి, తన్మధ్యమున నపూర్వ శిల్పరచనా నైపుణ్యమును బ్రకటించుచు నిర్మింపంబడి యున్న తులసికోటను వీక్షించి "ఈవనమధ్యమున మున్ను నేను దీనిని గాంచియుండలేదు. ఇయ్యదినూతనముగనిర్మింపంబడినట్లు తోచుచున్నది" యని తలంచి దానింజూచుటకు సమీపించెను. ఆ తులసికోట ప్రక్కనే జీవకళతో నొప్పారు దేవాంగనా విగ్రహంబొకటి యుండెను. దానింగాంచిన యంతనే విక్రాం తుండు - "హా! దేవాంగనా! కళింగ రాజ్యోద్ధారణ భార మంతయు నాపైన విడిచి యద్వితీయ మైన రాజభక్తిం బ్రక టించి, నన్ను విడనాడి పోయితివికదా! మరణసమయంబున

నీవు కందనునకుఁ దెలిపిన సందేశము నాహృదయఫలకమున లిఖించుకొని యుండి, తన్నిమిత్తమే మిగుల కష్టంబు లందుచు నిన్నాళ్ళకుఁ గళింగసీమయం దడుగుఁబెట్టితిని. నీ ప్రాణ ప్రయాణ సమయమున నిన్నాదరించిన మృణాళినియు గంధనునును కృతార్థులుగాని నేను నిర్భాగ్యుఁడనే," యని యనేక విధంబుల శోకించుచు, నవ్వనమ్మున "నాతులసికోట నెవ్వరు నిర్మించిరి? దేవాంగనా విగ్రహము దానిప్రక్క నిలిపియుండుట కేమికారణ"మని తలంచుచు నచ్చటనే యాసీనుడై యుండెను.

అంతఁ గొంతసేపటి కచ్చోటికి మృణాళిని పూజా ద్రవ్యంబులతో నరుదెంచెను. విక్రాంతుఁ డామెం జూచియుఁ దన్నెఱింగింపకుండ నామె వలన నాసంగతి నెఱుంగఁదలఁచి మాటలాడక యుండెను. విక్రాంతుఁడు కళింగనగరమును విడిచి యనేకదినంబు లగుట గేవలమొక సన్యాసివలె నుండుటజేతను, మృణాళిని యాతని నానవాలు బట్టఁజాలక పోయెను. కాని యాతడెవ్వరో యరయదలఁచి పూజా ద్రవ్యంబులను దేవాంగనా విగ్రహము ముందుఁబెట్టి విక్రాంతు నవలోకించి "నీ వెవ్వరో యొక యతీశ్వరుని వలె నాకుఁ దోఁచుచున్నావు. ఇచ్చట నాసీనుఁడవై యుంటివేమి? అది యుంగాక నీముఖము విచారభావమును సూచించుచున్నది. నీవెవ్వరవో, యీసేవకురాలెఱుంగఁ దగునేని యెఱింగింప గోరెదను," అనిపలికెను. విక్రాంతుఁడు "తలోదరీ! నేను

కేవలము సన్యాసినిగాక, సంసారినిగాక, సర్వసౌఖ్యభోగంబుల వర్జించి, నారాజు నిమిత్తము పుత్రకళత్రంబులఁ గోలుపోయి, కార్యదీక్షంబూని నానాస్థలంబుల సంచరించుచున్న యొక నిర్భాగ్యుఁడ" నని యామెకుఁ బ్రత్యుత్తర మిచ్చెను. అట్లు పలికిన యంతనే యాతఁడు విక్రాంతుఁడని తెలిసికొని మృణాళిని "విక్రాంతా! నిన్నెఱుంగఁజాలకపోయినందులకు నన్ను క్షమింపు"మని పలుకుచు నిట్లనెను: "ధీరపురుషా! రాజ సేవాపరాయణా! ఎన్నాళ్ళకు నిన్నుఁ జూడఁగలిగితిని. అగ్ని హోత్రుని సాక్షిగ నిన్నుఁ గైకొన్న దేవాంగన; నాయందతి గౌరవంబును, బ్రేమయు బూనియుండిన దేవాంగన, దేవతా స్వరూపిణియగు దేవాంగన; మనల నెడబాసిపోయినదికదా! ఆవీరపతివ్రతాశిరోమణి దహనక్రియలు జరుపుమని విరించి నన్ను విధించినాడు."

విక్రాంతుఁడును, మృణాళినియు దేవాంగనా గుణ గణంబును దలంచి కొంతసేపు విచారించిరి. విక్రాంతుఁడ మృణాళిని వీక్షించి "పుణ్యవతీ! ఈవనమధ్యమున నీతులసికో యెందులకు నిర్మింపఁబడినది? ఈదేవాంగన విగ్రహమెట్లు వచ్చినది" యని యడిగెను. "మహానుభావా! దేవాంగన పరదేశమున్నందే దహనక్రియలు నిర్వర్తింపఁబడినవి. నాకామె యందున్న భక్తిచే నిచ్చటఁ దులసికోటను గట్టించి, యామె రూపమును దెలుపు నీవిగ్రహంబును బ్రతిష్ఠించితిని. నేనను

దినంబును బరమశ్రద్ధతో నీవిగ్రహంబునకుఁ బూజసేయు చుండు” నని మృణాళిని యాతనికి బదులు చెప్పెను. మృణాళినికి దేవాంగనపై నున్న యమూల్యభక్తికి విక్రాంతుఁ డంతరంగమున సంతోషించి యామె కిట్లనెను.

“మృణాళినీ! నీఋణమును నేనెన్ని జన్మములకైనను దీర్పఁజాలను. నీనిర్హేతుక జాయమాన కరుణను శ్లాఘించుటకు నాకుశక్తియందుఁ బదములు జాలవు. మహావిపదాబ్ధియందు మునింగియున్న సమయమున నీవునాకవై మమ్ముద్దరింపఁజేసితివి. ఇంతవఱకును రాజకుమారుఁడగు చంద్రశేఖరుఁడు సురక్షితుఁడై యుండుటకు నీదాక్షిణ్యవిశేషమే యని చెప్పవలయును. కపట సన్యాసివేషమున నన్నుఁ గారాగృహ విముక్తునిగాఁ జేసి రక్షించితివి. ఇఁక దేవాంగనా విషయంబును గూర్చి నేను పలుకనేల? ఇన్ని మహోపకారంబు లొనర్చిన నీకు నేనేమి చేయగలను? ప్రేమపూర్వకముగ నొసంగు నాకనకాంగుళీయమును గ్రహించి నన్నుఁ గృతార్థునిఁ జేయుము.”

ఇట్లు పలికి విక్రాంతుఁడు తన వ్రేలినున్న కనకాంగుళీయమును దీసి మృణాళిని కొసంగెను. మృణాళిని “మహాభాగా! నేను నీకరుణకుఁ బాత్రురాలనేగాని వినుతికిఁగా” దని పలికి యాతఁ డొసంగిన యుంగరంబును దనవ్రేలికిఁ బెట్టుకొనెను. అనంతరము విక్రాంతుఁడు “మృణాళినీ! కూర్మదుర్గమును నేను విడిచి యనేక కష్టములందుచు బెక్కుస్థలములఁ

దిరిగి మెట్లో నాకు సహాయముఁ జేయుటకుఁ గొందఱు యోధులఁ జేర్చుకొనఁ గలిగితిని. వారిలోఁ గొందఱను గందనుఁడు గూడ వీక్షించి యున్నాఁడు. నేనిప్పుడు కొందఱు యోధులతో మాత్రమే వచ్చి యిచ్చటికి నాలుగుక్రోసుల దూరములో విడిసియున్నాను. తక్కినయోధులు గూడ నన్న చ్చటికి వచ్చి కలసికొనెదరు. వారుగూడ వచ్చిన తరువాత యోచించి చేయవలసినపనిఁ జేసెదను. ఇఁకమనకుఁ గష్టములు తొలగిపోవునని శుభనిమిత్తంబులు తోఁచుచున్నవి. గతించిన వారింగూర్చి చింతింపక, కళింగరాజ్య రత్నఖచిత సింహాసనం బునఁ జంద్రశేఖరుని నాసీనుంజేసి నేను ముదమందెదను - మాకష్టములయందు బాల్గొనిన నీవును నానందమందఁగలవు. ఇచ్చటివార్తలు రహస్యముగాఁ దెచ్చుచుండుటకుఁ గందనుఁ డున్నాఁడుకదా! ఇఁక నేఁ బోయివచ్చెద" నని పలికి యా ప్రదేశమును విడిచెను.

పదునాఱవ ప్రకరణము.

ఒకనాఁడు కళింగనగరమునకు నాలుగుక్రోసుల దూర ములోనున్న యరణ్యమునఁ బటకుటీరమునందు విశ్రాంతుఁడు తన యనుచర యోధవర్గముతో నేదియో యాలో

చించుచున్న సమయంబునఁ గందనుఁడాతనికడ కరుదెంచి "దేవా! నేడొక విచిత్రమైనవార్తఁ దెచ్చితి" ననెను.

విక్రాం—కందనా! అయ్యది అంతవిచిత్రమైనదా? అట్లయిన దానిని వినుటకు నాచిత్తము తొందరపడుచున్నది.

కంద—దుర్జయుఁడు - పరలోకసౌఖ్యములనందుట కేగినాడు.

విక్రాం—ఏమేమీ! దుర్జయుఁడుమరణించినాడా! సుశీలయగు సరోజనికి వైధవ్యదుఃఖ మొదవెనుగదా!

కంద—ఆమెయే యాతనిని జంపించినదఁట!

విక్రాం—కందనా! నీమాట కడువింతగనున్నది. దుర్జయుఁడు కళింగనగరంబున నున్నవాఁడు. సరోజని కూర్మదుర్గమున నున్నది. అట్టియెడల సరోజనియెట్లు దుర్జయునిఁజంపించినది?

కంద:—దుష్టచిత్తయగు మదాలసనుఁబ్రీతిఁ గూర్చుటకై దుర్జయుఁడు విజయసేనుఁడు మొదలయినవారిని వెంటఁబెట్టుకొని కూర్మదుర్గమునకరిగి చంద్రశేఖరుని, సరోజనినిఁ జంపుటకై యత్నింపఁగా సరోజని యాతనింబట్టి తెప్పించి యురిదీయించెను. ఈదారుణకృత్యమును సేయుట కాతనికిఁ దోడ్పడఁబోయిన యనుచరులలో మువ్వురామెచే బంధింపబడిరి. ఒక్కఁడు మాత్రమెట్లో ప్రాణములు దప్పించుకొని కళింగనగరమునకుఁ జేరెనఁట!

కందనుని మాటలువిని విక్రాంతుఁడు "కందనా! సరోజని యొనర్చిన కృత్యముతోఁ బోల్చిచూడఁగా, రాజకరమహా

కుని నిమిత్తము మనముపడుచున్న శ్రమలు శ్రమలుగావనియే తలంపవలయును. దుష్టకార్యాచరణమునందుఁ బ్రవేశించిన నిజభర్తను రాజకుమార సంరక్షణార్థము వధించిన సరోజని సాహసంబును, స్వార్థత్యాగమును, ధైర్యమును, ధర్మపథానువర్తనమును, సత్యవాక్యపరిపాలనంబును ప్రశంసార్హంబులు. మననిమిత్తమట్టి కార్యమొనర్చిన యామె యెంతయుఁ బూజ్యురాలు. రాజునకై యిట్టి సాహసకృత్యంబొనర్చిన యాసరోజని - వీరనారీమణులైన - వీరాబాయి, దుర్గావతి, లక్ష్మీబాయి మొదలగువారి కీర్తిని మట్టుపఱుపఁజాలినది" యని పలికెను.

ఇట్లువారు సంభాషించుచుండఁగా-దూరమునఁగొందఱు పురుషులొకశవమును దహనముఁ జేయుటకుఁ గొనిపోవుచున్నట్లు విక్రాంతునకుఁ గనబడ, నతండు కందనునకు దానిం జూపి "కందనా! అయ్యది నిశ్చయముగా శవమేయైనచో-దహనమునిమిత్త మింతదూరము తీసికొనిరావలసినపని యేమున్నది? ఈ ప్రాంతమున నెచ్చటను శ్మశానవాటిక లేదే!. వారేదైన ఘోరకృత్యమొనర్చి యాకళేబరమును నట్లుగొనిపోవుచుండిరేమోయని నాకనుమానముగనున్నది. కావునఁ జూతము రమ్ము" అనిపలికి-యనుచరులు కొందఱితో బయలుదేరెను. శవాకారముగఁ గట్టఁబడి-వాహకులచేఁ గొనిపోవఁబడుచున్న మృణాళిని వీరింగాంచి "ఓపుణ్యాత్ములారా! అబలనగు నన్ను

దహించుటకు వీరుఁగొనిపోవుచున్నారు. రక్షింపుమరక్షింపు" డని పెద్దపెట్టున నాక్రందనముఁ జేసెను. ఆయార్తారావము చెవిసోకిన యంతనే వికాంతుఁడు "అనుచరులారా! అది యేదియో ఘోరమే. ప్రాణరక్షణము గోరుచున్న దెవరో యబలవలెనున్నది. రండు. రండు" అనిపరువెత్తెను. వీరిరాకం జూచి, మృణాళినిం గొనిపోవుచున్న భటులామెనచ్చట డించి పరువెత్తసాగిరి. వికాంతుని యనుచరులు వారిని వెన్నంటిరి. వికాంతుఁడు-మృణాళినిని సమీపించెను. మృతకళేబరమువలె నామె కట్టఁబడి యుండెను. మృణాళిని వికాంతునిఁజూచి "వికాంతా! నాప్రాణరక్షణమునకుఁ బరమేశ్వరుఁడు నిన్నిక్కడకు, దీసికొనివచ్చినాఁడు కాఁబోలు. నీవీసమయంబున నిచ్చటికి రాకయుంటివేని నా జీవయాత్ర నేటితో ముగిసియుండెడిదే!" యని పలికెను. వికాంతుఁడు—"మృణాళినీ! నీకీయవస్థ యెట్లు సంభవించినది." యని పలుకుచు నామె బంధము లన్నియు విప్పి, మరల నట్టిస్థితి వచ్చుటకుఁ గారణ మేమని యడిగెను. వికాంతునిఁ గాంచినంతనే భయము వాసినదై యామృణాళిని యాతని కిట్లు చెప్పెను.

"వికాంతా! నిన్నటి యుదయంబున నేను వనంబు నుండి గృహంబునకేగు సమయంబున మదాలస పంపున నలువురు భటులువచ్చి నన్ను బంధించుకొని పోయి కారాగృహంబున బెట్టి, చీకటి పడిన పిదప మదాలస యొద్దకు

దోడ్కొని పోయిరి. ఆమె నన్నుఁజూచి "మృణాళినీ! నీకు సంబంధములేని కార్యములందు నీవు ప్రవేశించుచున్నావు. విక్రమాదిత్య తనూజుఁడైన చంద్రశేఖరుని-సరోజిని వశముఁ జేసినది నీవేయనియు, విక్రాంతుని పక్షమూని నావినాశనము నకుఁ బ్రయత్నించుచుంటివనియు నేను వినియుంటిని. ఆ విక్రాంతుని జాడలు నీకుఁ దెలియకుండ నుండవు. కావున నాతోఁ జెప్పుటనుండెనో యా రహస్యము నెఱింగింపుము. లేదేని నీకు మరణము నిశ్చయమని యెఱుంగు" మనిపలికెను. అందులకు నే నివ్విషయంబున నేమియు నెఱుంగనని బదులు జెప్పితిని. ఆమె నన్ననేక విధంబుల భయపెట్టెను. నేనావంతయుఁ జలింపక, విక్రాంతుని జాడ నాకుఁ దెలియదనిపలుక, నామె యాగ్రహంబంది నన్ను దహించివేయుఁడని భటుల కాజ్ఞాపించెను. ఆ కారణమున మదాలసా సేవకులచే నిచ్చటి కీవిధంబునఁ గొనిరాఁబడి, నీ వలన రక్షింపఁ బడితిని."

ఆపలుకులు విన్నంతనే విక్రాంతుఁడు మదాలస నుద్దేశించి "క్రూరాత్మురాలా! మదాలసా! ఎన్ని ఘోరకృత్యములఁ జేయుచుంటివి? నీ దుష్కృత్యముల కంతముండదనితలంచితివా! నీకు విక్రాంతుని జాడ కావలయునుగా! విక్రాంతుఁడు నీ పాలిటికిఁ గాలుఁడై సమీపముననే వచ్చియున్నాఁడు. ఇంత వఱకు నీతఁడు కాలమునకుఁ గట్టుబడి యిన్నియవస్థలఁ బొందుచు నిట్లుండెను, గాని మరి యొండుకాదు," అని పలి

మృణాళినింగాంచి "మృణాళినీ! నా నిమిత్తము నీవుగూడ నిట్టి కష్టములనుభవించు చుంటివికదా," యనెను.

విక్రాంతుని యనుచరులు మృణాళిని బంధించుకొని వచ్చినభటులను వెన్నంటి పట్టుకొని తీసుకొని వచ్చి విక్రాంతునిముందు బెట్టిరి. విక్రాంతుడు తన యనుచరులం జూచి "క్రూరహృదయయగు మదాలసా ప్రేరేపణంబున నిట్టి ఘోరకృత్యములఁ జేయుటకు సాహసించుచున్న యీ పాపాత్ముల శరీరములపైఁ జర్మ మొలిచినను పాపము సంభవింపదు. అయినను వీరినిఁగూర్చి తరువాత నాలోచింతము. ప్రస్తుతము వీరలఁ దీసికొనిపోయి చెక్కలు విరచి, మన కుటీరములకుఁ బ్రక్కనున్న వృక్షములకుఁ గట్టుఁ" డని చెప్పఁగా, నాతని యాజ్ఞననుసరించి వారు భటులను దోడ్కొనిపోయిరి. పిదప విక్రాంతుఁడు "మృణాళినీ! నీవిప్పుడు నగరంబునకుఁ బోవలదు. నాకుటీరమున నిర్భయముగా నుందువుగాక" రమ్మని పలికి, యామెను వెంటఁబెట్టుకొని పోయెను.

పదునేడవ ప్రకరణము.

"మహాభాగ్యవంతురాలయ్యును- మృణాళిని యింతవరకును నవివాహితగనుండుట కేమికారణము? ఈమెవివాహము జేసికొనఁదలంచి యున్నచో-నద్వితీయసౌందర్యవతియు, సకల

సద్గుణవతియునగు నీమెను జేకొనుట కెవ్వఁడంగీకరింపక యుం డును? ఈమె తలంపెట్టిదో నా కావంతయుఁ దెలియకయున్నది. ఇదియట్లుండ, నాపై నీమెకిట్టి యమూల్యకరుణఁ బరమేశ్వరుఁడు కలగించుట కేమికారణమో! నాజాడ నెఱింగింపుమని మదాలస యెంతభయపెట్టినను జలింపక, నానిమిత్తము తన ప్రాణములనయిన, బాయుటకు సమ్మతించిన యీ పద్మేందుముఖికి నా పైనున్న భక్తిప్రేమాదులు వర్ణనాతీతమై యున్నవి. నాకిట్టి మహోపకారములొనర్చుచున్న యీమెకు నేనెట్టి ప్రత్యుపకారము సేయగలుగుదునో తోచకయున్నది-" యని విక్రాంతుఁడు - పటకుటీరమునందొంటరిగఁ గూర్చుండి యాలోచించుచుండెను. అట్టి సమయమున మృణాళిని యాతనికడ కరుదెంచి "వీరపురుషా! నే డెవ్విషయంబుననో గూర్చి దీర్ఘాలోచనము సేయుచున్నట్లున్నావు? అది యెట్టిదో నేను వినఁదగుదునేని వినఁగోరెద" నని పలికెను.

విక్రాం—మహాపుణ్యవతివై నన్నుద్ధరించిన నీకెఱింగింపరాని రహస్యముండునా? నాదీర్ఘాలోచన నిన్నుఁ గూర్చియే.

మృణా—నన్నుఁగూర్చియేనా! నేనిచ్చటనుండుటవలన నీకేమయిన నపాయ మొదవునేమోయని తలంచుచుంటివా?

విక్రాం—నీవుండుటవలన నాకపాయ మొదవునా! అట్లెప్పటికిని దలంపవలదు.

మృణా——అట్లయిన నన్నుఁగూర్చిన యాలోచన యెట్టిది?

విక్రాం——నీవు నన్నన్యథా భావించుదానవుగావని నామనం బుననున్న సంశయమునేఁడు నీకెరింగింపఁ దలంచితిని. అందు లకు నీవుసరియైన ప్రత్యుత్తర మిచ్చెదవా?

మృణా——నావిషయంబున నీవేమియు సంశయింపఁబనిలేదు. నన్ను నీసేవకురాలిగ భావింపుము.

విక్రాం——సమస్తవిధ సంపదలతోఁ దులఁదూగుచున్నదానవు సౌందర్యఖనివి అట్టి నీవు పరిణయంబాడక - యీవిధం బుననుండుట కేమికారణము? ఈవిషయంబునుగూర్చి నేను నిన్నడుగఁదలంచియు, నీవేమని తలంతువో యనుసంశ యముచే నూరకుంటిని. నేఁడునాసందేహనివృత్తిజేయుదువా?

విక్రాంతుని ప్రశ్నకు మృణాళిని యేమని ప్రత్యుత్తర మిచ్చును? ఇంతవఱకును మృణాళిని తన్ను మనంబున వరించి యుండెనని విక్రాంతునకుఁ దెలియదు. ఆమెయు నివ్విష యంబును నాతని కెప్పుడును నెఱింగించి యుండలేదు - ఇప్పు డామె తనభావము నాతనికిఁ దెలియఁబఱచునా! తెలియఁబఱు చక యుండునా! తెలియఁబఱచక యున్నచో నాతనికిఁ దన కోరిక యెట్లు తెలియును? ఎప్పుడైనను నామెతన కోరిక యాత నికిఁ దెలుపవలయునుగదా! అందుచేత నాతఁ డడిగినప్పుడు తెలుపుటయే మంచిదని తలంచి యామె యాతని కిట్లు పలికెను:

“విక్రాంతా! చిరకాలమునుండి నామనంబున నడంగి
యున్నకోరిక నీవడుగుటచే బయలుపఱచుట కిప్పుడవకాశము
తటస్థించినది. వీరపురుషుఁడవును, సద్గుణగరిష్ఠుఁడవును, నగు
నీయందు నాహృదయము లగ్నమైయున్నది. నాభావము
దేవాంగనకును నీకును నెఱింగించి, నీయనుగ్రహము వడసి,
నీయండఁజేరి సౌఖ్యంబుల నందఁదలఁచియుండ, మత్పురాకృత
కర్మవశంబున నీకన్నియు నిక్కట్టులే సంభవించినవి. ఎప్పటి
కైనను ఈకష్టములు గట్టెక్కకపోవనియు, నాయభిలాష నీ
కెఱింగించు నవకాశము తటస్థింపక పోవదనియుఁ దలంచి
నీవిమల నామమును నాహృదయ కమలమున నిలిపి, నిరంతరము
జపించుచున్న నాకు మదాలస వలన మరణయోగము
గలిగినను, నీచేత రక్షింపఁబడితిని. ఇఁకఁ గరుణవహించి
నన్ను నీ చరణసేవకురాలిగఁ జేసికొని యేలుకొనుము.”

విక్రాంతుని చిత్తమిప్పుడు సౌఖ్యభోగంబులకు మిగుల
దూరమై యుండెను. కుమారుఁడగు వసంతుఁడును, భార్య
యగు దేవాంగనయు మరణించిన నాఁటనుండియు నాతని
చిత్తమును వైరాగ్యపథంబునఁ బెట్టి కేవలము యోగివలె
నుండెను. కళింగరాజ్యోద్ధారణ కార్యము తప్ప నాతని మనం
బున నితరచింత యేమియులేదు. దానిని సత్వరంబుగఁ జేసి,
దేవాంగనాయాత్మకు శాంతిఁ గూర్పవలయునని యాతఁడు దీక్ష
వహించి యుండెను. ఇప్పుడు మృణాళిని తన చిత్తమాతనిపైఁ

జిరకాలమునుండి లగ్నమై యున్నదని చెప్పెను. ఆతఁ డెప్పుడును మృణాళినియందుఁ జంచలభావముతో వర్తించి యుండలేదు. అట్టిచో మృణాళినినిఁ దారగా గ్రహించుట కాతనిచిత్త మెట్లు సమ్మతించును ? మృణాళినిమాటలకేమని ప్రత్యుత్తర మిచ్చుటకును దోచక దీర్ఘాలోచన సేయఁదొడంగెను. "నేనిట్లు పలికినయంతనే నీవు యోచించుచుంటివే" మని మృణాళిని యడిగెను.

తనపై మృణాళినికున్న మోహమును ద్రెంపివేయఁ దలఁచి విక్రాంతుఁ డామెంగాంచి నెమ్మదిగా నిట్లు పలికెను:

"ఓ తరుణీ శిరోమణీ నీవిట్టికోరికఁ బూనియున్న దానవని నేనింతకు మున్నెప్పుడును నెఱింగియుండలేదు. అవ్విషయ మటుండనిమ్ము. ఆలుబిడ్డలఁ గోలుపోయి, సర్వమును వర్జించి, శరీరమాత్ర విభవుఁడనై యున్న నాకు మరల వివాహమేల ? ఇందులకు నాడెంద మణుమాత్రమైన సమ్మతింపదు. నేనిట్లు పలికితినని నీవు మరియొక విధంబునఁ దలంపవలదు."

విక్రాంతుని వైరాగ్యవచనంబులు విన్నంతనే మృణాళిని మొగంబు విన్నబోయెను. "చిరకాలమునుండి యడంచుకొని యున్న నా యభిలాషఁ దెలుపఁగా నీతఁ డిట్లు వచించినాడు. ఇందులకు నేనేమి సేయుదును ! ఈతఁడు నన్ననుగ్రహింపనిచో

నేనాజన్మాంతము నిట్లుండవలసినదేనా!" యని తలంచి యామె యాతనింగాంచి "వికాంతా ! నీవు సమస్త ధర్మముల నెఱింగినవాఁడవు. తన చిత్తమంతయు నీ యధీనముఁజేసి, యెప్పుడు నీకష్టములు గట్టెక్కునా యని, వేయిదేవుళ్ళ కనిశంబు మ్రొక్కుచున్న, ఈ యబల కిట్లు వచించుట న్యాయమా ! నేను నీదాన నగుదునని నమ్మియుంటినే! నానమ్మకము వమ్ముజేసెదవా ! నీవు నాపైఁ గరుణవహింపవేని నాజీవితము వ్యర్థమేకదా ! సుగుణసముద్రా ! నీవు నాచిత్తమెట్టిదో యరయఁగోరి యిట్లు వచించుచుంటివేమో!నీవు నాచిత్తమును బరీక్షింపనవసరములేదు" అని పలికెను. అందులకు వికాంతుఁడిట్లు బదులుచెప్పెను:

"పర్వేందువదనా! నేను నీ చిత్తవృత్తిఁ బరీక్షించుట కిట్లు పలికిన వాఁడనుగాను. నీచిత్తమతి నిష్కళంకమైన దనియు, నాపైనీకున్నభక్తి వర్ణనాతీతమనియు నెఱుంగుదును. నానిమిత్తము నీవందిన శ్రమలకు నేనెంతయుఁ గృతజ్ఞుఁడను. నీయభిలాష ననుసరించి వర్తించుటకు నేనంగీకరింపఁజాలను. నీవు నాకుఁ గూతురువంటిదానవు. నాయందునీవు పితృవాత్సల్యముంచుము. ఇదియేనాకోరిక"

ఆమాటలువిని మృణాళినియేమియు బదులుజెప్పఁజాలకపోయెను. "ఆహా! ఈతనికిఁ బత్నినై యలరారవలయునని

తలంచిన నాతలంపునకు భంగమొదవెను. ఇఁక నేనీతనిని నిందు విషయమై బలవంతపఱచినను ప్రయోజనముండదు. పరమేశ్వరుఁడు నాయెడల నివ్విధంబున నున్నప్పుడెవ్వరేమి సేయఁగలరు!" అనితలంచుచు విచారచిత్తయై నచ్చటినుండివెడలి పోయెను.

పదునెనిమిదవ ప్రకరణము.

"అక్కటా! నాప్రయత్నములన్నియు విఫలములైనవి. ఎన్ని ఘోరకృత్యము లొనర్చినను దుదకుఁ గార్యముసాధించలేకపోయితిని. అగ్నిహోత్రునిసాక్షిగ నన్నుఁగైకొన్న భర్తను నేకగర్భసంజనితుండగుసోదరుని-రాజ్యాకాంక్షనువహించి చంపిన మహాపాపచిత్తను. నాపాపములకాపరమేశ్వరుఁడెట్టికఠినశిక్షల విధించునో! వసంతదేవాంగనా దుర్జయుల దుర్మరణంబులకు నేనేకదా కారణము. నా దురాగ్రహ మెన్నిహింసల జేయించి వది? సాధ్వీశిరోమణియగు దేవాంగనా వాక్యములు సత్యముగాక తప్పునా! జాజ్వల్యమానదావజ్వాల లశ్రమముగ హరింపవచ్చును. నానాజగజ్జాలమృత్యువుతోనైనఁ బెనంగవచ్చును, కఠిన సంజ్వర దుర్యకాకోలగుళికలు మ్రింగవచ్చును. యమదోఃప్రకాండదివ్యచ్చండదండంబునైన విరువవచ్చును. కాని పతివ్రతామణుల శాపవాక్యములఁ దప్పించుకొనుట కెవ్వరికిని

దరముకాదు. రాజకుమారుని నిమిత్తము తనకుమారుని మృతికి సమ్మతించి-తుదకుఁ దానుగూడఁ బ్రాణంబులు గోలుపోయిన దేవాంగనయు, నధర్మపథంబునఁ బ్రవేశించి, దుష్టకృత్యము జేయసాహసించిన నిజభర్తను జంపిన సరోజనియు, వికాంతుని జాడ నెరింగింపక మరణమునకు సంసిద్ధయైన మృణాళినియు లోకవంద్యులుగదా! మహాపాపకార్యము లాచరించి, నిందఁ బొంది, నేను జగంబున, దలయెత్తి చరింపకుండునట్టి దుర్గతి సంభవించినదికదా! వికాంతుఁడెచ్చటనో సైన్యమునుఁ జేర్చుకొనివచ్చి, యీనగరంబున కనతిదూరమునఁ బటకుటీరంబుల యందు విడసియున్నాఁడట. ఆతఁడు నేఁడో రేపో నగరంబులోనికి వచ్చి, మహాఘోరకార్యము లొనర్చిన నన్ను బంధింపక యుండునా! బంధించి ప్రాణములతో నిలువనిచ్చునా! నేనిప్పుడేమిసేయుదును!" అని మదాలస తన మనంబున దలపోయుచుండెను.

అప్పుడచ్చటికి వీరపాలుఁడువచ్చి మదాలసంగాంచి "ఆలోచించుచున్నావేమి? ఎవ్వరినైనఁ జంపవలయుననియో లేక యెవ్వరిచేతనైనఁ జంపింపవలయుననియో?" యని యడిగెను.

మదాలస—వీరపాలా! ఎప్పుడును నీవిట్లుపలికి యుండలేదు. నేడిట్లు పలుకుచుంటివేమి?

వీర—ఏమున్నది? నీయాలోచన లంతకంటె నెక్కుడుగ నుండవుకదా!

మదా—ఏమిచేసినను మనము కృతార్థులము గాఁజాలక యున్నాము.

వీర—ఇఁక నీవును నేనును ద్వరలోనే కృతార్థులమగుదుము.

మదా—ఎట్లు ?

వీర—స్వర్గమునకుఁబోయి.

మదా—అట్లు వచించితి వేమి?

వీర—ఇఁక మనకుగనిపించుచున్న త్రోవ యిదియొక్కటియే. నీ కపట మోహానురాగ శృంఖలా బద్ధుఁడనై ఘోరకృత్యముల నొనర్చిననాకును, హింసాకార్యములకుఁ బ్రేరేచిన నీకును విక్రాంతుని చేతిలో మరణము తప్పదు. ఆహా ! నీవునన్నును దుర్జయునిఁ బాత్రములుగా జేసికొని, కపట నాటకమును బ్రదర్శించితివి. మేము మూఢులమై - నీచేతిలోని కీలుబొమ్మలమైతిమి. నీప్రేరేపణమునఁజేయఁబోయిన దుష్టకృత్యమునకు ఫలముగా దుర్జయుఁడు-భార్యచేతిలోఁ జచ్చినాడు. నీవును నేనును మిగిలియున్నాము. నీవలన నేను సంపూర్తిగ వచింపఁబడితిని. బోనునుండి వెలువడిన సింగము కైవడి, విక్రాంతుఁడు తన ఖడ్గమునకు నిన్నును నన్నును నాహారముగా నీయక విడువఁడు. నీవు కళింగ రాజ్య సింహాసన మారోహించుట యబద్ధము గాని, ప్రేతరాజ్య సింహాసన మారోహించుట నిశ్చయము. నీవొనర్చిన దుష్టకృత్యములకుఁ బశ్చాత్తాపమంది క్షమింపు

మని యాభగవంతునిఁ బ్రార్థింపుము. ఇట్టి పాపచిత్తవగు నిన్ను క్షమింపుమని వేడినంతనే భగవంతుఁడు మాత్రము క్షమించునా! ఇక్కడికే నీమూలమున నేనంతములేని పాపములు జేసినాడను. ఇఁక నీతో మాటలాడినను-నాపాపము మఱింత హెచ్చును.

ఇట్లు పలికి యావీరపాలుఁ డామె మందిరమును విడిచి పోయెను. అంతకుముందే మదాలస చిత్తము కలఁతపడి యుండెను. వీరపాలునిమాటలతో నామెచిత్తమునఁగలఁత మఱింత యధికమయ్యెను. "నాకపటమోహ మీవీరపాలునకుఁ దెలిసి నన్నిట్లు నిందించినాడు. ఈతఁడిది బయలుపఱచునేమో యని గూఁడనామనంబున ననుమానము వొడముచున్నది. అక్కటా! నాజీవిత మనేకవిధంబులఁ గళంకమైనదికదా!" యని తలంచి, మరల కొంతసేపు దీర్ఘాలోచనముఁజేసి "రోటఁదలఁదూర్చి రోకటిపోటునకు వెఱవనేల? ఇన్ని హింసాకార్యముల నొనర్చిన నేనిప్పుడు వెనుదీయనేల? ఎట్లయినను నేను విక్రాంతుని శిబిరమునకుఁబోయి, మాటలతో నాతనిని వశపఱచుకొనఁ బ్రయత్నించెదను. అట్లుకాదేని, గుప్తఖడ్గముచే నాతనిని యమాలయంబునకుఁ బంపివేసెదను. ఇట్లుచేయఁ గలిగితినేని నాచిత్తమునకుఁ గొంత సంతృప్తి కలుగు"నని యామదాలస నిశ్చయించుకొనెను.

ఆహా! ఇన్ని ఘోరకార్యము లాచరించినను తుదకుఁ బశ్చాత్తాపమందక, యింకను విక్రాంతుని మాయోపాయమునఁ జంపఁదలఁచిన మదాలసా సాహసంబు నేమనఁగలము!

పందొమ్మిదవ ప్రకరణము.

“ఇంతవరకును జంద్రశేఖరునిఁ గూర్చి మదాలస చేసిన ప్రయత్నము లేమియు సాగలేదు. నేనిచ్చట సైన్యముతో విడిసియుంటినని యామెకుఁ దెలిసియే యుండును. ఇఁక నామె మాయోపాయంబులన్నియుఁ గట్టిఁబెట్టి, నాతోఁ బోరాడుట కెవ్వరినైనఁ బురికొల్పునా ? అట్టి ప్రయత్నము లేమియు లేవని గూఢచారుల వలన వినియుంటిని గదా ! ఒకవేళఁ బోరాటము సంభవించినను, నిందులకై సంశయింపనేల ? కృపాణంబుఁ గేలఁదాల్చి రణరంగమున నిలిచితినేని నన్ను మార్కొనఁ గలవాఁ డెవ్వఁడు ? చంద్రశేఖరునకు వ్యతిరేకులై యున్న వారి శీర్షంబులనెల్ల ఖండించి, తోరణంబుగఁగూర్చి, చంద్రశేఖరుని పట్టాభిషేక మహోత్సవ సమయంబునఁ గోట గుమ్మమునకు వ్రేలాడఁ గట్టెదగాక ! కూర్మదుర్గమునుండి సరోజిని చంద్రశేఖరునిఁ గూడ నిచ్చటికిఁ దీసికొని వచ్చియుండెను. ఇఁక నాలోచనలతో నేమిపనియున్నది? రెండు

మూడు రోజులలోనే సైన్యసహితముగా నేఁగి కోటలోఁ బ్రవేశించెదగాక ! ఇందులకెవ్వరు వారించెదరో చూచెద," నని విక్రాంతుఁడు తన మనంబునఁ దలంచుచున్న సమయంబున సేవకుఁ డొకఁడువచ్చి "దేవా ! మదాలస నిన్నుఁ జూచుటకు వచ్చి వాకిట నిలిచియున్న" దని పలికెను. ఆ మాట విన్నంతనే విక్రాంతున కాశ్చర్యము కలిగి "మదాలసయా నన్నుఁ జూడవచ్చినది ! లోపలికి రాని" మ్మని సేవకునకుఁ దెలిపెను.

మదాలస కుటీరములోఁ బ్రవేశించి, ముందు మాటలచే విక్రాంతునివశముఁ జేసికొనదలంచినదగుటచే నావిక్రాంతునిఁగాంచి "విక్రాంతా! నిన్నుఁగనియెన్నియో దినంబులాయెను. నా కారణంబునఁగదా నీవు కళింగనగరము విడిచి యందందు జరించుచు నానా కష్టములఁ బొందుచుంటివి. ఇట్టి కష్టంబులఁ బొందనేల? నీవు నావాఁడవై సమస్తైశ్వర్యములతోఁ దులదూగుము. పేరునకు నేను కళింగరాజ్యమునకుఁ బరిపాలకురాలుగా నుండుననుమాటయేగాని రాజ్యమంతయు నీయది యనియే తలంపుము. ఇంతవఱకును నేను నీయెడలఁ జేసిన దుష్కార్యముల మఱువుము. అద్వితీయ సౌందర్యవతియగు నొకకాంతందెచ్చి నీకు మహావైభముతో వివాహముఁ జేసెదను. ఇఁకనైనను నీవునామాటలు విని సుఖింపుము. "సిరి రా మోకాలొడ్డువాఁడుందురా!," యని పలికెను.